# ది యునైటెడ్ ఇండియా లైఫ్

## అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్

హెడ్ ఆఫీసు : మదరాసు, 1906 లో స్థాపింపబడినది.

ట్రస్టీ : మద్రాసుయొక్క అఫీషియల్ ట్రస్టీ.

| | | |
|---|---|---|
| అమలునందున్న పాలసీలు | రెండుకోట్ల రూపాయలను | మించినవి. |
| మొత్తపుఆస్తులు | ఏబదియైదులక్షల రూపాయలను | మించినవి. |
| సంవత్సరాదాయము | పండ్రెండులక్షల రూపాయలను | మించినది. |

పెట్టుబడులలో పూర్తియైన, నికరమైన రక్షణ; క్లెయిముల సత్వరమును, న్యాయసమ్మతమునగు పరిష్కారము; కార్యనిర్వహణమున పోడిమి; మంచిబోనసుతో కూడియుండు తగుమైన ప్రీమియములు; పోలసీహోల్డరులకు ఫలకరమును, సహాయకరమును, సత్వరమును అగు సేవ,

ఈ కంపెనీకి ఘనతే కలుగజేయుచున్న ప్రత్యేక లక్షణములు.

మనదేశమునందు వివిధతావులయందు గల ఈకంపెనీ ప్రతినిధులకుగాని, హెడ్ఆఫీసువకుగాని వ్రాయుచో పూర్తివివరములు వెంటనే పంపబడును.

"యునైటెడ్ ఇండియాలైఫ్ అస్యూరెన్సు బిల్డింగులు."
సెంబుదాస్ వీథి; మద్రాసు.

యం. కె. శ్రీనివాసన్.
మేనేజింగు డైరెక్టరు.



## గమనింపుడు

మా మ్యాన్ ఇన్సూరెన్సు పద్ధతియొక్క అత్యద్భుతమైన అభివృద్ధిని గమనింపుడు.

ఇంతటి కొద్ది కాలములో జరిగిన **42,00,000** ఇట్టి క్రొత్త పద్ధతిని నమ్మగలరా?

## నిజముగ జరిగిన సంగతి

వైద్య పరీక్ష లేదు. స్త్రీ పురుష వివక్షత లేదు.

ఇది శాస్త్రీయమైనది—ఇందు బోనసుగలదు—గ్యారంటీడ్ లాభములనిచ్చును.

మీ అర్థాంగితో కలసి ఒకజాయింటు పోలసీని తీసికొనుడు.

ఏజెన్సీ షరతులకు, ఇతరవివరములకు నేడే వ్రాయుడు.

### ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్, డిల్లీ.

మద్రాసు బ్రాంచి : 22, సెకండులైన్ బీచ్, జార్జిటవున్.

మదరాసు రాజధానిలో ఇతర బ్రాంచీలు :—1. విజయనగరము, 2. గుంటూరు, 3. తెలిచ్చేరి, 4. ట్యూటికారిన్ లేక సదరన్ యిండియాడిస్ట్రిక్ట్స్.

# విషయసూచిక


౧. ప్రభూ ... ౩౧౩
—తురగా వేంకటరామయ్య

౨. యేప్రిల్ ఒకటవ తేదీ ... ౩౧౪
—కాటూరి వెంకటరామారావు

౩. వాంఛలు : నాగరకత ... ౩౨౦
—అరవిల్లి నరసింహాచార్యులు బి. ఏ.

౪. జాకి ... ౩౨౧
—జి. జాషువ

౫. 'కలిగిశర్కం లేక దరిద్రం' ... ౩౨౩
—మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మ బి. ఏ

౬. ఖర్జూరపుర పుణ్యక్షేత్రము ... ౩౩౦
—గోదావరి సత్యనారాయణ బి. ఏ.

౭. గొంగళిపురుగులకథ ... ౩౩౩
—కనుపర్తి వరలక్ష్మమ్మ

౮. ప్రేమభిక్ష ... ౩౩౭
—పెమ్మరాజు రాజగోపాలము బి. ఏ.

౯. గ్రంథాలయములు : గవర్నమెంటు గ్రాంటులు ... ౩౩౮
—ఊ. వెం. శ్రేష్ఠి

౧౦. అబ్దుర్ రజాక్ ఖాన్ లారీ ... ౩౪౦

౧౧. విచ్ఛిన్నప్రణయము ... ౩౪౪
—వాడ్రేవు చలపతిరావు

౧౨. ముగ్గురు సాధువులు ... ౩౪౯
—తల్లాప్రగడ ప్రకాశరాయుడు

౧౩. స్త్రీమూర్తి ... ౩౫౪
—శ్రీపాద వెంకటావధాని

౧౪. చెలి ... ౩౫౫
—చిట్టి సుందరరావు

౧౫. జనని ... ౩౫౬
—ముక్కవిల్లి వెంకటనారాయణ బి. ఏ.

౧౬. కీలుబొమ్మ ... ౩౫౭
—కొడవటిగంటి కుటుంబరావు

౧౭. స్త్రీవిద్య ... ౩౬౦
—వల్లభదాసు రాజగోపాలరావు, బి. ఏ.

౧౮. సత్కవిసాంత్వనము ... ౩౬౨
—శ్రీ శేషాద్రి రమణకవులు

౧౯. నేటిసాహిత్యము ... ౩౬౪
—వడ్లమూడి వేంకటరత్నము

౨౦. మణిమాల ... ౩౬౭

౨౧. గులాబి ... ౩౭౧
—మిత్తింటి నరసింహమూర్తి, బి.ఏ.,బి.యల్.

౨౨. జిజ్ఞాస : మీమాంస ... ౩౭౩

౨౩. గాంధర్వము ... ౩౭౪
—అకుండి సత్యనారాయణ.

౨౪. సంపాదకీయసమాలోచన ... ౩౮౧

౨౫. ఇన్స్యూరెన్సు విషయములు ... ౩౮౨
—జమిలి నమ్మాళ్వారు

౨౬. ప్రవాసి ... ౩౮౩
—వజ్ఝల కాళిదాసు



## నిజామురాష్ట్రమునకు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని చీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములులేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమతమ చందాధనమును వారికి పంపుచు ఆవిషయమును ప్రత్యేకముగ మా కార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొననగును.

—ఇట్లు, ఆంధ్రభూమి మేనేజరు.

చీఫ్ ఏజెంటు నామము, చిరునామా :

శ్రీయుత కాలేరు పెంటయ్యగారు, 4121 మూసాఖాన్ వీధి, శికిందరాబాదు.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

## ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :— మ-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషను యియ్యబడును.

### ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు, 2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును, 3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు, 4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి, 5. పట్టాదారులకు ఋణము లియ్యబడును, 6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును, 7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును, 8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

జనన భీమా శిశుపోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :— సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

**ఆంధ్రప్రావిడెంటు కంపెనీ, గాంధినగర్, బెజవాడ.**

ఆంధ్రకీర్తిగ్రంథమాల: ౧.

## ఆంధ్రరత్నములు

(మొదటి భాగము.)

ఇందు రుద్రమ్మ, గణపమ్మ, నాగమ్మ, మాంచాల, గంగమ్మ, మహాలక్ష్మమ్మ, సీతమ్మ, మల్లమ్మ, రమణమ్మ అను తొమ్మండుగురు తెనుగుతెఱవల జీవితములు తేటతెనుగున బాలికలకును, స్త్రీలకును ఉపయుక్తముగ నుండునట్లు వ్రాయబడినవి. స్త్రీవిద్యాభిమాను లాదరింపదగిన గ్రంథము. గ్లేసుకాగితములు, క్రౌనుసైజు. 96 పుటలు. చక్కని అచ్చు. ప్రతి ఒక్కంటికి 0—9—0 అణాలు.

చిరునామా :—

ఆంధ్రభూమి కార్యాలయము : వేపేరి, మదరాసు.

**కామశాస్త్రము** ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృత భాషలో వ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుఁగుసేఁత. రైలులో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూఁడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తేటమగును. అల్లరి చిల్లరి వ్రాఁతలుకావు. ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాఁబట్టి దీనిగొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒక్కరూపాయ.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

# ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ

## లిమిటెడ్

## బందరు

స్థాపితము—1925.

కొలది సంవత్సరములలోనే అద్భుతమగు అభివృద్ధిగాంచిన సంస్థ.

| | |
|---|---|
| 1933 లో జరిగిన వ్యాపారము | 19,42,000 |
| సాలీనా ఆదాయము | 3 లక్షలు |
| భీమానిధి | 7 లక్షలు |

మిత వ్యయము, నిర్దుష్టపరిపాలన మా కంపెనీయొక్క ముఖ్యలక్షణములు.

సాలీనా చెల్లించు ప్రీమియములపై నూటికి రు 2—8—0 లు మినహాయింపు; రద్దయిన పట్టాలు, బాకీలుపడిన ప్రీమియములు చెల్లించవలసిన అవసరంలేకుండగా తిరిగి అమలులోనికి తెచ్చుట మొదలగు అనేక సౌకర్యములు గలవు.

మొదటి వాల్యుయేషనులోనే సాలుకు 1000-కి రు 10 లు బోనసు పంచబడినది.

అన్నిచోట్లను మంచి కమీషనుపై పలుకుబడిగల ఏజంట్లు కావలెను.

వివరములకు:—

య. మంగయ్య, బి.ఎ, బి.ఎల్.,
కార్యదర్శి.

“ఆంధ్రభూమి”



[సినీమానాట్యమునుండి విరమించుకొనిన]
సు లో చ న క న్య

"ఆంధ్రభూమి"



ఆర్యుడు గోపిశెట్టి రామచంద్ర నాయుడు, బి.ఏ.

[ఆంధ్రభూమి భావ, భాద్రపద సంచిక పుట ౬౩౯.]

# ప్రభూ !

✠

నిజము లేదా ?
జీవ
నియతి లేదా ?
వేడి
కన్నీటి సంద్రమే
కామింతువా ? ప్రభూ
చేయించితివికోటి
శిల్పాలు నా చేత
ఒక్కటైనా మెచ్చ
కున్నా వదేలనో ?
చేతిలో భావాలు
చిందులాడే వేళ
నాల్కపై పువ్వుదేనె
నాట్యమాడే వేళ
మరచినానా
నిన్ను
మానినానా
పూజ
మరుపు లేనే లేని

మహితవ్యర్థమ్మేనా ?
జీవశిల్పము
సృష్టి
జేయజాలని
వృథా
బ్రతుకేల ?
కళ యేల ?
పాడుటేలా ?
నేడే
బొమ్మలన్నీ
నీవే
దుమ్ముగా జేసి
ఈ
ప్రళయవార్ధితరంగ
భంగాలలో గల్పి
ఆనందముగ
నాట్య
మాడుకోవోయ్
ప్రభూ !

. . . . . . ✠

—తురగా వేంకటరామయ్య.

# యేప్రిల్ ఒకటవ తేదీ

(గతసంచిక తరువాయి)

## ౪

అప్పటికప్పుడే ఒంటిగంటపైదాటింది. ఫాదిరిగుడి అంతటా నిశ్శబ్దము స్వేచ్ఛాసామ్రాజ్య మేలుతూంది. పుష్యమాసపు చలికాగలేక ప్రజలు త్వరగానే పడకలు చేరుకున్నారు. ఫాదిరి గుడికట్టడములన్నీ మంచుపొరలలో తెప్పతేలుతున్నాయి. శతాబ్దములనుండీ శీతవాతవర్షాతపములకాగి నిల్చినందువల్ల నలుపెక్కిన గోడలతో మహోన్నతములైన శిఖరాలతో చర్చి ఇళ్ళకు మధ్యగా ఉంది. దూరంనుంచి చూసేవారికి చర్చి ఒక పెనుభూతములాగు భయంగొల్పుతూంది. నిరుపేదలు లక్ష్మీదేవికితోడు నిద్రాదేవికికూడా దూరులై వడవడ వణుకుతూ తమ దౌర్భాగ్యాన్ని నిందించుకుంటూ కూచున్నారు. సుఖనిద్రావశులైన లక్ష్మీపుత్రుల కా దీనుల తలంపేలేదు.

సుశీలకీ నిద్రలేదు. గదిలో ఆమెగాక వేరొకజీవమే లేదు. ఇల్లంతా నిశ్శబ్దమయము. ఆమె దృష్టుల ప్రయత్నంగా పైకిపోయాయి. చేతులు జోడించుకొని ఆ యువతీమణి ధ్యాననిమగ్నయైపోయింది. ఆ నిశాసమయమున—సమస్త జీవకోట్లూ నిద్రావస్థలో మైమరచి ఉన్న ఆ నిశాసమయమున—పరమేశ్వరధ్యానమున మునిగిఉన్న ఆశోకదేవతను మనోదృష్టియందైనను మూర్తీభవింప చేసుకొనగలిగినవారు ధన్యులు.

ప్రకాశమానంగా వెలుగుతూఉన్న దీపపుకాంతిలో అశ్రుగళితములగు నామె నిమీలితనేత్రములు మిలమిల మెరుస్తున్నాయి. తరంగసంక్షుభితమగు సముద్రంలాగు ఆమె వక్షోభాగము పైకిలేస్తూ, కిందికిపడుతూ మనోగత భావోద్రేకాన్ని వ్యక్తపరుస్తూంది. ఆమె పెదవులు మాత్రం కొద్దిగా చలిస్తున్నాయి. భగవంతుని సన్నిధి కల్పించుకుని తన దీనావస్థను విన్నవించుకుంటూంది కాబోలు ఆ పవిత్రహృదయ!

ఆమెమాటలు స్పష్టంగా వినబడడంలేదు. చివరకి మాత్రం 'తండ్రీ! ఇంక నే నీ ఇంట్లో ఉండలేను. నాకొక దారిచూపించి రక్షించవా?' అని గట్టిగాపలికి ఒక నిట్టూర్పు విడిచింది.

ఇంతలో దొడ్లో ఏదో శబ్దమవడంవల్ల ఆమె ధ్యానానికి భంగంకలిగింది. ఎవరైనా తన్ను కనిపెడుతున్నారేమో అని సుశీలలేచి తలుపుతెరిచిచూసింది. దొడ్లో ఎవ్వరూలేరు. చప్పుడుకి కారణం ఆలోచిస్తూ ఆమె నాలుగువేపులా చూసింది.

చీకట్లు దట్టంగా భయంకరంగా వ్యాపించి ఉన్నాయి. దూరాన్నించి ఫాదిరీగారిమేడమీది దీపముకటిమాత్రం ఆ గాఢాంధకారాన్ని భేదించుకుని ఆమెను కనబడ్డాది. తత్క్షణం ఆ దీనురాలికొక ఆలోచన తోచింది.

అప్పుడు ఫాదిరిగుడిసంస్థలో 'రెవ రోజారియో' అనే వయోవృద్ధుడగు అమెరికాదేశస్థుడు ఫాదిరీగా ఉన్నాడు. నిరాడంబరజీవి. ప్రజాసేవయే సర్వేశ్వరసేవ అని నమ్మిన ఉన్నతభావపూరితుడు. చుట్టుప్రక్కల క్రైస్తవులేకాక ఇతరులుకూడా ఏదోవిధంగా అతని సహాయం పొందినవారే. అతను వచ్చినతరవాతనే ఫాదిరి గుడిసంస్థకు అనుబంధంగా ఒక వైద్యశాలను కూడా ఏర్పాటుచేశాడు. బాధపడేవారినిచూస్తే అతని హృదయం కరిగిపోయేది.

ఆ దయార్ద్రహృదయుని దగ్గిరికిపోయి తన అవస్థను చెప్పుకోడానికి సుశీల నిశ్చయించుకుంది. ఆ తలపుతోనే ఆమెకు ఆశాజ్యోతి జనించినది. ధైర్యం తిరిగి వచ్చింది. ఆ కష్టసమయంలో తనకి సహాయంచెయ్యగల సమర్థు డతడొక్కడే ఆమెకు కనపడ్డాడు. సర్వేశ్వరునికి కృతజ్ఞతాపూర్వకవందనము లర్పించినది.

ఇంట్లో అందరూ నిద్రలోఉన్నారు. వీధిలో

ఎక్కడా పడిలేదు. వెనకముందు లాలోచించకుండా సుశీల పాదిరీబంగాళాకు బయలుదేరింది. బంగాళా చుట్టూ పువ్వులతోటఉంది. రెండువేపులా పూల జాతులు నాటబడినదారినిపోయి ఆమె ప్రధాన ద్వారాన్ని సమీపించింది. అక్కడ బంట్రోతుతో 'పాదిరీగారితో కొంచెంతొందరగామాట్లాడాలి చెప్పు' అంది.

పాదిరి రోజారియో ఆరడుగులయెత్తుమనిషి. ఆజాను బాహుడు, ముఖము గంభీరము, నిత్యప్రసన్నము. కళ్ళు తేజోమయములు. దయారస భరితములు. సుశీల నమస్కారాన్ని ఆదరపూర్వకంగా అందుకుని రోజారియో ఆమెను మేడమీదికి తీసుకెళ్ళాడు. సుశీలను ముందు కూర్చోమనిచెప్పి ఆయన యెదురుగా కూర్చున్నాడు. రోజారియోకి సుశీలయందు మంచి గౌరవభావం ఉంది.

సుశీల కతడాసమయంలో తండ్రికంటె ఎక్కువగా కనబడ్డాడు. దొరగారూ, అతనిభార్య కూడా ఆమె దీనచారిత్రమును విని జాలిపడ్డారు. రోజారియో ఆమెను ఓదార్చి 'అమ్మాయీ! నీకు పరవాలేదు. విచారించకు. నే నిదివరకే మీమామగారివల్ల నీవు నిర్దోషివని విన్నాను. కాని ఇంట్లో భార్యాకోడళ్ళూకలిసి చేసే దుర్మార్గమును అణచడానికి తనకి శక్తిలేక పోయింది. చెప్పుడుమాటలచేత నీ భర్తమనసు విరిగి పోయింది. ఇంక నువ్వాయింటికి వెళ్ళనంటున్నావు గనుక ఇక్కడే ఉండిపో. మిగిలినసంగతి రేపు ఆలోచించుకుందాం.' అన్నాడు. సుశీల కాపలుకులు అమృతప్రాయములైనవి.

ఆ మరునాడు భావికర్తవ్యాన్నిగురించి సుశీలతో దొరగారు చాలాసేపు మాట్లాడాడు. చివరకామె అభిప్రాయాన్ని అనుసరించి దొర విద్యాశాఖాధికారికి రాసి రాజమహేంద్రవరంలోని స్త్రీల ట్రైనింగుస్కూలులో సెకండరీగ్రేడుట్రైనింగు విద్యార్థినిగా సుశీలను చేర్పించడానికి ఏర్పాటుచేశాడు.

మళ్ళా సుశీలకి భావిజీవితమునందు కొంతఆశ జనించింది. ఇప్పుడు స్వతంత్రజీవనంచేసుకుని ఉన్నతాశయాల ననుసరించి నడుచుకోడానికి తగిన అవకాశం ఆమెకు లభించింది. ఏనాటికైనా తన నిర్దోషిత్వము బయలుపడవచ్చునుకదా అని ఆమె సంతోషించినది. భర్త విడనాడినపుడు తన జీవితమేలాగు గడుస్తుందా అని ఆమె హడిలిపోయింది. ఇప్పు డాభయము తీరి పోయింది.

వేసవికాలపు సెలవులవగానే సుశీల రాజమహేంద్రవరం పాఠశాలలో ప్రవేశించింది. ప్రభుత్వంవారి సహాయానికితోడు మేనమామయిచ్చిన ధనంకూడా వెచ్చించుకుంటూ ఆమె విద్యార్థినుల వసతిగృహం (హాస్టల్)లో ఉండి తనచదువు సాగించుకుంది.

చదువువ్యాసక్తిలోపడిపోయి సుశీల తన దుఃఖాలను చాలావరకు మరిచిపోయింది. ఈ రోజుల్లో 'రాజరత్నము' అనే అమ్మాయి ఆమెకి నమ్మిన స్నేహితురాలైనది. ఈ స్నేహితురాలియింటికి తప్ప సుశీల రాజమహేంద్రవరంలో వేరొకరియింటి కెన్నడూ వెళ్ళియెరగదు. బ్రాహ్మణులైనప్పటికీ తన్ను ఆదరముతో చూసిన రాజరత్నం జనని యగు మహాలక్ష్మమ్మను చూసి ఆమె తన తల్లినికూడా మరిచిపోయింది. ఆమెను, అమ్మా, అనే పిలుస్తూవుండేది. తన దీనచారిత్రమును విని సంపూర్ణసానుభూతినిచూపిన మహాలక్ష్మమ్మతోనే ఆమె తన కష్టసుఖాలను వెళ్ళబోసుకుంటూ వుండేది. అంతకీ తన ఒంటిజీవనం తలుచుకున్నప్పుడు దుఃఖం భరించరాకపోతే సుశీల తిన్నగా ఆమెదగ్గిరకే పోయేది. మహాలక్ష్మమ్మ ఓదార్పుమాటలతో కాని ఆమెవిచారం ఉపశమించేదికాదు.

పాఠశాలలో సుశీల గడపవలసిన రెండేళ్ళూ గడిచి పోయాయి. ఆ పాఠశాలలోనే ఆమె ఉపాధ్యాయినిగాకూడా నియమింపబడినది. రాజమహేంద్రవరంలో మహాలక్ష్మమ్మ ఆదరాభిమానములందే తన జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్న పిమ్మటనే సుశీల తన ఉద్యోగాన్ని అంగీకరించింది. ఆపూట్నే మహాలక్ష్మమ్మగారికి వేరొకయిల్లు ఉంది. అందులో సుశీల ఉండడానికి మహాలక్ష్మమ్మ యేర్పాటు చేసినది.

౫

నాలుగుసంవత్సరాలు గడిచిపోయాయి. ఈ మధ్య కాలంలో సుశీలకబురు భర్తకిగాని, అతనికబురు సుశీలకిగాని లేదు. అసమానలావణ్యవతియగు సుశీలను చూసి తోడివారు 'ఇంత చిన్నవయస్సులో యిల్లా పట్టుదలతోకూచుంటే యెలాగ ? నీ సౌందర్యమంతా అడివికాసినవెన్నెలయిపోవలసిందేనా ? నీ కిష్టమున్నట్లయితే ఎంతలేసి గొప్పసంబంధాలైనా వొస్తాయి. మళ్ళా పెళ్ళిచేసుకుని సుఖపడకూడదూ ? అని జాలిగా అనేవారు. ఒక్క నిట్టూర్పుతప్ప వేరేజవాబు ఆమె యిచ్చేదికాదు

ఇప్పుడామె కేసౌఖ్యానికీలోటులేదు. గౌరవనీయమైన సంఘమూ నలుగుర్లోనూ మర్యాదా, విద్యావ్యాసంగమూ, తగినంతధనమూ అన్నీ ఆమెకు అనుకూలంగానే ఉన్నాయి. కాని తన ఒంటిజీవనము జ్ఞాపకానికొచ్చి ఆమెను విచారంలోముంచిన గడియలులేకపోలేదు.

ఒక్కొక్కరాత్రి నిద్రపట్టక గతించిన దుఃఖానుభవాలు తలుపునకువచ్చి ఆమె గంటలకొద్దీ ఏడుస్తూ కూర్చునేది. ఇల్లాంటివని నిర్వచించడానికి వీలులేని దుర్భరమనోవేదనకు పాత్రై తెల్లవార్లూ వేగిపోయేది. ఒక్కరాత్రికే చిక్కి వసివాళ్ళు వాడిపోయిన ఆమె ముఖాన్నిచూసి స్నేహితులు కారణమడిగేవారు. వారికేమని చెప్పడానికీ ఆమెకి తోచేదికాదు

కాని ఈకారణం మహాలక్ష్మమ్మకు తెలియకపోలేదు. 'ఇల్లా ఉన్నకొద్దీ ఈమె జీర్ణించిపోవడం తప్ప లాభంలేదు. పాపం ! ఏంచెయ్యగలదు ? ఎన్ని సౌఖ్యాలున్నా, భర్త సమీపాన్నిలేనిలోటు ఆమె మెత్తనిహృదయాన్ని తినేస్తూంది. అంత అవమానం రచినప్పటికీ తనభర్త మంచివాడనే వాదిస్తుంది, అమాయకపుపిల్ల. ఇలాంటి పవిత్రహృదయాన్ని సరిగాగ్రహించి ఆమె స్నేహసౌఖ్య మనుభవించలేనివాని జన్మవ్యర్థము. మమ్మాటికీ వ్యర్థము. సంతోషంగానూ, విలాసంగానూ పైకి అంపరిస్తుంటారా తిరిగినా సుశీల హృదంతరాళంలోఉన్న విషాదవహ్నికీలలను ఎవరు గ్రహించగలరు ?' అని కుమార్తెతో చెబుతూ మహాలక్ష్మమ్మ ఆ అభాగినినిగూర్చి విచారిస్తూ ఉండేది.

ఈ మోస్తరుగా ఇంకొకయేడాది గడిచిపోయింది. మార్చినెల ఎండలింకా తీవ్రత నందలేదు. శీతోష్ణస్థితి సరిసమానమై మనోహ్లాదకరమై ఉంది. పరీక్షరోజులవడంచేత విద్యార్థులూ ఉపాధ్యాయులూకూడా ఏతత్పరియత్నావళిలో మునిగి ఉన్నారు. రాత్రివేళ తేళ్ళు బైటికొచ్చి హడావిడి చేస్తున్నాయి. దినమంతా శ్రమపడి పనిచేసి అలసిన కచేరీగుమాస్తాలు కాలాతిక్రమణమును లెక్కచెయ్యకుండా గ్రామపరిసర ప్రదేశాల్లో విశ్రాంతి ననుభవిస్తున్నారు.

ఒకనాటిరాత్రి పదకొండుగంటలవుతూంది. రాజమహేంద్రవరంలో ప్రధానరాజవీధులు తప్ప ఇతర ప్రదేశములు అలికిడిలేక నిశ్శబ్దములై పోయాయి. మల్లెపూల సౌరభంతో బజారువీధి నిండిపోయింది. అప్పటికప్పుడే కొంతసేపు చదువుకుని నిద్ర ఆవహిస్తూ ఉండడంచేత విద్యార్థులు పుస్తకాలుమూసేసి సిగరెట్లు ముట్టించారు కొందరూ; టీ తాగుతున్నారు కొందరూ; లోకాభిరామాయణం ముచ్చటిస్తున్నారు కొందరూ;

అల్లాంటప్పుడు మహాలక్ష్మమ్మగారి వీధితలుపు సుశీల తట్టింది. అంతరాత్రివేళ ఆమెరాకకి కారణం తల్లీ కుమార్తే కూడా ఊహించలేకపోయారు. లోపల ప్రవేశించి సుశీల 'అమ్మా! ఈ ఉత్తరం ఒకసారి చూడండి' అని మహాలక్ష్మమ్మతో అంది. ఆమాటల్లో అపూర్వమైన తొందరా, ఆనందమూ ద్యోతకమవుతున్నాయి. మహాలక్ష్మమ్మ ఉత్తరంవిప్పి ఇల్లా చదివింది.

'ప్రియురాలవగు సుశీలా.'

'ఈజాబు ప్రారంభించడానికిముందు నేను నీయెడల చేసిన అపరాధములకు క్షమాపణ కోరవలసి ఉంది. దయాస్వభావురాలవయిన నీవు నన్ను క్షమిస్తావనే ధైర్యంతోనే ఈ లేఖను రాస్తున్నాను.

'నువ్వు నిర్దోషివని నాకు రుజువయి చాలారోజు

లయింది. కాని నీయెడల నా అమానుషప్రవర్తనని తలుచుకున్నప్పుడల్లా నాలోనాకే సిగ్గేసి మళ్ళీ ఆమెకు జాబు యెల్లా వ్రాయగలను?' అని మోహం చెల్లక ఇంతకాలం ఊరుకున్నాను. నా దుర్మార్గత క్షమార్హముకాదని నాకు తెలుసును. ఎన్నివిధాల పశ్చాత్తాపపడినా నేను పై నేరాలకు భగవంతుని ముందువిధిగా జవాబుచెప్పుకుని తీరాలి. పశ్చాత్తాపపడి నంతమాత్రంలో నా బాధ్యత తొలగిపోజాలదు. కాని సుశీలా! ఈ యెడబాటుమూలాన్ని నీ నిర్మలహృదయం యొక్క నిజమైన విలువను నేను గ్రహించగలిగి నందుకుమాత్రం సంతోషిస్తున్నాను

'మనం విడిపోయినతరవాత వేసవికాలపు సెలవులకి నేను ఫాదిరిగుడికి వెళ్ళాను. కాని నువ్వులేని యిల్లు శూన్యమై దుఃఖప్రదమైపోవడంచేత అక్కడ రెండు రోజులేనా ఉండలేకపోయాను. తక్షణం ఏదో వంక పెట్టుకుని మళ్ళా చెన్నపట్నం వెళ్ళిపోయాను.

'నేనూ చెన్నపట్నంవెళ్ళగానే రోజారియో దొరగారిజాబు చేరినది. ఆ మహానుభావుని సదభిప్రాయానికి పాత్రురాలవైన నీ జన్మధన్యము. ఆ దయామూర్తి నీవు కేవలం నిరపరాధివని నాకు బోధపరుస్తూ రాశాడు. దురభిమానపూరితుడనగు నా కాబోధనలపుడు తలకెక్కలేదు. 'ఒకవేళ సుశీల నిర్దోషియేమో నేనే తొందరపడ్డాను కాబోలు' అనే సందేహము నాకు కలగడానికిమాత్రం అదే మొదలుసుమా.

'మరొకప్పుడు మా చిన్నసోదరుడూ వదినగారూ మాట్లాడుకుంటూన్నప్పుడు నేనువినడం తటస్థించింది. దానితో నా సందేహాలన్నీ తీరిపోయాయి. నిన్ను చూసి సహించలేక నీకూ మా అన్నకీ లేనిపోని సంబంధాలు కలిపించి మా వదినెలు మా అమ్మతో చెప్పారు. ఆమె వాళ్ళమాటలను విశ్వసించి నన్ను నమ్మించేసింది. ఇంకెవరుచెప్పినా నేను వినేవాణ్ణికాను గాని మా అమ్మయే స్వయంగా చెప్పడంచేత నామనస్సు చలించిపోయింది.

'చెప్పుడుమాటలువిని నీలాంటి పవిత్రురాలిని దుఃఖాలపాలు చేశానుకదా అని ఆనాడు నేను పొందినవేదన నేను రాయలేను. నాటినుంచీ నీ యెదుట నిలబడి నన్ను మన్నించమని ప్రార్థించాలనే అభిప్రాయంతో ఉన్నాను. నరులు అజ్ఞానులు. పొరపాటులేకుండా నడుచుకోడానికి మానవమాత్రుడికి సాధ్యంకాదు. కాబట్టి నన్ను క్షమించమని ఈ జాబు మూలంగా నిన్ను కోరుతున్నాను.

'ఈసరికి పరమదుర్మార్గుడనైన నన్ను నీవు మరచిపోయావనుకుంటాను. కాని నీవు ప్రతిఘడియా ప్రతిక్షణమూ నాదృష్టిపథంలోనే ఉంటున్నావు. గత సంవత్సరంనుండీ నేను ధవళేశ్వరంలోనే అసిస్టెంటు ఇంజనీరుగా ఉన్నాను. నీకు సమీపంలో ఉంటాననే ఆశచేతనే ఇక్కడికి బదిలీచేయించుకున్నాను. ఇంత దగ్గిరగా నేనున్నసంగతి నీకు తెలియదనుకుంటాను.

'ధవళేశ్వరంవచ్చిన పిమ్మట ఎలాగైనా నిన్ను ఒకసారి చూడాలని నేను చాలా ప్రయత్నించాను. ఎన్నోరోజులవరకూ సాధ్యంకాలేదు. ఎల్లాగు నిన్ను చూడగలనా అని పరితపిస్తూఉన్న రోజుల్లో ఒక నాడు అయాచితంగానే నీ దర్శనం లభించింది. ఏనాడో చెప్పనా? తోటి ఉపాధ్యాయినులూ నీవూ విద్యార్థులను తీసుకుని గోదావరి ఆనకట్ట చూడ్డానికి వచ్చిన రోజు జ్ఞాపకంఉందా?

'ఆహా! సుశీలా! ఆనాటి నీ లావణ్యమయమూర్తి ఎన్నడూ నా స్మృతిపథాన్ని బాసిపోదు. చిక్కి సగమైపోయినా నీ శరీరము సుకుమారమై సాత్త్వికతేజోయుక్తమై నాకు కనబడింది. అదివర కెన్నడూలేని నూతనసౌందర్యము నీలోనాకు గోచరించింది ఆ రోజున. నీతో క్షణం మాట్లాడదామనుకున్నాను గాని ధైర్యం చాలిందికాదు.

'ఇంక ఈ వియోగాన్ని నేను సహించలేను. నీ జవాబుకోసం పదిరోజులవరకూ చూస్తాను. జవాబిచ్చావా సంతోషమే. లేదా నీబసను నేనిదివరకే కనుక్కున్నాను గనుక సరిగా ఏప్రిల్ మొదటిరోజున సాయంకాలం అయిదుగంటలకి నేనే నీ దగ్గిరకి

స్వయంగా వస్తున్నాను. నన్ను హతాశుణ్ని చెయ్యవద్దని ప్రార్థిస్తున్నాను. ఇట్లు,

నీ అనురాగముకోరు గజానన్.'

మహాలక్ష్మమ్మ ఉత్తరాన్ని చదవడంముగించి ఒక్కనిముష మాలోచించి సుశీలవేపుచూసి నవ్వుతూ 'నీ అభిప్రాయమేమిటి?' అన్నాది

'మీ అభిప్రాయమే నాదీనీ. అమ్మా! మీకు ఉన్నవున్నట్లూ పరిస్థితులను వివరించడం నావిధి. నాయెడల కఠినంగా ప్రవర్తించడానికదే మొదలుగాని అంతకుముం దెన్నడూలేదు. అసలు అమాయకత్వమే కాని కల్మషంకల హృదయంకాదు. అసంగతి ఈబాబు వల్లనే మీకు తెలుస్తుంది.'

సుశీల ప్రతిమాటలోనూ ఉత్సాహము తొణుకులాడుతూంది. ప్రాతఃకాలమున కెందామరలు వికసించిన సరస్సులాగు ఆమెముఖం ఆనందభరితమై ఉంది. నేత్రాలు భావభరితములై మెరసిపోతున్నాయి. పూర్వపు దీనత్వము మాయమైపోయింది.

మహాలక్ష్మమ్మ ఇదంతాకనిపెట్టి 'సుశీలా! సర్వేశ్వరుడు దయాపరిపూర్ణుడు. ఈనాటికి నీకోర్కె సిద్ధించినది. చెప్పుడుమాటలవల్ల నీభర్తమనస్సు అల్లా మారిపోయింది కాని స్వతహాగా దుర్మార్గుడుకాడు. పశ్చాత్తాపంతో నిన్నింతదీనంగా వేడుకుంటున్నప్పుడు నిరాకరించడం ధర్మంకాదు. కాబట్టి ఏప్రిల్ ఒకటో తేదీకోసం నిరీక్షిస్తూఉండు.' అని మందహాసంతో అన్నాది. చెక్కిళ్ళయందు నొక్కులేర్పడేటట్లు దరహాసవదనంతో సుశీల సెలవుపుచ్చుకుని వెళ్ళింది.

## ౬

అత్యాత్రముతో నిరీక్షిస్తూఉన్న ఏప్రిల్ ఒకటవ తేదీ వచ్చింది. ఆరోజు సెలవుదినమవడంచేత సుశీల ఇంటివద్దనే ఉంది. భర్త ఉత్తరంవచ్చినప్పటినించీ ఆమెలోకలిగిన మార్పుచూసి మహాలక్ష్మమ్మ తనలో తనే నవ్వుకుంటూ ఉండేది.

పూర్వంకంటే వెయ్యిరెట్లు శోభతో ప్రకాశించేటట్లుగా సుశీల ఇంటిని చక్కబరిచింది. మధ్యాహ్నం నాలుగుగంటలకే తను శృంగారించుకోడానికి మొదలుపెట్టింది. గులాబీరంగు సిల్కుచీర ధరించింది. చక్కని లేసుపనిచేసిన రవికతొడుక్కుంది. తన చాతుర్యమునంతా వినియోగించి, జడవేసుకుంది. ఆమె ప్రతి అవయవంలోనూ సంపూర్ణమైన జీవకళ తొణుకులాడుతూంది. సహృదయురాలగు మహాలక్ష్మమ్మ ఆమె అసమానసౌందర్యాన్ని ఉత్సాహాన్నిచూసి సంతోషభరితురాలై 'సుశీలా! మీ ఆయన్ని మాకు చూపించనే చూపించవు కాబోలు?' అని పరిహాసపూర్వకంగా అన్నాది.

'ఇదంతా మీదయచేతనేకదూ!' అని వినయపూర్వకంగా ప్రత్యుత్తరమిచ్చి వెళ్ళిపోయింది. సాయంకాలం ఆరుగంటలయింది. ఆమె తన గదిలోకూచుని చదువుకుంటూ నిరీక్షిస్తూంది భర్తకోసం. మనస్సు పుస్తకంపైనిలేదు. అయిదుగంటలకే వస్తానన్న గజానన్ అంతవరకూ రానందుకు ఆమెమనసు ఖంగారుపడుతూంది. ప్రతిఘడియా వీధివంక చూస్తూ ఉండేది. వీధితలుపు బారుగా తెరిచిఉంచింది. నిముష నిముషానికీ ఆమెకి గాభరా యెక్కువైపోతూంది. 'ఇంక రాకపోతేఏదిదారి?' అనుకునేసరికి గుండెలు కొట్టుకునేవి.

ఏడుగంటలు అయింది. సుశీల గడియారంవేపు చూస్తూ నిట్టూర్పువిడిచింది. 'నాబతుకు మొదటినుంచీ ఇలాగేఉంది' అని వీధిలోకిచూసి ఏ అలికిడీ లేకపోవడంచేత హతాశురాలై గదిలోకివచ్చి కుర్చీలో కూలబడిపోయింది.

మరొక అరగంట గడిచిపోయింది. ఆశాభంగంచేత ఆమెమనస్సు అపరిమితమైన చీకాకుపడుతూంది. ఇంకొకసారి వీధిలోనికి చూసింది. తన నిర్భాగ్యాన్ని నిందించుకుంటూ గదిలోకిపోయి మంచంమీద బోర్లా పడుకుంది. ఆశాభంగానికి తోడు భర్తవస్తానని మాట నిలుపుకోనందుకు ఉడుకుమోతుతన మెక్కువై ఆమె తన నిస్సహాయతకు తనలోతనే ఏడవడం ప్రారంభించింది. భోజనంమాటే మరిచిపోయింది. ఎనిమిది గంటలయినప్పటికీ ఆమె అలాగేపడుకుని ఉండిపో

యింది. ఆ యేడుపులోనే ఆవేశభరమున శ్రాంతురాలైన సుశీలకు కొంచెం నిద్రపట్టినది.

వీధితలుపులల్లాగే తెరిచే ఉన్నాయి. గదిలో దీపం స్వచ్ఛకాంతులతో ప్రకాశిస్తూంది. ఇంతలో ఇంటిముందొక మోటారుబండి ఆగింది. అందులోనుండి యువకుడొకడు పాశ్చాత్యవేషంలో దిగి డ్రైవరుతో 'మళ్ళీ పొద్దుట తొమ్మిదిగంటలకి తీసుకురా మరిచిపోకు' అనిచెప్పి కారు వెళ్ళిపోగానే లోపలికి వెళ్ళాడు.

మోటారురావడమేనా సుశీల యెరగదు. ఇంతసేపూ తను ఎవరికోసంచూస్తూందో అతడే వచ్చాడని మాత్రం ఏం తెలుస్తుందీ ?

గజానన్ తిన్నగా గదిలోకి వెళ్ళాడు. మంచంమీద బోర్లాపడుకుని ఉన్న సుశీలను చూశాడు. గులాబీ కాంతులనీనుతూ ఆమె కంఠప్రదేశము సుపరిచితమై వియోగతప్తుడైన భర్తకి నేత్రపర్వమొనర్చినది. ఆమె మృదుహస్తములు తలదిండుపై చలనంలేకుండా పడిఉన్నాయి. చదువుతూ చదువుతూ ఉన్న పుస్తకము అల్లా బల్లమీద నేఉంది. చెక్కులపైని జాలువారిన అశ్రుబిందువులు దీపపుకాంతిలో ప్రకాశిస్తున్నాయి.

ఇవన్నీచూశాడు గజానన్. ఒక్క దీర్ఘనిశ్వాసము విడిచాడు. 'పాపం. అనుకున్న వేళకు నేను రానందుకు ఎంత విచారించినదో కమిలిపోయిన ఆ ముఖపద్మమే తెలియచేస్తూంది.' అనుకున్నాడు నెమ్మదిగా.

స్వచ్ఛమై, మధురమై, ప్రియతమమై కనబడుతూ ఉన్న ఆ మెడను ముద్దుపెట్టుకోవాలని అతనిహృదయం తొందరపడుతూంది. నిద్రావస్థలో ఉన్న ఆ సౌందర్యమూర్తి ఉచ్ఛ్వాసనిశ్వాసములు సుదీర్ఘములై గదినంతనూ సౌరభముతో నింపుతున్నాయి. మెల్లిగా భార్యను సమీపించాడు. కాని మళ్ళా వెనక్కితిరిగి చూశాడు ఏమి ఆలోచించుకున్నాడో కాని.

తలుపులన్నీ తెరవబడిఉన్నాయి. ఉరకలువేస్తూ ఉన్న మనస్సునునిలుపుకుని అతడు వీధివరకూవచ్చి ఇటూ అటూ చూసి తలుపులు బిగించుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

* * *

తెల్లవారిపోయింది. ఏప్రిలునెల రెండో తేదీ. ప్రపంచకమంతా సుశీలకు సంతోషమయంగా కనబడినది. భర్త తెలిపిన పశ్చాత్తాపానికీ, అతని అనునీయవాక్యాలకూ ఆమెహృదయము శరత్కాలనదీజలంలాగు కలకదేరి నిర్మలమైపోయినది. మామూలుకంటే శీఘ్రంగా లేచి ఆమె కాఫీ తయారుచేసింది. ఏడుగంటలకే ఇద్దరూ కాఫీ పుచ్చుకున్నారు.

కష్టసమయాన్ని భార్యను ఆదరించిన దయాహృదయురాలగు మహాలక్ష్మమ్మ దర్శనంచేసి కృతజ్ఞత చూపించడం తన ధర్మమనుకొన్నాడు గజానన్. అందుచేత కాఫీ అవగానే ఇద్దరూ మహాలక్ష్మమ్మ గారింటికి వెళ్ళారు. చిరవియోగానంతర సమాగమమున సంతోషతరంగమాలికల దేలిపోతూ ఉన్న ఆ దంపతులనుచూసి వారి కుటుంబమంతా ఆనందించింది.

తొమ్మిది అయేసరికి కారువచ్చింది. భార్యాభర్తలిద్దరూ మహాలక్ష్మమ్మకు నమస్కరించి సెలవు తీసుకున్నారు.

బజారుకిపంపి ఒక ఖద్దరుజామారూ, చీరా తెప్పించి, ఇంత పసుపు కుంకమూ పెట్టి హిందూసాంప్రదాయానుసారముగా మహాలక్ష్మమ్మ సుశీలకూ ఆమెభర్తకీ ఇచ్చి బహుమానించినది.

హిందూసంఘానికి చెందినవారిలోకూడా జాతిమతవివక్షతలను పాటించని భూతదయాపరులు మహాలక్ష్మమ్మవంటివా రుంటారుకదా అని తెలుసుకుని తమసంఘంలో అలాంటి ఆచారంలేకపోయినా ఆమె యిచ్చిన బహుమానాలను సుశీలాగజానను లిద్దరూ నమ్రశిరస్కులై గ్రహించి మోటారుబండి ఎక్కారు.

(సంపూర్ణము)

—కాఖూరి వెంకటరామారావు.

# వాంఛలు: నాగరకత

వాంఛలయభివృద్ధి నాగరకతా సూచకమని కొందఱు అర్థశాస్త్రజ్ఞుల యభిప్రాయము. కారణములు వెనుకటి ప్రకరణమున వివరింపబడినవి. అవి యెంతవఱకు సమంజసములు అనువిషయమును చర్చింతము.

మానవునకు వాంఛ పొడమినతోడనే దానిని సాధింపయత్నించుట సహజము. సాధ్యము, అసాధ్యము అను రెండుతరగతులుగా వాంఛను విడదీయనగును. సాధ్యమగు వాంఛలను శ్రమలేక సమకూడునవి, కొంచముశ్రమతో లభించునవి, విశేష శ్రమకుగాని లభింపనివి. వాంఛించు వ్యక్తికి అతీతములైనవి అను నాల్గుతరగతులుగా విడదీయవచ్చును. స్థూలదృష్టికి అసాధ్యములై ప్రస్తుతము విజృంభించుచున్న పరిశోధనా ఫలితములుగ మనకు సాధ్యములుగా నొనర్పబడిన ఆకాశయానము మొదలగునవి జనసామాన్యమున కందుబాటుగా నుండవు. అట్టివానిని గాంక్షించియు సామాన్యవ్యక్తి తన మనోరథము నణంచుకొనును. ఆయొక్క వాంఛను దీర్చుకొనుటకై యాతడామరణము శరీరశ్రమకోర్చి పాటుపడి సేకరించిన ద్రవ్యమును వెచ్చింపజాలడు. ఒకవాంఛకై యాతడు వెచ్చించిన ధనమును మఱొక్క వాంఛాపరిపూర్తికై తాను వెచ్చింపదలచిన ధనమునుండి ఖర్చుపెట్టును. తాను పూర్తిగావింపదలచిన వాంఛ తన కత్యవసరమైనచో దానిని పూరించుకొనుటకు సర్వసాధారణముగా అప్పులపాలగుట తటస్థించును.

ఇందుల కుదాహరణము. ఒకడు కొంత పైకముతో పట్టనమునకేగి ఒక సినీమా ప్రదర్శనము జూచుటకు కొంత వెచ్చించెననుకొందము. తిరిగివచ్చుటకు తనకు వలయు సంతధనము తానొనర్చిన ఖర్చువలన లోపించవచ్చును. అట్టియెడ నాతనికి ద్రవ్యలోపమును బూరించుదారి వేరొకటియుండదు. మనదేశము బీదదేశమగుట మనకు వలయునప్పుడు మనము శరీరశ్రమకు సహించి పాటుపడ తలచినప్పటికిని మనసేవ నంగీకరించి మనకు భృతినిచ్చువారు కానరారు. భాగ్యవంతములగు దేశములందు మాత్రమే యది సాధ్యము. సర్వవాంఛాసిద్ధికి హేతువగు ద్రవ్యమును జీవనాధారకములుగాని విషయములందు వెచ్చించుట పేదలకు ముప్పుదెచ్చును. ధనికుడు దరిద్రుడగును,

నాగరకతా లక్షణమిదియని నిర్ణయింపజాలము. పరిశుభ్రమగు వస్త్రముల ధరించుటవలన యొకవ్యక్తిని నాగరికునిగా భావింపనచ్చును. విలువగల చీనిచీనాంబరముల ధరించుటయే నాగరకతా సూచకముగా భావించు వేరొక విపరీతవ్యక్తి యాతని ననాగరికునిగా భావించి నిరసించును.

నాగరికతాభివృద్ధి లక్షణమునకై ప్రస్తుతము విదేశీయులు వెచ్చించు ద్రవ్యమపారము. ప్రస్తుతకాలపు టార్థికశాస్త్రజ్ఞులలో జాలమంది వాంఛల యభివృద్ధి దేశదారిద్ర్యమునకు మూలకారణమని నొక్కి వక్కాణించుచున్నారు. సహజములగు వాంఛల పరిపూర్తి సంతృప్తినిచ్చును. మానవునకు తేజము బలము నొసంగును. అసహజములగు

వాంఛలు పూర్తిగావింపబడ నేరవు. కారణములని యస్వాభావికము లగుటయే. దారిద్ర్యమును పెంపొందించు నాగరకత విషముకన్న హానికరము.

మనకును నూఱువత్సరముల క్రిందటి మన పూర్వులకునుగల తారతమ్యమును పరిశీలించిన నొకచక్కని యుదాహరణమగును. మానవజీవితమునకును సౌఖ్యమునకును సంతృప్తికిని వలయు సాధనములని మనము భావించుకొనుచున్న అనేకవిషయములు మన కసంతృప్తిని గూర్చుచున్నవి. మన పూర్వుల దైన్యమెఱుఁగని జీవనమునకు కారణము వారికి మనకుగల్గినన్ని వాంఛలు లేకుండుటయే. శరీరపోషణ కవసరమగు సాత్వికాహారమున వారు తృప్తినొందగలిగిరి. నాగరికత రక్తనాళముల ప్రవహించుచున్న మనకు రుజాహేతువులగు కాఫీ, మొదలగునవి తప్పనిసరియయి మనల బీడించుచున్నవి. ఏ పురాణకాలక్షేపముననో ఏ గ్రంథపరిశీలనముననో పర్వదినములందు ఏ నాట్యాభినయ సందర్శనములనో ముదమందు మనపూర్వులు ఆనందమునకు దోడు ఆరోగ్యమునుగూడ తమ దృష్టిపథమునుండి తొలగింపరైరి. మనమట్లుగాదు. దినదినమున చవులుగొల్పు ప్రకటనలకు భ్రమించి ఉత్తరోత్తరముగా నానంద మినుమడించునను భ్రమకులోనయి ప్రస్తుత నాగరకతా జయస్థంభములనదగిన సినీమాలు, నాటకములు, మొదలగువానిని నిరంతరము దర్శించుటయే నాగరకతా ముఖ్యలక్షణమని భావించుచు రుజాప్రదములని త్రికరణశుద్ధిగా నమ్మిన యాహారపానీయములను నాగరకతా లక్షణము కొఱతపడునేమోయని విసర్జింపనేరక దాసానుదాసులమై, ధనశారీరక మానసికబలమును గోల్పోవుచు దినదినము క్షీణించుచున్నాము.

వాంఛలకు పరిమితియుండుటయే మానవజాతికి శుభావహము. సూక్ష్మదృష్టితో పరిశీలించిన మానవకోటికిగల సంతృప్తియే ముఖ్య నాగరకతా చిహ్నము.

—ఆరవిల్లి నరసింహాచార్యులు, బి. ఏ.

## జాకి

౧

శా॥ ఏకాలంబుననో ? ఋణంబువడి, నన్నిన్నాళ్ళు సేవించి, నేఁ
డీకాయంబు పరిత్యజించితివి జాకీ! నాకు మర్యాదతోఁ
దోకాడింపుల స్వాగతంబులిడి సంతోషించునీదృష్టికిన్
నాకన్నన్ మొనగాఁడు నుత్తముఁడుఁగన్పట్టఁడుగా ? యుర్వరన్.

౨

శా॥ పెట్టుంబోతులు సన్నగిల్లెననుచున్ విశ్వాసహీనాత్ములై
చుట్టాలుం జనినారు, నీకడుపుఁ జిచ్చున్ దీర్చ మృష్టాన్నమున్
బెట్టంజాలని నాయెడన్గలుఁగు నీ ప్రేమానుబంధంబహో
పట్టున్వీడదు ; నీకృతజ్ఞతకు నాస్వాంతంబు నీరయ్యెడిన్.

౩

శా॥ ఇల్లేమైనది ? నీవునుంబయనమై యేతెంచియున్నావు నీ
వెల్లాటంబులు గట్టిపెట్టుమని, కొంచెంబేను కోపించినన్
యిల్లాలింబలె మోమునంచుకొని యడ్డే ! యింటికే తేరవో
యల్లా ! పెండిలినాడు, నీవినయ విద్యాలీలలూహించెదన్,

౪

చ॥ హృదయముఁజీల్చి చూడు మిది యిచ్చకమో ! యభిమానమో ! గ్రహిం
చెదవని యాకటన్నొగిలి చిక్కినగర్భము జూపి, యెన్నియో
బదములువడ్డ, నే నెడమ పాదమునన్ బ్రహరించుచుండితిన్
బదములు నాలుగున్న యొకభక్తుని నిన్నుఁబరాభవించితిన్.

౫

ఆ॥వె॥ నోరు లేదుగాని చేరినీవొనరించు పనులలోన వింత భాషగలదు
నీవు నేనుదప్ప నితరులెఱుంగరు కనులతోడ నవ్వఁ గలవు నీవు

౬

మ॥ చెలికాడు న్నినుఁబోలి యింటికడగ స్తీసేయునా ? పిచ్చుక
త్తులతో పైకొను చోరులం గవియ నుద్యోగించునా ? నాకునై
బలియై, ప్రాణములొడ్డువాఁడెవఁడు ? నా బంగారుజాకీ ! సుమ
స్సులతో నీకు సమాధిజేసితిని, యశ్రుస్నానమాడించితిన్

౭

ఉ॥ వాసనజూచి నాయకుఁడు పాదములూదిన తావెఱుంగు, న
భ్యాసము సేయు భృత్యుఁడు ప్రపంచమునందొకఁడున్నవాఁడె ? వి
శ్వాసము నీ కులాసికి, నిసర్గవిభూషణ మమ్మ ! యిట్టి సా
హసము జచ్చిపోయినది బాహుబలంబుడివోవు కైవడిన్.


౮

చ॥ ఎచటవు నీవు ? రావలవ దిచ్చట స్వామిశయించినాఁడు, నీ
కవమతివచ్చెఁ బొమ్మనెడు వర్థము దోఁప నదల్చి, భీకరా
రవములు సేయుచుండెదవు రాత్రులఁ జీమ చిటుక్కుమన్న బాం
ధవులకు లేనిగౌరవము నాయెడ నీకెటులబ్బె నాప్తుఁడా.

౯

మ॥ ఒడయుం డొంటరిగాడు, ఆపదలురావో ? యర్థరాత్రానసం
చడుగుంజాడల వెంబడించెదవుగాదా ? జాకి ! నీవిప్పు డి
క్కడ నిశ్వాసము లేని నిద్రవడి, యింకన్ మేలుకో వేలకో !
సడవంబాదము లాడకున్నయవి, శ్వానస్వామి ! నీ స్వామికిన్.

—జి. జాషువ.



# 'కలిగికర్మం లేకదరిద్రం'

౧

'బాబు ఇవ్వాళ ఎందుకూ అంతపోరుపెట్టి ఏడుస్తున్నాడు!'

'పాలు చాలలేదేమో ప్రొద్దుటినుంచీ ఒకటే ఏడవడం.'

'ఆరాధ్యుల వారింటికి ఆవుపాలకు పోయిరాక పోయినావా? ఉంటే పోశేవారేమో?'

'వెళ్ళివచ్చాను. వారింట్లో ఒకఆవునే విడుస్తున్నారుట. వారికి అవి కాఫీకే చాలవుట.'

'పోనీ మునసబుగారింటికో?'

'అక్కడికీ వెళ్ళాను. అక్కడా సున్నేఅయింది. వారి విశ్యంకుడు ఆవుపాలు త్రాగుతాడట. పోయడానికి వీలులేదన్నారు.'

'ఇంకెవరికీ ఆవుపాడి లేదల్లె ఉంది. అన్నట్లు ఆచార్లగారి ఆవును విడుస్తున్నారేమో కనుక్కొనివస్తావా?'

'వారింట్లో గాని పుట్టదు. పుష్కలంగా ఉన్నప్పుడే వాళ్ళు చోటుపెట్టరు. కోడెదూడగూడాను. అక్కడ వీలవుతుందీ?'

'మరింకేతి కనపడకుండాఉందే ఈరోజూ. ఏలాగబ్బా పిల్లవాడు ఇవ్వాళ పోరుమానడం!'

'కోమటి సుబ్బయ్యదగ్గర పాలడబ్బా ఏమన్నా దొరుకుతుందేమో! కనుక్కొనిరండి'

'అతడి కిదివరకే మనం ఏమాత్రమో బాకీఉన్నాము. ఇప్పుడు వెళ్ళితే నిర్మొహమాటంగా వీలులేదంటాడే అతను ఎప్పుడిది? అప్పుడు, రెండురోజులు ఇటో అటో ఇస్తుంటేనే వస్తువులకిబ్బంది పెట్టేవాడు ఇప్పుడింకేమన మాట దక్కనిస్తాడా?'

'మరెలాగ చెప్మా! పిల్లవాడు చేతికిరాకుండా ఉన్నాడే!!'

'ఇంట్లో ఏమీ డబ్బులేనట్లేనా?'

'మీకు తెలియకుండా ఎక్కడఉన్నది చెప్పండి? ఒకవేళఉన్నా ఇప్పుడు దాచుకుంటానా?'

'అదికాదే. నీమాట ఎరగనాఏమిటి? ఏమూలనైనా ఒకబేడ డబ్బులుంటే పాలడబ్బా చిన్నదైనా ప్రస్తుతం తేవచ్చునని.'

'బేడడబ్బులే! ఎర్రనికాని చూచి ఎన్నోరోజులయింది.'

'పోనీ బియ్యమయినా కొట్లోపోసి పాలడబ్బా తెస్తాను. మూడుసోలలు ఇలా ఇవ్వు.'

'....................'

'ఎందుకు ఆలోచిస్తావు? త్వరగా తీసుకోరా'

'ఆలోచనా లేదు ఏంలేదు. అవీనిండుకున్నాయి మన కర్మంకాలితే. ఈపూటకు సరిపోయే తవ్వెడో, లేక మూడుసోలలో ఉంటవి.'

ఆ బ్రాహ్మణుడు ఉసూరుమన్నాడు. పిల్లవాడా నోరుమూతలేకుండా ఏడుస్తున్నాడు. డబ్బులులేక పోగా బియ్యంపోసి పాలడబ్బా తెద్దామన్నా బియ్యం కూడా ఆపూటకే ఉన్నవి. కళ్ళ నీళ్ళపర్యంతమయింది,

తనలో తనే ధైర్యం తెచ్చుకుని కళ్ళనీళ్ళు ఆపుకున్నాడు.

కళ్ళెత్తి చూసేసరికి భార్యచూపు తనచూపు కలిసినయి. ఆమెకళ్ళలో నీళ్ళు చూసేసరికి ఆయనకు దుఃఖము ఆగలేదు. గోటితో రెండుకన్నీటిబొట్లు మీటి

'పిచ్చిదానా! ఏడ్చి ఏంలాభం? పొయ్యి ఆ ఉన్నబియ్యమన్నీ పాలడబ్బా వస్తుందేమో? మన మాటా? ఒక్కరోజు భోజనంలేకపోతే చచ్చిపోములే.'

ఆనాటికి ఆ భార్యాభర్తలు పస్తు.

౨

ఆ బ్రాహ్మడిపేరు రామశాస్త్రి. చిన్నప్పటి నామకరణము అదే అయినప్పటికీ, చేసేపనివల్ల, భాగ్య భోగ్యాలు లేకపోవడంవల్ల ఆయన్ను అందరూ రామయ్యా అనే అంటారు.

ప్రపంచకములో గౌరవంతెచ్చే ధనానికి ఆయన వెలి అయినాడు. అందువల్లనే గౌరవానికీ వెలి అయినాడు.

ఆయన తండ్రి బ్రతికిఉన్న రోజులలో ఒకటో రెండో ఎకరాలభూమి ఉండేదే. అందరు బ్రాహ్మల మాదిరే ఆయనతండ్రీ పెద్దపోకిళ్ళు పోయినాడు. చనిపోయేసరికి ఆస్తిపోయను అప్పు సంపాదించి ఆయన చస్తే, కుమారుడు ఆస్తికీ, అప్పుకూ సరిపుచ్చి పై ఉత్తరీయంతో అపల్లెటూరు చేరాడు.

అక్కడయినా ఆయన సంపాదనకు వేరేమార్గం లేదు. ముష్టిచెంబే సాధనమయింది. అందువల్లె రామశాస్త్రి రామయ్యా అయి ఊరుకున్నాడు. అప్పుడప్పుడు ఎవరికయినా అవసరంవస్తే అవిడా ఆయన నీళ్ళుతెచ్చియిచ్చి, అన్నంవండిపెట్టి, దానికి ప్రతిఫలంగా వారు మర్యాదగా ముట్టచెప్పినదానితోనూ, ఆయన ముష్టికి పోయి సంపాదించినదానితోనూ, వారు మెల్లెగా కాలంబుచ్చుతున్నారు.

ధనం లేకపోవడంగాని, గౌరవం లేకపోవడంగాని వారికొక లోపంగా కనపడనేలేదు. ఆయనకు నలభయిసంవత్సరాలు, ఆయనభార్యకు ముప్పదిఅయిదు సంవత్సరాలు వచ్చినా ఇంతవరకు ఒక్క మగపిల్లవాడుగాని, కనీసం ఒక ఆడపిల్లయినా పుట్టకపోవడం వారికొకతీరని లోపమయింది.

సంతాననిరోధసూత్రాల వల్ల ఆ స్థితిలోఉండే దంపతులు సంతానాన్ని కోరగూడదు. సంతాననిరోధ ప్రచారంచేసే ఒక ధనికుణ్ణి 'నీకెందుకయ్యా ఆలా సంతానాన్ని కంటున్నా'వని ప్రశ్నిస్తే ఆయన 'నాకెంత మందిపుట్టినా తినడానికి కావలసినంత ఉంది. తమకు తినడానికే లేనివాళ్ళకు పిల్లలుగూడా పుట్టితే వాళ్ళకేమి పెడతారు?' అన్నాట్ట. ఆలాంటి నియమాలవల్ల బీదవారు ఏసౌఖ్యం కోరడానికి వీలులేకపోగా పిల్లలను గూడా మనసులోనైనా కోరగూడదు.

భగవంతుడుమాత్రం ఈ సూత్రాలకు విరుద్ధంగా భాగ్యవంతులకు ధనంఇచ్చినా చివరకు తినేసౌఖ్యం గూడా ఇవ్వడు. బీదవాళ్ళకు-గంపెడు పిల్లలనిచ్చి, భాగ్యవంతులను సంతానహీనులగా చేస్తాడు సర్వసాధారణంగా.

ఆయనకు ఈ సంతాననిరోధసూత్రాలు అర్థంకాకపోవడము ఆశ్చర్యమే. ఆయనే తలుచుకుంటే ఈ ఉద్యమమూ అవసరం లేకపోయేది. పెద్దలకు ఈ కంఠశోషా అవసరం లేకపోయేది.

సంతానంకోసం వారు చాలా పాట్లుపడ్డారు. మొక్కులు మొక్కుకున్నారు. ముడుపులుగట్టారు. చందలూరు మహాలక్ష్మమ్మదగ్గరకు వెళ్ళారు. సంతానగోపాలస్వామికి పూజలుచేశారు. స్వాములవార్లను దర్శించారు. తీర్థాలు పుచ్చుకున్నారు. ఆమె ప్రదక్షిణాలుచేసింది ఆంజనేయస్వామికి. అశ్వత్థ వృక్షానికి ప్రదక్షిణాలుచేసింది. గ్రహసంబంధమైన పీడేమోనని బాగులుచేయించుకున్నది. గ్రహచారము బాగులేదేమోనని గ్రహశాంతి చేయించుకున్నారు వాళ్ళకున్నంతలోనే. భగవంతుడు అనుగ్రహించలేదు. వీరి విషయంలో భగవంతుడు తన సాధారణసూత్రాన్ని అనుకరించలేదు అప్పట్లో.

కర్మపరిపక్వం కావలెనంటారు పెద్దలు. ఎప్పుడయేదీ ఎవరూ చెప్పలేరు. వాళ్ళ కర్మ పరిపక్వమయింది కాబోలు భగవంతుడనుగ్రహించాడు. మహాలక్ష్మమ్మగారు గర్భిణి అయినతర్వాత ఆ బ్రాహ్మడు పడ్డ సంతోషం చెప్పదరంకాకపోయింది.

నెలలు గడచినకొద్దీ మహాలక్ష్మమ్మగారి సంతోషాభివృద్ధి అలాఉండగా, రామయ్యగారి సంతోషం వర్ణనాతీతమయింది. ప్రపంచకంలోకి రాబోయే ఆబిడ్డ మీద అయన ప్రేమ కుదిరిపోయింది. మానసికంగానే ఆయన్ను చూచి కొందరు నవ్వనుగూడా నవ్వారు.

ఆ కొందరు నవ్వడానికీ కారణం లేకపోలేదు. భగవంతుడి అనుగ్రహంవల్ల ఆ పసిపిల్ల సక్రమంగా ప్రపంచకంలో పడాలె ఎన్నోగండాలు గడవాలె. ముక్కులో చెంద్రుకలు కొప్పులోకివచ్చినమాట. ఆ బ్రాహ్మడు పుట్టబోయే బిడ్డవిషయమై అంతప్రేమ కుదుర్చుకోవడం నవ్వులాటకు కారణమయింది. కాని ఆయనమాత్రం దాన్ని పిసరంతయినా లక్ష్యంచేయలేదు.

ఇన్నాళ్ళనుండి దురదృష్టవంతుడైన బ్రాహ్మడు ఒక్కసారిగా అదృష్టవంతుడయినాడు. అందరినోళ్లలో భగవదనుగ్రహంవల్ల ఆయనకు మగపిల్లవాడు కలిగాడు.

ఆయన అదృష్టమయినా అంతవరకే. కడుపునిండా పాలుపోయడానికైనా నోచుకోని అదృష్టం ఒక అదృష్టమేనా? తల్లిదగ్గరసరిపోను పాలుండేవే. ఆమెకు కొన్నిరోజులనించీ సుస్తీగా ఉంది. పాలు తక్కువైనయి. పిల్లడు విడవకుండా పోరుపెట్టాడు. ఆ పోరు మాన్పారు తల్లిదండ్రులు తమపస్తుతో.

తల్లిదండ్రుల పస్తుతో తృప్తిచెందినట్లున్నది కుమారుడు.

## ౩

పుట్టక పుట్టక పుట్టిన పిల్లవాడు గావడంచేత అల్లారుముద్దుగా పెరుగుతున్నాడు. ఆ తల్లిదండ్రులు ఆ పిల్లవాడు కోరడమే తరువాయిగా కోరిక తీర్చడానికి ప్రయత్నంచేసేవారు. తీర్చేవారు.

అందుకు వారు పడ్డకష్టాలుగాని, అసౌకర్యాలుగాని ఎవరూ గమనించలేదు. కడుపు నాయగట్టుకొనైనా పిల్లవాడి అభీష్టం నెరవేర్చడం వాళ్ల ప్రథమకర్తవ్యంగా పెట్టుకున్నారు వారిద్దరూనూ.

పిల్లవాడికి తీరేముచ్చట్లుచూసి ఆ గ్రామంలో భాగ్యవంతులైనవారుగూడా అసూయపడేవారు.

రోజూ నేతికారప్పూస, రోజుకొకరకం చొక్కా-లాగు, రోజుకొకరకం సొమ్ము ఆ పిల్లవాడు జమీందారుల పిల్లవాడుగా కనపడేవాడు. అందులకై ఆ దంపతులు సంతోషంలో తమ సర్వసౌఖ్యాలను త్యాగం జేశారు.

ఇహ వీళ్ళేమి బాగుపడతారని కొందరూ, ఈ ముసుసుకోవడానికి వాడుతిరిగి వీళ్ళను వాతపెట్టే వాడవుతాడని కొందరూ, తలాఒకమాట అన్నారు.

ఆ దంపతులుమాత్రం కుమారుణ్ణి పువ్వుల్లోపెట్టి పెంచుకున్నారు.

## ౪

ఈడు రావడంతోటే అక్షరాభ్యాసం చేయించారు కృష్ణుడికి. కృష్ణుడు క్రమంగా పాఠశాలకుపోయి ఆ గ్రామపుబళ్ళోగల తరగతులన్నీ ఒకటితరువాత ఒకటి పరీక్షఅయినాడు.

ఏవిధంగానైనా వాడి చేతిమీదిగా సౌఖ్యాలు పొందవలెననీ, తరించవలెననీ వారికోరిక గనుక పిల్లవాడికి ఇంగ్లీషుచెప్పిస్తే బాగుంటుందని తల్లిదండ్రులిద్దరూ ఏకగ్రీవంగా నిశ్చయించుకున్నారు. పంతులుగారు పిల్లవాడు వృద్ధిలోకి తప్పకవస్తాడన్నారు.

వృద్ధిలోకిరాదగ్గ పిల్లలందరికీ అవకాశాలుండవు. ఈ కాలపు చదువులకన్నింటికీ డబ్బుకావాలె. డబ్బున్నవాడికే చదువు. చదువుకున్నవాడికే ఉద్యోగం. అంటే డబ్బుగలవాడికే ఉద్యోగమన్నమాట. అదీగాక డబ్బున్నవాడికే సిఫార్సుగూడానూ. డబ్బు అనే పలుకుబడి లేకపోతే చదువుకొనీ నిష్ప్రయోజనమే అవుతుంది.

అయినా పిల్లవాడికి ఏ తంటాలుపడిఅయినా ఇగ్లీషు చెప్పించవలసిందేనని నిశ్చయమయింది.

అంతట రామయ్యగారికుటుంబం గుంటూరు చేరింది. పిల్లవాణ్ణి ఇంగ్లీషుబడిలో ప్రవేశపెట్టారు రామయ్యగారు.

అదివరలోనే భోజనానికిజరగని రామయ్యగారికి పట్టణవాసం కష్టమని తెలియకపోలేదు. అందుకూ ఆయన ఏదోఒక ఏర్పాటు చేసుకునేదిగాడు.

అదివరలో ఎంతబీదకుటుంబంలో పుట్టనివ్వండి, ఎంత బీదస్థితి అనుభవించనీయండి, కొంచెం చదువు

కొని ఉద్యోగంకాగానే వారి ఆడంగులకు ఎక్కడ లేని నాజూకూ బలుస్తుంది. అందులోనూ గుంటూరు వంటి చోట మరీనీ గుంటూరు బ్రాహ్మలలోను అలాంటి నవనాగరికులకు మంచిచేయూత.

ఉద్యోగస్థుల ఆడంగులు (ఉద్యోగమంటే ప్లీడరు గుమాస్తా దగ్గరనుంచి పైవి అన్నీ ఉద్యోగాలే) ఉదయంలేచి చీపురు పట్టుకోలేరు. పట్టుకుంటే చీపురు చెయ్యి చీలుస్తుంది. చెంబులు, అంట్లు తోమలేరు. ఇసుక వారిచేతులను గాయపరుస్తుంది. బట్టలుతుక లేరు, వాడుకకు నీళ్ళుతోడలేరు. చేతులు కండెలు కట్టుతవి. మంచినీళ్ళు తేలేరు. కాళ్ళు కండెలు గట్ట డమేగాక నామర్దాగూడానూ. కొందరు కొందరు వంటగూడా చెయ్యలేరు.

అందరూ భోజనంమాత్రం చేస్తారు.

సంపాదించే మగవాడికిగాని, కుటుంబక్షేమం కోరే వృద్ధస్త్రీలకుగాని, ధనవ్యయమయ్యే ఈనాజూకు గిట్టదు. నలుగురిలో నగుబాటని మగవాడు, మాట సాగక ముసలావిడా మాట్లాడలేరు.

అందువల్ల పట్నాలలో చాలామంది మంచినీళ్ళు తెప్పించుకుంటారు. అలాంటివారికి నీళ్ళు ఖరీదుకుపోసి చాలామంది జీవిస్తారు.

ఈజీవితాన్నే రామయ్యగారు అవలంబించారు. రామయ్యగారికి విధిగా నీళ్ళు మోయడం అలవాటు లేదు అడపదడప ఇంటివద్ద ఒకబిందెడు నీళ్ళు మోయ డంతప్ప పాపం! పట్నంలో ఇంటింటికీ, పేటపేటకూ తిరిగి నీళ్ళుపోయడానికీ, ఇంటివద్ద అన్నంవండిపెట్టి, పిల్లవాడిని సముదాయించుకోవడానికీ భార్యకు వీలుండ దని, ఆపని తనే పెట్టుకున్నాడు.

అలవాటులేని రామయ్యగారికి నీటికావడి మోత చాలా కష్టమనిపించింది. అయినా తప్పుతుందిగనుకనా? భుజాలు కాయలుగాచినవి. కావడిదింపితే కడుపునిండ దని అలాగే పెట్టుకుని తిరిగి మెల్లగా అలవర్చు కున్నాడు.

పిల్లవాడు తండ్రిమీదబడి ఆడుకునేవాడు సాయం త్రంవేళ. ఆయనకు భుజంమీది కాయలవల్ల కలిగేబాధ పిల్లవాని ముద్దుల సంతోషంలో మాయమయ్యేది.

“నాయనా! ఈకురుపులకు మందురాచుకోవేమీ?” అనేప్రశ్నకు “ఈకురుపులకు మందువేరే ఉంది తండ్రీ” అని తండ్రి సమాధానం చెప్పేవాడు. పిల్లవాడు అర్థం గాకపోయినా చిరునవ్వు నవ్వేవాడు.

క్రమేణ భుజముమీది కాయలు గట్టిపడి బాధ తగ్గింది

కృష్ణుడు స్కూలులోచేరి తెలివిగలవాడనిపించు కున్నాడు. రామయ్యగారు కష్టకష్ట వాళ్ళకాళ్ళు పట్టుకున్నారు జీతంసహాయానికని, గుడ్డలసహాయాని కని. కృష్ణుడు స్కూలుఫైనలు పరీక్ష అయినాడు మొదటివాడుగా

రామయ్య దంపతుల సంతోషం చెప్పడానికే వీలులేదు.

తిరిగి స్కూళ్ళు తెరిచేసమయానికి కాలేజీలో చేర్పించడానికే నిశ్చయించుకున్నారు రామయ్య గారు కుమారుణ్ణి. దొరగారుగూడా సహాయంచేస్తా మన్నారు.

యఫ్. ఏ రెండవ సంవత్సరంలో కృష్ణుడికి పిల్ల నిస్తామని వచ్చారు. కట్నంకోసమనీ లాంఛనాలు ముచ్చట్లకోసమనీ మహాలక్ష్మమ్మగారు, కొంచెం పాకులాడిందిగాని, కట్నాలు కానుకలు లేకపోయినా ఇస్తామని వచ్చినప్పుడే చేసుకోవడమే మంచిదని రామయ్యగారు పట్టుబట్టిన తరువాత ఆవేసవి సెల వులలో కృష్ణుడి వివాహమయింది.

పెండ్లయిన వారంరోజులలోగా పరీక్షాఫలితాలు వచ్చినవి. కృష్ణుడు మొదటితరగతి పరీక్షఅయినాడు. కోడలు వచ్చినవేళ చాలామంచిదని లోకమంతా ఒక్కటై అన్నది కృష్ణునికి పరీక్షకావడమనేది క్రొత్త కాకపోయినా.

కృష్ణుడు బియ్యేచదువుతుండగా అతని భార్య, సుశీల రజస్వల అయింది. ఆకాస్త మొక్కుతీర్చుకొని కోడలును కాపరానికి తీసుకువెళ్ళమని పెండ్లికూతురి తల్లితండ్రులు తొందరచేశారు. గాని చదువు కష్టం తరమనే కారణంవల్ల బియ్యేపరీక్షలయిన తర్వాత రామయ్యగారు కోడలిని కాపరానికి తీసుకువచ్చారు.

ఆయేడు బియ్యేకూడా మొదటితరగతిలోనే పరీక్షు అయినాడు కృష్ణుడు.

సుశీల కాపరానికి వచ్చినరోజున రామయ్య దంపతులు అమితంగా సంతోషించారు. తామకన్నది ఒక్కడే బిడ్డడయినా, భగవదనుగ్రహంవల్ల ఆఒక్కడివల్ల తాము పొందబోయే సౌఖ్యాలు తలుచుకుని ఆ భగవంతుడికి ప్రణమిల్లారు. తమజీవితపు ప్రథమ దినాలలో పడిన కష్టాలూ జ్ఞాపకంరాలేదు. అప్పుడు కుమారుడి విద్యకై పడుతున్న కష్టాలూ మనస్సులోలేవు. సంతోషంఒక్కటే వారికి కనపడుతున్నది.

వారి సంతోషానికి అదే మొదటిరోజూ, అదేచివర రోజూ అని వారికేంతెలుసును?

## ౬

హిందూసమిష్టి కుటుంబం పూర్వం ఒక గొప్ప ఆర్థిక సంస్థ గొప్ప సాంఘికసంస్థగా కూడా పనిచేసి పేరు గొన్నదేమో? ప్రస్తుతం కలహాలకు, అశాంతికి, దుర్భరమైన దురాచారాలకు ఆటపట్టయి ఆసంస్థ కూలిపోయింది.

దానికితోడు ఆధునికుల నూత్నాభిప్రాయాలూ, పెద్దలయందలి అగౌరవమూ కలసి ఆసంస్థను సమూలంగా విచ్ఛేదంచేసినవి. అసమిష్టి కుటుంబపు ఆకారమేమిగిలింది.

సుశీల మూడవఫారమువరకూ చదువుకున్నది. కృష్ణమూర్తికి అన్నివిధాల తగినభార్య. కాని ఆమె ఆ ఇంట కాలుపెట్టింది మొదలు ఆయింట అశాంతి కూడా ప్రవేశించింది.

ఆమెకూ, అత్తమామలకూ బొత్తిగా పడలేదు.

కృష్ణమూర్తి బియ్యేపరీక్షయి కలెక్టరుకచ్చేరిలో కుమాస్తాగా ప్రవేశించాడు. ఆయనసంపాదన నేరుగా సుశీలచేతిలో చేరేది. ఆమె స్వతంత్రించి తనకు కావలసినవన్నీ కొంటూ ఉండేది. అత్తరులకనీ, సబ్బులకనీ, చాకెట్లకనీ, ఊలుకు స్వెట్టర్లకనీ, అల్లిక నూలుకనీ మొత్తంమీద నెలకు కనీసం పదిరూపాయలయేది.

మొదటినుంచీ చాలకష్టపడ్డవాళ్ళేమో వృద్ధదంపతులకు ఈవ్యయం గిట్టేదిగాదు. రామయ్యగారు మనకెందుకులే అని ఊరుకుండేవాడే. ఆడదిగావడంచేత మహాలక్ష్మమ్మగారు ఊరుకోలేక ఏదోఅనేది అంతటితో, అత్తాకోడండ్లకు తాతా మనమడివరస అయ్యేది.

సుశీలకు తనమగడు సంపాదిస్తున్నాడని. మహాలక్ష్మమ్మగారికి తను సర్వకష్టాలూపడి, కని, పెంచి పెద్దచేసిన తనకుమారుడు సంపాదిస్తున్నాడని. సుశీలకు తాను అత్తగారిమాట వినవలసిన అవసరం ఏమాత్రం లేదని. ఎంత తనభర్త అయినా, అంతవాణ్ణిచేయడానికి కడుపు నాయకట్టుకుని కష్టపడ్డదాన్ని నేనేగదా నామాట ఆమాత్రం వినతాదా అని మహాలక్ష్మమ్మగారికి.

మాటమాట వచ్చినపుడు సుశీల మహాలక్ష్మమ్మగారిని మాట అచేదిగాదు. ఇంటివద్ద పెద్దవాడు మామగారున్నాడని అయినా చూచేదిగాదు. తానేమో ఉద్యోగంలోఉండి ఏభయిరూపాయలు సంపాదిస్తున్నవాడిభార్య. ఆమె నీళ్ళుపోసి పాట్టపోసికొన్నవాడి భార్య. ఆమెకూ తనకూ ఎక్కడపోలిక. ఆమె అన్నమాటకు ఊరుకోవలసిన అవసరమేముంది తనకు అని సుశీల ఆలోచన.

కృష్ణమూర్తి ఇంటికివచ్చేసరికి ఇల్లు నరకంగా ఉండేది. కృష్ణమూర్తి మనస్సు చివుక్కుమనేది. అతన్ని చూడగానే తల్లిమాత్రం ఆతనిమనస్సు ఎక్కడ కష్టపడుతుందో అని ఊరుకుండేదేగాని సుశీలే భర్త ప్రక్కనచేరి ఉన్నవిలేనివి కలిపి గోరంతలు కొండంతలుగా చెప్పేది. నిజంగ్రహిద్దామనే జ్ఞానంలేని అతను భార్యచెప్పినమాటలే నమ్మి, తనభార్య ఏమీ అనలేదనీ, అన్నీ తల్లే అన్నదనీ నమ్మేవాడు. అట్లా అట్లా భేదాభిప్రాయాలు బాగా నాటుకున్నాయి.

పర్యవసానంగా యౌవనదంపతులకు, తమసౌఖ్యానికి వృద్ధదంపతులు నాశనకారకులనే అభిప్రాయం పూర్తిగా కలిగింది.

## ౭

ఈవిధంగా రెండేండ్లు ఈడ్చేశారు మెల్లగా నలుగురూనూ. పరిస్థితులలో మంచిమార్పులేదు.

మనస్సులు కలవకపోయిన తర్వాత కలహం తటస్థించడం ఎంతోసేపు పట్టదు. పెద్ద కారణమూ అక్కర్లేదు.

సుశీల ఆరోజు సిల్కు రవికగుడ్డలు బేరంచేసి కొన్నది. మొత్తం పదిరూపాయలబేరం. కొనబోతుండగా అత్తగారు "పదిరూపాయలుఖర్చు ఇప్పుడెందుకే? పెట్టెనిండా అన్ని సిల్కువి, ఉత్తవి రకరకాలుగా రవికలు పెట్టుకొని" అన్నది. సుశీల మాట్లాడకుండా బేరంపూర్తిచేసి వర్తకుడికి పైకం యిచ్చిపంపింది.

తనమాట వినిపించుకోనైనా వినిపించుకోలేదని మహాలక్ష్మమ్మగారికి కష్టమనిపించింది "ఇదేంకాపురమమ్మా! ఎవరితీరాన వాళ్ళు ఇష్టంవచ్చినట్లు ఖర్చుపెడుతుంటే కాపురం ఏలాజరుగుతుందో ఏమిటో? ఇంతమాత్రం జ్ఞానంలేకపోతే మగవాడుమాత్రం ఎక్కడినించితెస్తాడు? అయినా నాకెందుకు వాడి కిష్టమయింతర్వాత?' అన్నది.

'వారికిష్టమయిందిగదా నాకెందుకులే అనే జ్ఞానం మీకున్నదా? మాటలు మాత్రం సరిగా రానిస్తే బాగుంటుంది. నాకున్నజ్ఞానం చాలు జ్ఞానంలేకపోతేనే ఆలాటిమాటలు వస్తవి.' అని అందుకున్నది అవకాశం కోసం ఎదురు చూస్తూన్నసుశీల.

'అయ్యో! అదేమిటే ఆలాఅంటావు? నిన్ను నేనేమి అన్నానూ? కొంచెం జాగ్రత్తగా వాడుకోమన్నానూ? అంతేనా?'

'అవును పాపం చూస్తున్నాను ఎందుకని ఇందాకటినుంచీని. నేనేమైనా కొనుక్కొంటూంటే మీకంత కళ్ళలో కారంపోసుకున్నట్లుంటుందేమీ?'

'నిజమేనే మాతల్లీ! బాగాచెప్పావు. మీరు తింటూంటేనూ, కట్టుకుంటూంటేనూ బొత్తిగా చూడలేక అవునా? మేంపడ్డ కష్టాలన్నీ మీరు సుఖపడుతూంటే ఏడుద్దామనే కాదూ? బాగాతెలియచెప్పావే మా అమ్మా.'

'కష్టపడ్డాం, కష్టపడ్డాం అంటారు ఎవరికోసం కష్టపడ్డారేమిటి? ఊరుకోలేకపోయినారు? ఆలికి అన్నంపెట్టడం ఊరికుపకారమా?'

'నిజమే ఆమాత్రం సలహా నాకప్పట్లో ఎవరూ ఇచ్చారుగారు. నేను కష్టపడ్డానని గొప్ప చెప్పుకో లేదు నాకష్టానికి నీవు దయతలుస్తావని. నేనేమనుకున్నానంటే చెప్పాను.'

'అక్షరాలా. అందులో సందేహంఏముందీ? నేను వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. నేనుతినడం, కట్టడం సుతరామూ ఇష్టంలేదు. వారు మీమాట వినకపోబట్టి సరిపోతున్నది. నేనుకాబట్టి మీతో ఈ రెండేళ్ళయినా కాపరంచేశాకాని ఇంకోరయితే ఈపాటికి ఈ కొంపకు నిప్పుపెట్టి లేచిపోయేవాళ్ళే.'

'నిజమే! నాలాంటి గయ్యాళిదానితో నీవుగాబట్టి వేగుతున్నావు. నీవుబాగానే పెట్టుతున్నావు తలవాచేటట్లు. నీవు లేచిపోవడమెందుకూ? మేమే లేచిపొయ్యేలాగా చేస్తున్నావు. ఉండమనలేక ఊదరానూ, పొమ్మనలేక పొగానూట.'

'వెళ్ళుతాం, వెళ్ళుతాం అని బెదిరిస్తారా? ఈ నిమిషంలో వెళ్ళవచ్చును. ఇక్కడ ఎవరికీ దిగులులేదు.'

'నీ అభిప్రాయం మాకిదివరకు తెలియక కాదు ఇంకా ఇక్కడఉన్నది. మామనస్సులకు ఆమాత్రం తెగింపులేక. ఏకష్టాలు పడయినా వాణ్ణి కళ్ళచూస్తూ ఉందామని. అంతే. అదిగూడా నీవు దక్కనిచ్చేట్లు లేదు.' అని కంట తడిపెట్టింది మహాలక్ష్మమ్మగారు.

'శుభమాఅని కూర్చొని సిందుఇంట ఎందుకూ ఏడవడం? ఎప్పుడూ ఏడుపే ఎందుకో ఒకందుకు ఎప్పుడు విరగడయిపోతుందోగాని ఈపీడ?' అని సుశీల అంటూండగా కృష్ణమూర్తి వచ్చాడు. సుశీల గొంతు వినబడ్డది. ఏదో రగడజరిగిందని తెలుసుకున్నాడు.

తల్లివెళ్ళి "నాయనా! మేంకష్టపడ్డామో, లేదో నిన్ను ఒకయింటివాణ్ణిచేశాము. భగవంతుడు రెక్కలిచ్చాడు. మేము ఇహ ఇక్కడఉండే అదృష్టం మాత్రం పట్టించలేదు. మాదోవ చూచుకుంటాము." అన్నది.

కృష్ణమూర్తి వెళ్ళి భార్యను రెండు మూడు మొట్టికాయలు వేశాడు. మహాలక్ష్మమ్మగారు "అదే బొత్తిగా బాగాలేదు. నేనుచెప్పినట్లు, నీవు కొట్టినట్లు లోకం అనుకుంటుంది. నీవుకూడా నేనేకొట్టిస్తున్నానని ఉన్నట్లు నీవు అనేకసార్లు అన్నావు. దాన్ని కొట్టవలసిన అవసరము ఏమీలేదు. మాకు, దానికి బొత్తిగా

కలవరు అనవసరమైన ఖర్చులు. మనస్సు కష్టాలు. అంతకంటె మేం పైనొంగడం మేలు'' అన్నది.

దెబ్బలు తిని సుశీల ఏడ్పు ఆరంభించింది. "నాకర్మం ఎప్పుడూ ఇంతే. నే నేమీ అనలేదు'' అని తనపక్షాన్ని సమర్థించుకున్నది. సమర్థింపే అవసరంలేని పరిస్థితులలో ఈసమర్థింపు ఇంకా ఎక్కువపనిచేసింది. కృష్ణమూర్తి అన్నీవిని "నాకూ తెలుసు నిన్ను కొడితే నేగాని ఆవిడ కళ్ళు చల్లగా ఉండవు. నీవైనా నాకెందుకని ఊరుకోవు. నేనేం చావనా?'' అన్నాడు.

ఈమాటలతో మహాలక్ష్మమ్మగారికి తమకు అక్కడ ఉండే యోగ్యతలేదని తెలిసింది. రామయ్యగారు కూడా అన్నీచూచి మరునాడే ప్రయాణంసాగించాడు తాను మునుపున్న గ్రామానికి భార్యాసమేతంగా.

౭

వృద్ధదంపతులు బయలుదేరి పోయేటప్పుడు ఒక్కరయినా మాట్లాడలేదు. వాళ్ళుతీరాన వాళ్ళు వెళ్ళుతూ కొడుకుతోనూ, కోడలితోనూ చెప్పబోయినారు. మహాలక్ష్మమ్మగారికి కన్నీరు ఆగలేదు. కృష్ణమూర్తి చూస్తూ నిలబడ్డాడు. సుశీల లోపలినించి బయటికే రాలేదు.

తిరిగి వారు గ్రామంలో ప్రవేశించినతర్వాత నలుగురూ నాలుగువిధాల అనుకున్నారు. ఏమి అనుకున్నా అవి ఆవృద్ధదంపతుల కష్టాలకు అక్కరకువచ్చేమాటలు గావు.

వాళ్లకు అక్కడ పూర్వపుజీవనమే ఆధారమయింది. ముసలివాడయి ముష్టిచెంబు చేతబట్టి వీధివెంబడి ఆయన వెళ్ళుతూఉంటే కంట తడిపెట్టనివారులేరు. అందరూ జాలిపడి ఆయన ఎక్కువ శ్రమపడకుండానే ఆయన దినగ్రాసం సమకూర్చేవారు.

ఆయన పూర్వమూ భిక్షాటనంచేశాడు. ఇప్పుడూ చేస్తున్నాడు. నాటికీ, నేటికీ హస్తిమశకాంతరం ఉన్నది. నాడు ఆయన ఉత్సాహపూరితుడైన నడిమి వయస్సువాడు. నేడు నిరుత్సాహ పూరితుడైన ముదుసలి. నాడు ఆశాజనిత సంతోషహృదయుడు. నేడు నిరాశాతత్పరుడు. నాడొక జీవితలక్ష్యంకలవాడు. నేడు చావే జీవితలక్ష్యంగాకలవాడు. నాడు తనకుమారుని పురోభివృద్ధికై తానుపడే శ్రమ ఆయనకొక శ్రమగా ఉండలేదు. నేడు అది ఒక దుర్భరశ్రమ అయి ఈజీవితాలింకా ఎందుకుఅనే నిస్పృహ కలిగిస్తున్నది.

పిల్లవాడికై తానుపడిన శ్రమలు తలుచుకున్నప్పుడు రామయ్యగారికి కడుపు చెరువయేది. సంవత్సరానికొకసారిఅయినా కుమారుడు వృద్ధమాతాపితలక్షేమం కనుక్కొనేవాడు కాడు. ఎంత భార్యమాటవిన్నా తల్లితండ్రులయందు ఈమాత్రం కనికరం లేకపోవడానికి హేతువెవరో వారికి తెలియదు. వారుమాత్రం ఈవిషయంలో కొడుకు, కోడలూ ఇద్దరూ ఏకాభిప్రాయులే ననుకునేవాళ్ళు.

అప్పుడప్పుడు తనచేతిలో కాచిన కాయలూ, భుజాలమీది కాయలూ చేతికి తగిలేవి. అప్పుడు ఆయన పడే దుఃఖానికి అంతులేదు.

అసలే వృద్ధు. వృద్ధాప్యంలో శ్రమ. పుష్టిలేని ఆహారం. మూడేండ్లకు రామయ్యగారికి ప్రమాదమయిన జబ్బుచేసింది. కుమారుడికి కబురుచేస్తే ఈమాత్రానికి ఫరవాలేదని కాబోలు అతను రాలేదు. కాని ప్రాణంమాత్రం ఎవరికోసమూ ఆగలేదు. జబ్బు ప్రమాదించి ఆయన కాలంచేశాడు. తనకూ దిక్కులేదని మహాలక్ష్మమ్మగారు మరునిముసంలో నే బావిలోపడి బలవంతానా ప్రాణాలు తీసుకున్నది.

జీవించి ఉండగా కలుగని సౌఖ్యంఅంతా వారికి ఆనాటితో కలిగింది ఒక్కరోజున. దంపతులిద్దరూ ఒక చితిమీద దహనంకాబడడానికి అవకాశం కలగడమూ ఒక పూర్వపుణ్యమేనని పెద్దల ఉద్దేశం. వాళ్ళశ్రమ ఈలోకంలో మెప్పుసంపాదింపలేక పోయినా భగవంతుడి మెప్పు సంపాదించింది కాబోలు.

చిన్నతనాన తల్లిదండ్రుల పస్తులో తృప్తిచెందిన కుమారుడు పెద్దవాడై తల్లిదండ్రుల కష్టాలతోనూ, వారి దుఃఖములతోనూ తృప్తిచెందాడు.

—మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ.

# ఖర్జూరపుర పుణ్యక్షేత్రము

కాలక్రమమున ఘరములకును దేశములకును పేరులు మార్పుజెందుట సుప్రసిద్ధ విషయమే. ప్రాచీనకాలమునందు 'యజుర్హోతి' దేశమని విఖ్యాతినహించిన రాష్ట్రమే గుప్తవంశ నరేశ్వరుల సమయమునాటికి 'జీజభుక్తి' యను నామధేయముతో విలసిల్లెను. దానినే వర్తమానమున 'బుందేలఖండ' మని వ్యవహరింతురు. ఈప్రదేశమునందు పూర్వమున 'ఖర్జూరపురము' అని పిలువబడెడి ప్రఖ్యాతనగరము తీర్థస్థానములలో మిన్నయని పరిగణింపబడుచుండెను. ఈపురము ప్రస్తుతకాలమున ఛత్రపుర రాజధానికి యిరువదియేడు మైళ్లను, పన్నా రాజధానికి పశ్చిమోత్తరమున యిరువది అయిదు మైళ్లను, కేననదికి పడమటను ఎనిమిదిమైళ్ల దూరమునను గలదు. దీనిని చేరుటకు జి. ఐ. పి. రైలుమార్గముయొక్క జాంసీ-మాణిక్యపుర శాఖలోనుండు హరిపాలపురము కాని మహోబా కాని దగ్గిర రైలు స్టేషనులు. అదిగాక తూర్పుయిండియా రైలు మార్గమున అల్లహాబాదు - జబ్బలుపురము శాఖకుజెందిన 'సతానా' రైలుస్టేషనునుండి కూడ 'ఖర్జూరపురము'నకు పోవుటకు సుకరమగు మార్గముగలదు. హరిపాలపురమున మోటారుకారులు తిరుగాడుటకు పుష్కలముగ లభించును కావున అదియే సులభమైన దారి.

ఈస్థలము ప్రాచీనకాలమునం దెంతయో ప్రాభవ వైభవము లనుభవించి తీర్థయాత్రలు సల్పువారికి పవిత్రస్థానమగుటయే గాక నిఖిల విద్యావ్యాసంగములకు విహారప్రదేశమై యలరారెను. గ్రీకుదేసస్థుడగు 'టాలెమీ' భారతీయ భూగోళవిషయమై ప్రస్తావించుచు 'బుందేలఖండ' దేశమును 'సుందరావతి' యనుపేర వర్ణించెను. అందలి ప్రధాననగరములలో 'ఖెమ్సిస్' అని యత డుదహరించిన పురమే 'కాలంజర'మని నేడు నామాంతరము జెందినది. ప్రాచీనకాలమునందు 'కాలంజరము' తపోభూమి యని ప్రసిద్ధివడసెననుటకు వైదిక సాహిత్యమే సాక్ష్యము. పౌరాణికయుగమునందు సైతము కాలంజరమొక పుణ్యస్థలమనియే భావింపబడు చుండెననుట కీక్రింది శ్లోకమే నిదర్శనము.

> శ్లో॥ రేణుకః, శూకరః, కాశీ; కాలీకాలవటేశ్వరాః ।
> కాలంజర మహాకాలః ఊఖరః నవమోక్షదా ॥

దానియనంతరము 'కురపోర్ర్వ' యని 'టాలెమీ' యుల్లేఖించిననగరమే 'ఖర్జూరపురము' దీని మహనీయతను చీనా పరివ్రాజకుడగు హ్యూ యను సాంగు సైతము ఉగ్గడించెను. ఈనగరమునకు చుట్టుకొలత రెండున్నర మైళ్లని యితడు వచించెను: అప్పటికి బౌద్ధమత ప్రచారము ఉన్నతస్థితిలో లేకపోయినను కొన్ని విహారములును మంటపములును ఉండెననియు శ్రమణులును, భిక్షులును, స్థవిరులును కొందఱుండిరనియు ఆ యాత్రీకుని వ్రాతలనుపట్టి తెల్లమగును. దేశమంతయు సస్యఫల సంపన్నమై సమస్త సంపదలతో తులతూగుచుండెను. పరిపాలకుడు బ్రాహ్మణుడేయయినను బౌద్ధధర్మము యెడల విద్వేషము వహింపక విప్రులను

శ్రమణులను సమానముగనే ఆదరించి మన్నించెనని తెలియుచున్నది. దేశదేశాంతరములనుండి విద్యార్థులువచ్చి జ్ఞానోపార్జనము గావించుకొని పండితప్రకాండులనిపించుకొనసాగిరి. ఆకాలమున 'ఖర్జూరపురము' ధనధాన్యసమృద్ధమును, బహళ జలాశయ పూరితమునై వినిర్మల సౌఖ్యమునకు నెలవై శాంతినిలయమై విరాజిల్లెను.

తరువాతవచ్చినది మహమ్మదీయ దండయాత్రల మహాప్రళయము, అప్పటివఱకు 'ఖర్జూరపురము' నందలి దేవాలయములు సరోవరములు, విద్యా మందిరములు, సంఘనాశ్రమములు నగరమున కలంకారప్రాయములై యుండెను. అచ్చటి యాశ్రమములలో జటాధారులగు యోగులు తమసాధనల నాచరించుకొనుచు దయాదాక్షిణ్యాది సద్గుణములచే శోభిల్లుచు జాతిమత భేదములు పాటింపక మహమ్మదీయులకు సైతము జ్ఞానోపదేశము గావించుచుండిరి. గజినీదండయాత్రతో దేవాలయములు ధ్వంసములయ్యెను : విద్యాయతనములు కూలెను : ఆశ్రమములు నశించెను : భవ్యమందిరములు మట్టిలో గలిసెను. నందనవనమువంటి నగరము స్మశానమయ్యెను. అట్టి ఘోరవిపత్తు తటస్థించినను 'ఖర్జూరపురము' నందుమాత్రము చందేల వంశజులు స్థాపించిన కొన్నిమందిరములు నేటికిగూడ నిల్చియున్నవి. వాని యపూర్వ కళావైభవమును తిలకించి మృగప్రాయులగు మ్లేచ్ఛసైన్యాధి పతులుకూడ ముగ్ధులై విడిచిపెట్టిరో, లేక యచ్చటి వీరులతో ప్రతిఘటించుటకు సాహసము జాలక మహమ్మదీయులాభవనముల జోలికిపోక మఱలిపోయిరో, నిర్ధారించుట కష్టము. ఆనగరము కేవలము రాజధానీస్థలమో, వ్యాపారిక స్థానమో అయినపక్షమున కాలగర్భమున గుర్తులేకయే మటుమాయమై యుండును. బేబిలను, టాయి మున్నగు ప్రసిద్ధపురముల కేమి గతిపట్టెను ?

దానిపేరునుపట్టి, 'ఖర్జూరపురము'లో పూర్వమొకనాడు ఖర్జూరవృక్షములు మెండుగ నుండెనని కొందఱితిహాసకారకుల యభిప్రాయము. ఆనగరమునందొక జైనమందిరమున శిలాలేఖన మొకటిగలదు. అది మహారాజాధిరాజగు 'ధంగదేవుని' యధికారి పాహిల్లుడు రచియించినది : దాని కాలము 1011 సంవత్సరము వైశాఖశుద్ధ సప్తమీ సోమవారము. దానిలో జినభగవానుని వ్యయమునిమిత్తము వాటిక లనేకములు దానముచేయబడినట్లు పాహిల్లుడుదహరించెను. అది యిట్లుండెను.

'ఓం. సంవత్ 1011 సమయే. నిజకుల ధవళోయం దివ్యమూర్తిః సుశీలః, శమదమ గుణయుక్త సర్వసత్త్వానుకంపీ, ॥ స్వజన జనిత తోషోధాంగ రాజేన మాన్య ప్రణమతి జిననాధోయం, భవ్యపాహిల్ల నామా ॥

(1) పాహిల్లవాటికా (2) చంద్రవాటికా (3) లఘుచంద్రవాటికా (4) శంకరవాటికా (5) పంచాయితలవాటికా (6) ఆమ్రవాటికా (7) ధంగవాడీ.

పాహిల్లవంశేతు క్షేణోవశోయః కోపితిష్ఠతి ।
తస్యదాసస్య దాసోయం మమదత్తిస్తుపాలయేత్ ॥

మహారాజగురుశ్రీ వాసవచంద్రః వైశాఖ శుద్ధ 7 సోమదినే.

ఈనగరమునందుగల దేవాలయములు అయిదు తరగతులుగ విభజింపదగును—శైవ, వైష్ణవ, శాక్త, బౌద్ధ, జైనములు.

అనేకములు శిథిలములైనను నేటికిగూడ ప్రేక్షకులకు నయనానందముగూర్చెడి కట్టడములు లేకపోలేదు. వానిలో ప్రధానములిచ్చట పేర్కొనబడుచున్నవి.

(1) యోగినీ మందిరములు. 64
(2) గణేశ మందిరము
(3) కేదారమహాదేవ మందిరము
(4) జగదంబా మందిరము
(5) రామ మందిరము
(6) శ్రీ విశ్వనాథ మందిరము
(7) నాందీగణ మందిరము
(8) శ్రీ పార్వతీ మందిరము
(9) చతుర్భుజ మందిరము
(10) వారాహ మందిరము
(11) మహాదేవ మందిరము
(12) దేవీ మందిరము
(13) మృత్యుంజయ మందిరము
(14) ఒక బౌద్ధవిహార భాగము
(15) శతధారా
(16) వత్సకే మందిరము
(17) వామన మందిరము
(18) లక్ష్మణ మందిరము
(19) ఆంజనేయ మందిరము
(20) బ్రహ్మ మందిరము
(21) ఘంటా మందిరము
(22) పార్శ్వనాథ మందిరము
(23) ఆదినాథ మందిరము
(24) శ్రీజిననాథ మందిరము
(25) శాంతినాథ మందిరము
(26) నీలకంఠ మందిరము
(27) కుమార మఠము
(28) మూర్తి సంగ్రహాలయము
(29) శివసాగరము
(30) ఖర్జూర సాగరము
(31) ప్రతాపసింహ మహారాజుయొక్క ఛత్రము

ఇవిగాక ఖర్జూరపురములో చక్కగచెక్కబడిన విగ్రహము లెన్నియో లెక్కకు మిక్కిలిగ కొన్ని సర్వాంగ సుందరములుగను మఱికొన్ని మహమ్మదీయుల దండగములకు పాలయి ఖండఖండములుగను నేటికికూడ గానిపించును. అచ్చటినుండి కొన్ని ప్రతిమలు ప్రజలచే దూరదేశములకు తీసికొనిపోబడెను. ఆవిగ్రహములలో ప్రధానములని చెప్పదగు శేషశాయి చిత్రమొకటియును రాశిచక్ర మొకటియును యిప్పటికి ఛత్రపురమునందు సౌందర్య నిధానములై యొప్పుచున్నవి. ఆ శిల్పములు భారతీయ కళావైదుష్యమునకు మూర్తిమంతములగు ప్రబల నిదర్శనములు. రెండువేల సంవత్సరముల క్రిందట ప్రాచీన భారతవర్షమునందు నెలకొనియుండిన ధార్మిక, నైతిక, సాంఘిక జీవనమునకీ చిత్రములు జాజ్వల్యమానములగు ఉదాహరణములు. అవి మందిరములు కావు; ఆర్యసంస్కృతికి విశ్వకోశములు. వానినిచూచినవెంటనే ప్రతి భారతీయుని మనోవీధిని తనపూర్వుల వైభవ మహత్త్వములును విజ్ఞానోన్నతియును స్ఫురింపక మానవు. యశోవర్మ, ధంగదేవుడు, కీర్తివర్మ మదనవర్మ మున్నగు సార్వభౌముల కాలమునాడు వారి విజయపతాకములు గుజరాతు దేశపు సుదర్శనసరోవరము మొదలు ప్రాగ్జ్యోతిషపురమువఱకును, కోసలప్రదేశము నుండి నర్మదాస్రవంతిని వఱకును నిర్విఘ్నముగ ఎగురుచుండినపుడు 'ఖర్జూరపురము' అనుభవించిన యద్వితీయ సంపదైశ్వర్యములు వర్ణనాతీతములు.* నేడవియన్నియు చారిత్రక విషయములు మాత్రమేకదా!

—గోదావరి సత్యనారాయణ, బి. ఏ.

# గొంగళిపురుగుల కథ

౧

ఆసంపన్నగృహం ఒక సుఖమయ రాజ్యం. ఒక్క స్విచ్ నొక్కితేచాలు దీపాలు వెలగడం విసనకఱ్ఱలు వీవడం, వేడినీళ్ళు మసలడం, అన్నీ క్షణంలో అయిపోతాయి ఒకయిత్తడి పిడి నొక్కితేచాలు గుమ్మున చిమ్ముకొస్తాయి తీయనినీళ్ళు పంపులోంచి, ఎక్కడికన్నా పోదాము అనుకుంటేచాలు బోయ్‌ంబోయ్‌మని సందడిచేస్తూ వాయువేగ మనోవేగాలతో తీసుకపోతుంది ఆ అయశ్శకటం. ఈయిరువదవ శతాబ్దపు సమస్త నాగరికపు పరికరాలతో అనుభవింపవలసిన సుఖం అనుభవిస్తున్నారు ఆయింటిలోని స్త్రీలూ, పురుషులూ, బాలురూ, బాలికలూ, నౌకర్లూ అందరూ గూడా. ఇక ఆయింటిలోనివారు తినే పదార్థాలూ, కట్టే వస్త్రాలూ, వాడుకొనే వస్తువులూ విలువైనవేనా? అని అడగడమెందుకు?

అనుదిన నక్తాలుచేసీ, సోమవారోపవాసాలు చేసీ, కృత్తికా స్నానాలుచేసీ, వనసమారాధనలు చేసీ తన్ను సర్వవిధాలా సంభావించిన వారివద్ద కార్తీకం అప్పుడే వీడ్కోలు పొందుతున్నది. మార్గశిరం ఎప్పుడువచ్చి జగజ్జనుల గడగడలాడింతునా అని ఉబలాట పడుతూ మంచుముసుగులోనుంచి తొంగితొంగి చూస్తున్నది. ఆతరుణంలో నాప్రియమిత్రురాలు శారద పిన్నీ! ఒక మాటురా అని ఆదరంతో ఆహ్వానలేఖ పంపింది. మూడు నాల్గునెల లొకరినొకరము కలిసికొని పోయి మీర భాషించుకోకపోతే మాలోయేదో అవ్యక్తమగు వ్యాకులం కలుగుతుంది. అప్పు డొకరినొకర మిట్లా ఆహ్వానించుకొని కల్సుకోడం మాకుమామూలు.

వావికి మేమిద్దఱమూ తల్లి బిడ్డలము. వర్తనములో ప్రాణస్నేహితులము. వయస్సుకు నేను రెండేండ్లు పెద్ద మాశారదకంటే. కనుక నాతల్లివావి తప్పకవగాకుండ నిలిచింది, మీశరీరబాంధవ్యం యెట్టిది? అని యెవరైనా ప్రశ్నిస్తే మాచుట్టరికం దూరంగనుక చుట్టుతిరిగిరావాలె. కాని మామనోబాంధవ్యమో; అంటే యెడంలేదు గనుక పెనవేసిపేనిన త్రాడునే మాపాలె. మఱి ఆ త్రాడు విడబఱచి వదిలిపెట్టినా మళ్ళీ రివ్వునబోయి పెనవేసుకొంటుంది. గనుకనే మాలో విభేదాలు కల్పించాలె అనుకునేవాళ్ళకు తప్పకుండా అపజయం సిద్ధించింది.

౨

మాశారద దగ్గిరనుండీ ఆహ్వానంరాగానే నేను తత్క్షణం బయలుదేరి వెళ్ళాను. శారదను చూడటానికై. నన్నుచూచి మాశారద పొంగిపోయింది. ఎదురొచ్చి స్వాగతమిచ్చింది. గాఢంగా పరిష్వంగం చేసుకున్నది. ప్రేమపురస్సరంగా తన బాహు లతను నామెడకు పెనవైచి లోనికి తోడ్కొనిపోయింది. వీధిలో సరుకులు అమ్ముకోడానికి తెచ్చినవాడు తనవద్దనున్న విచిత్ర వస్తు సముదాయమంతా ఒక్కమాటు తీసి బయటపఱచి పెట్టినట్టుగా మాశారద పిన్నివస్తే చెప్పుదామని తన హృదయపేటికలో భద్రపఱచిపెట్టుకున్న విషయసముదాయమంతా ఒక్కమాటు బయటపెట్టింది. ఆ మా సుఖమయ సంభాషణలలో పగటిపనులకు మందం యేర్పడ్డది. రాత్రులు చిక్కి సగమైనాయి. అయినా తెంపులేదా ప్రసంగములకు. చెలమ యూరినట్లూరుతునే ఉన్నవి.

౩

నేను మా శారదయింటికి వెళ్ళి వారముదినాలైంది. ఆనాటి సాయంత్రపువేళ దొడ్డివైపు వసారాలో కూర్చుండి యేవేవో ముచ్చటలాడుతున్నాము. అంతలో మాశారద చిన్నకొమార్తె విజయం వచ్చి 'అమ్మా అమ్మ గొంగలిపూగే కుత్తిందే! దూద్ద పెడ్తున్నదే! ఇక్కదేనే! ఇక్కదేనే!' అని యేడుస్తూ వచ్చింది.

'అబ్బా! యీ గొంగళిపురుగులతో మహా అవస్థ వచ్చింది పిన్నీ! పిల్లలూ పెద్దలంగూడా బాడలిపోతున్నాము,' అన్నది శారద నాతో.

'మనంకొన్ని క్షుద్రమైనవని నిరసిస్తూ ఉంటాము, కాని అక్షుద్రమైనవే ఒకప్పుడు పెద్ద అశాంతికి కారణ

మవుతుంటాయి. బలవంతులచేతిలో దుర్బలులు యెట్లా చిక్కిఉన్నారో దుర్బలులచేతిలో బలవంతులూ అట్లాగే చిక్కిఉన్నారు అన్నాను నేను' నిజమేనన్నది, మాశారద.

'అయితే తెలివితక్కువ యెక్కుడఉన్నదంటే అవి బాగావచ్చి కంటికి పొడుచుకున్నదాకా బలగర్వం చేత బలవంతులు వాటిని గమనించరు, మొదట నిరసించడం, ఆతర్వాత పోరాడడం, ఆపైన లొంగిపోడం ఎక్కడా బలాఢ్యులస్థితి యిదే అన్నాను నేను.'

'అవును యీసంగతి చూస్తే అట్లాగే తోస్తున్నది. లేకపోతే యీచిన్న కీటకాలు మనల నింతగా పీడించడమేమిటి ?'

'ఇది సంఘశక్తియొక్క బలీయత. ఇవియే రెండు మూడో అయితే మీపిల్లలు కుంకుడుకాయలు చిదుకగొట్టినట్టు కొట్టకపోయినారా ! కాని జంటగానున్న ఈరెండు పెద్ద మునగచెట్లు, మార్గశిర మాసపు చలికి వెఱచి కంబళినేయించి కప్పుకున్నవా అన్నట్లు ఆద్యంతమూ కంబళిపురుగులతో కప్పివేయబడిఉన్నవి. ఇప్పుడు వీటిని నిర్మూలించడానికి సామాన్య యత్నం చాలదు. స్వల్పంఅని దేనినీ ఉపేక్షించరాదు.'

'ఇవి ఆచెట్లనేకఱచి పట్టుకొనిఉంటే యెవరూ వాటిని గమనించిఉండరు. కాని యివి గోడలకూ గొబ్బెలకు ప్రాకీ, గుడ్డలకూ మంచాలకూ పట్టుకొనీ బాధించడంతోనే వచ్చింది అవస్థ, అబ్బో! గొంగళిపురుగులు కుట్టినాయని పిల్లలువచ్చి మొత్తుకుంటూ ఉంటే సముదాయించలేక యేమీలేదని దబాయిస్తానుగాని ఓయి బాబో వీటిబాధ యెంతనుకున్నావు? అవి సరాసరి వచ్చి కుట్టనక్కరలేదు. అవిప్రాకిన గుడ్డ కట్టుకుంటే చాలు, పీటమీద కూర్చుంటేచాలు, గోడను ఆనుకుంటే చాలు, పుట్టుకొస్తుంది కంపరం, దురదా, దద్దురూ, గుచ్చుకున్నట్టు ఉండడం, ఏమిటో చెప్పలేని ఆబాధ, అంతవేదన కలిగిస్తాయి. నీకెప్పుడైనా మా గొంగళిపురుగుల సత్కారం కలిగింది పిన్నీ!' అనినవ్వింది మాశారద.

'ఆ.మీ ఆతిథ్యమందుకున్న వాళ్ళకు మీయింటిలోనున్న గొంగళిపురుగుల సత్కారంపొందడం తప్పని సరేగా !' అన్నాను నేను.

'మాపిల్లలను నేను అదుపులో పెట్టలేకపోయినాను. వాళ్ళనాన్నగారి కసలే చేతగాదు. ప్రైవేటు మేష్టర్ని గూడ చెవులుపట్టి ఆడిస్తారు కాని గొంగళిపురుగుల పేరు చెప్పితే చాలు, మగ్గూర్ పిల్లలు అల్లరిచేస్తే ఒట్టు బహుబుద్ధిమంతులౌతారు. కూర్చోమన్నచోట కూర్చుంటారు. నిలుచోమన్నచోట నిలుచుంటారు.'

'అయితే నీకు గొంగళిపురుగులు ఉపకారమే చేస్తున్నవే యింకావాటిమీద కోపపడతావెందుకు? మేలు మఱచిపోరాదెప్పుడూ.'

'పొద్దు మేలు, రాత్రి అపసివాడికి యేగొంగళి పురుగులు ప్రాకిన చొక్కా తొడిగారో యెంతయేడ్చాడో చూచావుగాదూ.'

'అయితే యీమునగచెట్లు రెండూ కొట్టివేయించూ? అంతటితో తీరుతుంది రగడ.'

'ఎన్ని సంవత్సరాలనుంచో తమకాయలనిచ్చి మాకెంతో ఉపకారంచేస్తున్నవీచెట్లు, పిల్లలకు మునగకాయల పప్పుపులుసంటే మహాయిష్టము. ఇవి కొట్టివేస్తే అదిసున్న.'

'అవును అవ్వాకావాలె బువ్వాకావాలంటే యెట్లాఐస్తుంది? సృష్టిఅంతా సుఖదుఃఖ ద్వంద్వము. వాటికాయలకు ఆశపడితే గొంగళిపురుగుగోల సహించాలె ఆగోలను సహింపలేకపోతే మునగకాయల ధప్పళానికి నీళ్ళు వదులుకోవాలె.'

ఈ గొంగళిపురుగులగోల పడలేక యేటా యీ చెట్లను మొదలంటా కొట్టివేయిస్తూనే ఉంటాము. కాని పాపము మావల్ల యేమీ అపకారం పొందనట్టుగానే వర్షాకాలంరాగానే యీమొద్దు చిగిర్చి మళ్ళీ పెద్దపెద్ద కొమ్మలువేసి కాయలుకాస్తూనే ఉంటుంది, ఇటువంటి చెట్లను మూలముట్టుగా నాశంచేయడమంటే కృతఘ్నతా కార్యమేమో అనిపిస్తున్నది. కాని ప్రతివత్సరము ఈగొంగళి పురుగులబాధ దుర్భరంగా ఉంటున్నది. ఈయేడు మఱీ ఉమ్మరంగాఉన్నది. కనుక వీటినీమాటు నిర్మూలించక తప్పనట్టున్నది. కాని ఒక్క విషయం విచారంగలిగిస్తున్నది ఏమంటే! మనకు కలుగుతున్న యిబ్బంది యీచెట్లవల్లగాదు. ఈకీటక సము

దాయంవల్ల. వానివల్ల వీనిని హతమార్చవలసి వచ్చింది. ఇనుమునుగూర్చి అగ్గికి సమ్మెటపెట్టు అంటారు యిదే.

'నిజమే తప్పదు. మనమేము మంచివాళ్ళం గదా దుర్జనసాంగత్యం మమ్మేమి చేస్తుంది అనుకుంటారు చాలమంది. కాని వ్యాధినివారణకోసం పుచ్చుకున్న సారా వ్యాధినే నయంచేసి ఊరుకోదు.'

'అయితే యీ చెట్లను మూలముట్టుగా నాశం చేయించమంటావా?'

'నీయిష్టము. చెట్లు నశించకుండా గొంగళి పురుగులు నశించే ఉపాయంఉంటే చూడు.'

'అప్రయత్నాలు చాలామార్లు విఫలమైనాయి. గొంగళిపురుగుల గొడవ వదలవలెనంటే మునగచెట్ల యెడల కృతఘ్నులం కాకతప్పదు.'

ఈవిధంగా మాసంభాషణ జరుగుతూఉండగా అమ్మా గొంగళిపురుగు తొక్కితే కాలు దురదపెడ్తున్నది చూడవే అని ఏడుస్తు వచ్చాడు పెద్దపిల్లవాడు రాము. వాడిని వోదార్చుతూ ఉండగా వచ్చిందిరాధ కచ్చికవేసి చేతిమీద రుద్దుకుంటూ మొగం చిట్లించుకొని సణుగుతూ. అదేమిటే రుద్దుతున్నావన్నది తల్లి. అమ్మా ఈచేయి ఆగోడమీద ఆనించేటప్పటికి గొంగళి పురుగు అంటుకున్నది కాబోలు ఒకటేదురదగాఉన్నది. దీనికి కచ్చికవేసి రుద్దుతే పోతుందని మన అచ్చిచెప్పితే రుద్దుతున్నానన్నది. మునగచెట్లు కొట్టివేయించి గొంగళి పురుగులను నాశంచేయిద్దామా వద్దా అనే యోచనలో ఉన్న మాశారదకు పిల్లలమొఱలు సంశయ విచ్ఛేదమొనర్చి శిక్షను ఖాయపఱచినవి.

'నాయనా, ఏడవబోకు, అమ్మా యేడవబోకు రేపు చెట్లు కొట్టించి గొంగళిపురుగులను హతమార్పిస్తాను. మీరు హాయిగా ఆడుకుందురుగాని' అని బిడ్డలను వోదార్చింది, శారద. ఆమాటవిని రేపేదో మహా పండగ అన్నంత సంతోషంపొందారు పిల్లలు.

ఒకరి మృత్యువు ఒకరికిహాయి. ఒకరిహాయి ఒకరికి మృత్యువు. ఈయిహలోకంలో కలిగే సుఖదుఃఖాలు విరుద్ధపదార్థాలుగా పైకి తోస్తున్నప్పటికి ఒక దాని నుండి ఒకదానిని విడదీయటానికి వీలుగాని యేదో అవిభాజ్యపదార్థంనుండే ఉత్పన్నమైనవి.

## ౮

గొంగళిపురుగులవల్ల తామూ బాధపడుతున్న వాళ్లే గనుక అమ్మగారు ఆజ్ఞయిచ్చినదే చాలునని సిద్ధమైనారు నౌకర్లందరూ. గునపాలు గొడ్డళ్ళూ పుచ్చుకొనీ కాళ్ళకూ చేతులకు గుడ్డలుకట్టుకొనీ. ఆగొంగళి పురుగులకురాబొయ్యే ఆపద తెలియదు. ఇదేమాకు కాణాచి అన్నట్టుగా రెండుమ్రానులనూ కఱచి పట్టుకొనిఉన్నవి. ఒకడు ముందుగాపోయి చెట్టుమొదటను గొడ్డలితో దబీలుమని ఒకపెట్టు వేశాడు. చెట్టు ఆపాద మస్తకం కంపించింది. గొంగళిపురుగులు మేలుకున్నవి. ప్రళయం తెలుసుకున్నవి. ప్రాణరక్షణాసక్తితో పలువైపులకూ పరుగెత్తడం ప్రారంభించినవి. ఇంతలో రెండోవాడు రెండోవైపున తామని మరోపెట్టు పెట్టాడు. చెప్పేదేమిటి? మహాప్రళయం మహాభీభత్సం అయిపోయింది. ఆగొంగళిపురుగుల క్షోభ చెప్ప శక్యంగాదు. మునగ చెట్లు మహాపెళుసు ఇద్దఱూ చెరోవైపునా నిలబడి నాల్గుపెట్లు పెట్టేటప్పటికి చెట్లురెండూ నేలకొరిగి ఊరుకున్నాయి. వాటిపాటుచూస్తే మనస్సు నీరైపోయింది. వాటికి నోరులేక పోయినాయేదో చెప్పుకొని మొఱపెట్టుకున్నట్టే అనిపించింది. పాపం నవనవలాడుతుండే ఆ ఆకులూ, జంపాలూ క్షణంలో జీవన శోభను కోల్పోయి తలలువాల్చాయి. దుర్మార్గులకు ఆశ్రయమిచ్చిన సజ్జనునికిట్టే కష్టమాపాదిల్లునన్నే విషయాన్ని బోధిస్తున్నట్టుగా అనిపించింది ఆచెట్లనుచూస్తే. నౌకర్లు అంతటితోనైనా ఊరుకోలేదు. గునపాలు పుచ్చుకొని మొదళ్ళుగూడా త్రవ్వి పారేశారు.

కృతజ్ఞత అనేది ప్రతి ప్రాణిలోనూ ఉన్నదో యేమో! తమకు ఆశ్రయమిచ్చిన మునగచెట్ల బలవన్మరణంచూచి దుఃఖించి పగసాధించడానికి బయలుదేరినవా అన్నట్లు గొంగళిపురుగులు ఆవరణమంతా వ్యాపించి సమస్త వస్తుసముదాయమును ముట్టడించి అందఱినీ మఱింత పీడించడం మొదలుపెట్టినాయి. పురుగులన్నీ ఆచెట్లను మాత్రమే పట్టుకొనిఉండి యే పదిపురుగులో ప్రాకితేనే కష్టమనుకుంటున్నప్పుడు లక్షల కొలది సైన్యము ఒక్కమారుగా దాడివెడలినప్పుడు ఇంట్లో పిన్నపెద్దల స్థితి ఎట్లాఉన్నదో చెప్పవలెనా!

తమకు ఒత్తిడిలేనంతవఱకే మనుష్యులు కారుణ్యమూర్తులుగా ప్రవర్తిస్తారు. కాని యేదైనా కాస్త నొప్పితగిలిందా అంటె బయటపడుతుంది మనుష్యుల్లో ఉండే క్రౌర్యమంతా గొంగళిపురుగుల దాడివల్ల మాలో యెంత కసాయితనం దాగిఉన్నదీ బయటపడ్డది. రాళ్ళతో చితుకగొట్టేవాళ్ళు కొందఱూ, కొఱవులతో ముట్టించేవాళ్ళు కొందఱూ, చీపుళ్లతో బాదేవాళ్ళు కొందఱూ చెప్పులతో త్రొక్కేవాళ్ళు కొందఱూ నానావిధాలుగా అయిపోయినాము. అవీ ఊరుకోలేదు అవకాశం చిక్కినంతవఱకూ పగసాధిస్తునే ఉన్నవి. సురక్షిత ప్రదేశాలు వెతుక్కుంటూ ప్రాణరక్షణాసక్తితో పరువులుదీస్తునే ఉన్నవి.

అల్లరిచేసే పిల్లలు బుద్ధిమంతులైనారు ఆటలాడే పిల్లలు కదల మెదలని శాతిప్రతిమలై పోయినారు. పిల్లలమాటేమిటి పెద్దవాళ్ళుగూడా పడుకోడం కూర్చోడం నడవడం మొదలైనపట్లుల్లో స్వేచ్ఛకోల్పోయి యేదో పక్క బెదురుతో వర్తించడం మొదలు పెట్టారు. సంఘీభావం ఉంటే ఒక చిన్నపురుగే యింత అలజడికి కారణమైనప్పుడు మానవులలోనే యిట్టి ఉత్పాతం బయలుదేరితే ప్రపంచం ఎట్లా తారుమారవుతుందో!

౫

కంబళిపురుగుల హింసావ్యాపారం జరిగి అయిదాఱు రోజులైంది. హతశేషమైన గొంగళిపురుగులు క్రొత్తయిరువులు చూచుకున్నాయి. ఇంట్లోవాళ్ళందరికీ గొంగళిపురుగుల భీతి తగ్గింది. పిల్లలు మళ్ళీ కొంచెం కొంచెంగా ఆటలు సాగించారు.

నేను మాశారదా దక్షిణపువైపుగదిలో యేవో మాట్లాడుతూ కూర్చున్నాము. ఒక్క రెక్కలపురుగు ఝుమ్మని ఝుంకారంచేస్తూ వచ్చింది. దాని నోటిలో విలవిల లాడుతూఉన్న ఒక కంబళిపురుగున్నది, పాపం ఈ కీటకానికి గూడా గొంగళిపురుగులమీద కసేకాబోలు అనుకున్నాము నేనూ శారదా, కాని అది దానిని చంపలేదు తిన్నగా తీసుకపోయి తాను అదివఱకే తలుపుకు అంటబెట్టి కట్టిఉంచిన మట్టిగూటిలో దానిని త్రోసింది. అట్లా యెన్నిపురుగులు అందులో భద్రపఱిచిందో తెలియదు. ఈసృష్టిలోని ప్రతిజీవి తనపనిని తాను చేసుకోడం విధి. ఆకీటకం పని అదికాబోలు. మరునాడుచూస్తే ఆగూడు మూసిఉంది కాని ఆపురుగు మాత్రం ఆగూడు చుట్టూ ఝుమ్మమని తిరుగుతూ ఉన్నది. కాని ఒకమాటూ అది అగూటిలో తలదూర్చినట్లులేదు. ఆగొంగళిపురుగు విలవిల తన్నుకుంటూ ఉండగా తీసుకొచ్చి ఆరెక్కలపురుగు దానినాగూటిలో త్రోసి యెన్నాళ్ళయిందో బాగాజ్ఞాపకంలేదు. కాని ఆపురుగుమాత్రం నిమ్నజాతుల గూడెములచుట్టూ పాదిరీ దొరలాగా పగలల్లా ఆగూడుచుట్టూ ఝుమ్మమని ఝుంకారం జేస్తు తిరుగుతూఉండడం మాత్రం కనిపిస్తూ ఉండేది.

ఒకనాడు ఉదయంవేళ పిల్లలందఱూ ఆగూటివద్ద చేరి ఉండడం చూచాము నేనూ శారదా, ఆగూడు చితక పొడుస్తున్నారేమోనని కోపపడుతూ వచ్చాము, కాని తీరా దగ్గిరకు పోయేటప్పటికి మాకు అత్యాశ్చర్యమైపోయింది. ఆకంబళిపురుగు సుందరమైన సీతాకోకచిలుకగా మారిపోయింది దాని రెక్కల సౌందర్యానికి మెచ్చి పిల్లలు దానిచుట్టూ మూగి ఆడుకుంటున్నారు. ఆపురుగును చూచి ఆశ్చర్యపడుతూ మాశారద పిన్నీ! ఆ గొంగళిపురుగు యెటువంటి సుందరమైన పురుగుగా తయారైందో, ఇదేకాబోలు భ్రమర కీటక న్యాయం అంటారు, అన్నది. అవును అదే ధ్యానయోగంచేత గొంగళిపురుగు రెక్కలపురుగుగా మారిపోయింది, నిమ్నజాతుల పల్లెలచుట్టు మిషనరీలు తిరిగి బోధచేస్తు ఉండటంచేత వాళ్ళు ఏమవుతున్నారో చూడటంలేదూ అన్నాను. 'అవి గొంగళిపురుగులత్తా, దగ్గిరికి పోతారేమి మీకు భయంలేదా అని మాశారద బిడ్డలను మందలిస్తే ఇవి గొంగళిపురుగులేమి? ఇంత చక్కగాఉంటే? కాదని పిల్లలు ఎదిరించారు. మనంచేస్తున్న పనే యిది రూపాంతరంచెందితే దగ్గిరకు చేరుస్తాము, ఎంతసేపటికీ పైమెఱుగే మనకు కావాలసింది. ఇందులో తమాషాయేమిటంటే ఈపురుగు గ్రుడ్లుపెట్టుతుంది. కాని అవి అన్నీ గొంగళిపురుగులే అవుతాయి అన్నాను నేను. 'అవును మళ్లా యీకర్మకాండ అంతా జరిగితే గదా వాటికీ సుందరరూపం లభ్యంకావడం' అన్నది మాశారద.

ఆరోజే విడువలేక విడువలేక వెంటాడే మాశారదను వదలిపెట్టి నేను మావూరువచ్చేశాను.

౬

ఒక్క సంవత్సరమైంది. హేమంతం గడిచింది. వసంతం వెళ్లిపోయింది. గ్రీష్మం దాటుతున్నది. తొలకరి చిందించింది. సమస్త తరులతాద్రుమాళీ నవజీవం బొంది కళకళలాడుతున్నవి. యింతలో వర్షఋతువు వచ్చి జోరువానలతో ప్రకృతిని ఓలలాడించింది. శరత్కాలంరాగానే మాయింట్లో దేవీనవరాత్రములు నడుపుతాం తప్పకరావాలిసుమా అని మాశారద ఉత్తరం వ్రాసింది. మళ్ళీ వ్రాసింది, మళ్ళీ వ్రాసింది. నాకు యింక మనస్సునిల్వలేదు. మూడునాళ్ళుండి వస్తానని మాపంతులుగారితో నమ్మబల్కి సెలవుపుచ్చుకొని వెళ్ళాను. ఇక నేమి మాయిద్దరికి పండుగ.

నేను వెళ్ళినమరునాడు సాయంత్రము పడమటివైపు వసారాలో కూర్చుని యేమో మాట్లాడుతున్నాము నేనూ, శారదా. ఏవో పూలవాసన గుమ్మున వచ్చింది. ఎక్కడిదోయి యీసువాసన అన్నాను. అదిగో పారిజాతము. ఎట్లా విరబూచివున్నదో చూడు! అపూర్వుల వాసనే యిది అన్నది. సుమశోభితమైయున్న ఆపూల మొక్కను చూడగానే ముచ్చట గొల్పినందున గబగబా నేనా చెట్టువద్దకుబోయి చూస్తునుగదా దాని నిండా గొంగళిపురుగులు విదుల్తున్నవి. ఇదేమిటి శారదా! యీగొంగళిపురుగులు! గొంగళిపురుగులు పోవాలని కామా క్రిందటి వత్సరం మునగచెట్లను నిర్మూలించింది. అన్నాను. అవునుపిన్నీ! అందుకే మునగచెట్లను కొట్టివేయించాము. కాని గొంగళిపురుగులుమాత్రం నశించలేదు. చూడు యీశరత్కాలంలో సమస్త తరులతాదులు ఆకులూ జొంపాలుతోడిగి కుసుమఫల భార వినమ్రములై మనోహరంగా చూపట్టుతున్నాయి. కాని ఆమునగచెట్లు ఉండేప్రదేశం మాత్రం బావురుమంటూ వెలితిగానే ఉన్నది! అవును పాపము వాటిని కూకటివ్రేళ్ళతో పెళ్ళగించి వేయిస్తిమి! ఇక వాటిగురుతేమున్నది. ఒకప్పుడు మనుష్యులు సవరించుకోడానికి వీలుగాని అపరాధం చేస్తుంటారు. కనుకనే యుగాలుగడిచినా ఆవెలితి వెలితిగానే ఉంటుంది మనలో, అన్నది శారద విచారిస్తూ.

—కనుపర్తి వరలక్ష్మమ్మ.

# ప్రేమభిక్ష

ఈ మృదుభావగీతికల నీ దరిలేని వియోగవీధిలో
నేమరి, శూన్యపాత్రధరియించుక బిచ్చపుపాటపాడి. నీ
ప్రేమ నవానురాగసుధ పేరగ నింపెదవంచు నెంచి తా
శాముషితాత్మనో సఖియ! సాగునె జన్మము రిక్తపాత్రతో॥

మరగినిదాఘవేణికల మాదిరిలో రసవాహినుల్సఖీ
సురిగెడు సన్నసన్నముగ శూన్యమనంబున భావవల్లవాం
కురములు మాడిపోయినవి. కూలమునందివె రిక్తకోరిక
ల్పఱచితి సైకతస్థలిగ ప్రాణసఖీ! యికనీరదింపుమా?

చల్లని మల్లికాకుసుమ సౌరభవాసిత ధౌతశయ్యలం
దల్లిన మేనుసేర్చి ప్రణయాసవసిక్త ముఖారవింద సం
ఫుల్లత నొప్పు నీమధురముగ్ధమనోహరగాత్రవల్లి రా
జిల్లగ చెంతమైమఱచి చిత్తసమాధిని సొక్కుటెన్నడో॥

—పెమ్మరాజు రాజగోపాలము, బి. ఏ.

[శ్రీ ఊటుకూరు వేంకటసుబ్బారావు శ్రేష్ఠిగారు గ్రంథాలయములు గవర్నమెంటువారి సహాయమును పొందగలుగుటలోగల ప్రధాన ఆటంకమును గురించి ఆగస్టుమాసపుసంచికలో తేటపరచియున్నారు. మరియొక యాటంకవిషయమై యిచ్చట తెల్పుచున్నారు.

—సంపాదకుడు.]



## గ్రంథాలయోద్యమము.

# గ్రంథాలయములు – గవర్నమెంటు గ్రాంటులు

మనరాష్ట్రీయ ప్రభుత్వమువారు గ్రంథాలయముల నిమిత్తము ప్రత్యేకించుచున్న విరాళధన మత్యల్పమనియు, రాష్ట్రమునగల గ్రంథాలయములన్నిటి కొసంగుటకు చాలుటలేదనియు గతవ్యాసమునందే స్పష్టీకరింపబడినది. ఈవిరాళధన మత్యల్పమైన దగుటచేతనే జిల్లా విద్యాశాఖాధికారులు సైతము తమతమ జిల్లాలలో అర్హమగు గ్రంథాలయములు పెక్కులున్నను వాని కన్నిటికిని శిఫార్సుచేయక, యే యొకటి రెండిటికో శిఫార్సుచేయుచుండుటయు, అందు కొన్నిటిని శ్రీడైరెక్టరుగారు త్రోసిపుచ్చుటయు జరుగుచున్నది. అర్హమగు గ్రంథాలయములన్నిటికి గవర్నమెంటువారి గ్రాంటు లభించుటలేదు.

సర్కారువారొసంగు విరాళమునకు గ్రంథాలయపాలకులు, తత్సమ మొత్తమును చేర్చి, యావత్తును గ్రంథసంపాదనకొఱ కుపయోగించవలెననెడి నియమము గలదు. ఈ నియమముకూడ గ్రంథాలయములు విరివిగా ప్రభుత్వసహాయమును పొందగలుగుటలో మఱింత యాటంకమును కలుగజేయుచున్నది. గ్రంథాలయపాలకులు తత్సంస్థాపనయొక్క సిబ్బంది జీతములను, వార్తాపత్రికల చందాలను, వస్తువాహనాదికముల క్రయములను, అచ్చుఖర్చులను తదితరములగు నిత్యనైమిత్తిక వ్యయములను భరించుటగాక గ్రంథముల నిమిత్తము ప్రత్యేకముగా సర్కారువారొసంగు విరాళమునకు సమమొత్తమును వెచ్చింపవలయుననుట నిక్కముగా కఠినసూత్రమనక తప్పదు, గ్రంథాలయపాలకు లావిధమున సమమొత్తమును వెచ్చింపజాలనిచో యాగ్రంథాలయమునకు ప్రభుత్వ సహాయము లేకపోవుచున్నది. గ్రంథాలయపాలకు లాసంవత్సరములో వెచ్చించిన వ్యయములనన్నిటిని, వారు గ్రాంటుకు చేర్చవలసిన సమమొత్తములో లెక్కింప వీలున్న మేలుగాయుండెడిది. అటులగాక పోవుటచే సర్కారువారి సహాయ సౌకర్యమును యన్ని గ్రంథాలయములనుభవింపజాలకున్నవి. ప్రజలు తమ బీదతనముతో స్వకుటుంబ పోషణమునే. యతికష్టముమీాద సాగించుకొనుచున్న వర్తమానకాలములో యిట్టి ధర్మసంస్థాపనల

కెంతదూరము సహాయపడగలరు. ఈకాల
మున ప్రజలసహాయ మపేక్షించుట బహు
దుస్తరమైన విషయమనుట నిస్సందేహము.
ఉత్సాహముప్పొంగినపు డొకింత సహాయ
మొనర్పగలిగినను సర్వకాలములం దట్టి
సహాయమొనర్చుచుండుట జనసామాన్యము
నకు బరువుగా తోపక మానదు. కనుక
యిట్టి ధర్మసంస్థలు విదేశములలోవలె
సర్కారువారి సహాయముమీద యెక్కు
వగా నాధారపడి యుండవలసియుండును.
సర్కారువారు సహాయమొనర్చుచుండుట
కొక చట్టముండవలె ననుటయు సహజము.
గ్రంథాలయముల పోషణకింత దనుక
ప్రత్యేకచట్టము లేకుండుట నిజముగ యొక
గొప్ప కొఱత యనదగును. అట్టి కొఱతను
తీర్పనెంచి మనరాష్ట్రీయ శాసనసభలో
యొక చిత్తుచట్టము ప్రతిపాదింపబడియున్నది.
అయ్యది ప్రాయశః రాబోవు సమావేశ
ములో చర్చింపబడనచ్చును. రాష్ట్రీయశాసన
సభవారు తలపెట్టిన యికార్యమునకు మన
మెల్లరము సంతోషింపవలసినదే, కాని
వారు చర్చింపనున్న చిత్తు చట్టమును పరికిం
చినచో నయ్యదొకింత లోపభూయిష్టముగా
నున్నదని ప్రాజ్ఞులకు తోపకమానదు. చిత్తు
చట్టమునందనేక సవరణలు జేయబడవలసి
యున్నవి, అవసరసవరణలను గురించి శాసన
సభ్యులకును, సెలెక్టుకమిటీ సభ్యులకును,
యీవరకే యచ్చుప్రతులను పంపించి యు
న్నాడను. వాని నెంతవరకు శాసనసభ్యులు
మన్నించి చట్టమును సవరింతురో చూడ
వలసియున్నది. గ్రంథాలయోద్యమ శ్రేయ
మును గోరు శాసనసభ్యులు ఆసవరణలను
సభలో నుపపాదించి చట్టము నిర్దుష్టముగ
చేయుదురుగాక. శాసనసభ్యులు గ్రంథా
లయ చట్టమును చర్చించునపుడు ముఖ్య
ముగా గమనింపవలసిన విషయమొండు
గలదు. అదేదన:—మన రాష్ట్రమునగల
గ్రంథాలయముల నన్నిటిని యేటేట తనిఖీ
చేయించును, యొక్కొక సంస్థకగుచున్న
సాలీనావ్యయములో సగభాగమునకు తగ్గని
మొత్తమును ప్రభుత్వము వారా సంస్థకు
విరాళముగా దయచేయుచుండు లాగున
యున్నా, గ్రంథాలయములకు స్వంతభవన
ములు నిర్మించుటకు తత్సాలకులు సంక
ల్పించునెడల తద్వ్యయములో కనీసము సగ
భాగమును ప్రభుత్వమువారొసంగుచుండు
పద్ధతిని పైచట్టము నిర్మింపబడవలయును.
ఈ చట్టము నండగాజేసికొని ప్రజలపై
క్రొత్తపన్నులను విధింపనెంచుట పాడిగానే
రదు. ప్రభుత్వమువారు విద్యాసంస్థల కెటుల
తోడ్పడుచున్నారో తద్రీతిగా గ్రంథాలయ
ములకుకూడ గ్రాంటుల నొసంగుచుండ
వలయుననెడి సూత్రము చట్టములో స్పష్టీ
కరింపబడవలయును. లేనిచో చట్టము నిర
ర్థకమైన దగుటయేగాక ప్రజలపై మరొక
బరువును మోపినదగును.

—ఊ. వెం. శ్రేష్ఠి.





# అబ్దుర్ రజాక్ ఖాన్ లారీ

[గోలకొండ రాజ్య చరిత్రమునకు చెందిన ఒక గొప్ప రాజభక్తుని కథ]

విజాపురదుర్గము కైవసమైనది. తోడనే ఔరంగజేబు చక్రవర్తి నేత్రములు మూసీనది ఉత్తరతీరమున ఉన్న గోలకొండదుర్గముపై బడెను. గల్బర్గాలోనున్న ఒకానొక సాధుపుసమాధి సందర్శించుటకు పోవుచున్నానని బొంకి మొగలుచక్రవర్తి స్వసైన్యములతో గోలకొండదుర్గమును సమీపించెను. 1687-వ సంవత్సరము సెప్టెంబరుమాసము. గోలకొండ ప్రభువు అబూహాసన్ కుతుబ్ శాహ చక్రవర్తి సన్నాహము పసిపట్టుటతోడనే తన సరదారులగు అబ్దుర్ రజాక్ ఖాన్ లారీ మొదలగువారి నాయకత్వమున కొంతసైన్యమును మొగలు సైనికులరాకలు నెదిరింపబంపెను.

రజాక్ ఉపాయశాలి. మొగలుసైనికులను కోట ముందుకురానిచ్చి తాను వారిని వెనుదగిలెను. ఎదుట గోలకొండకోటలోని సైనికులు - వెనుక రజాక్ భటులు. మొగలుసేన ఇరుకునబడెను. కాని ముట్టడి సాగుచునేయుండెను. దినములు గడచినవి. వారములు వెళ్ళుచున్నవి. ముట్టడి ప్రారంభమై కొన్నిమాసములైనది. ఒకనాడు ఉన్నట్టుండి రజాక్ నాయకత్వమున అతనిభటులు మొగలుభటులపై బడిరి. సందడికయ్యము ఇరుపక్షముల విశేషజననష్టము కలిగెను. రజాక్ దాడి నరికట్టుసరికి మొగలుభటుల తాతలు దిగివచ్చిరి.

అప్పటికి గోలకొండముట్టడి ప్రారంభమై అయిదుమాసములైనది. రజాక్ దాడికి వానదాడితోడై మొగలులను గారించెను. మొగలుల గుడారములు గాలికి ఎగిరిపోయినవి. కాగా కుంభవృష్టిగ వర్షించుచున్న మేఘములే వారికి గుడారములయ్యెను. రోకళ్ళలావున పడుచున్న వర్షధారలే గుడారపుత్రాళ్ళు అయ్యెను. మొగలులిట్టి శోచనీయపరిస్థితులలో నుండగా రజాక్ సైనికులు తిరిగి వారిపైబడిరి. ఔరంగజేబు సేనానులధైర్యకంచుకము పగిలిపోయెను; ఉచితకార్యమును మఱచి వారు దాగుకొనచొచ్చిరి. మొగలు సేనానులలో నొకడు - శాఫ్ షికాన్ ఖాన్ - పరాక్రమమునకు పేరుమోసినవాడు - రొమ్ముమిఱచి లారీని ఎదురించినాడు. కాని వీరాగ్రేసరుడగు లారీధాటికి తాళలేకపోయినాడు. గాయముతగిలినట్లు నటించుచు నాతడు పితపితలాడు బురదలో పండుకొన్నాడు. అతనిని, మఱికొందఱు మొగలుసేనానులను చెఱపట్టి లారీ కొనిపోయి తన ఏలికయగు అబూహాసన్ ఎదుట నుంచినాడు.

చేజిక్కిన శత్రువులను హాసన్ దయార్ద్రహృదయముతో గౌరవించెను. వారిని గొనిపోయి తనకోటలో నిలవయుంచబడిన పెక్కుదినములకుసరిపోవు ఆహారపదార్థములను, మందుగుండుసామానును చూపెను. శత్రువులకు కోట ఒకపట్టున స్వాధీనముకాదు; అయినను ఈ ఎడతెగని యుద్ధము ఉభయులకును లాభకరముగాదు, కావున సంధిచేసికొనుట మంచిది, మీ ఏలికతో ఇట్లుచెప్పుడు అని వారికిబోధించి హాసన్ వారిని భద్రముగ కోటవెలుపలకు పంపివైచెను. వచ్చినవారు చెప్పినవాక్యములు ఔరంగజేబు వినెను. కాని అతనిహృదయము మారలేదు. 'అబూహాసన్ మడిచేతులతో నాఎదుట నిలబడిచెప్పు వాక్యములనుగాక అన్య

వాక్యములను నేను వినను' అని ఔరంగజేబుపాదుషా పలికెను. తిరిగి ముట్టడి ఎప్పటిబిగితో ప్రారంభమయ్యెను.

కష్టములో కష్టము దేశమునకఱవు పొడచూపెను. గోలకొండసైనికులు నిరోధించకున్ననే మొగలులకు ఆహారపదార్థములరాక అత్యంతకష్టమయ్యెను. పైగా గోలకొండభటుల నిరోధము. మొగలులు చెప్పనలవి కానిబాధకు లోనగుచుండిరి. ఏమియు పాలిపోక ఔరంగజేబు విజాపురదుర్గమున తాను ప్రతినిధిగా నిలిపిన రూహుల్లాఖానును పిలిపించెను. ఎవరువచ్చి ఏమి చేయుదురు? కోటలో కొఱవడని సంభారములుండుటచే గోలకొండ సైనికులకు నిరభ్యంతరముగా దినములు గడచిపోవుచుండెను.

కోట సాధించినగాని ఆచోట నిలుచుటకష్టము కాగా ఔరంగజేబు ముట్టడి మఱింతదీక్షతో సాగించెను. మొగలుసైనికులు పాతఱగోతులు తీసి అందు మందుగుండుసామాను దట్టించి వానిని ప్రేల్చి కోటగోడలను పడగొట్టుటకు యత్నించిరి. గోలకొండ సంరక్షణమున సహస్రాక్షుడై వర్తించుచున్న రజాక్ ఈ యత్నమును ప్రారంభముననే కనుగొనెను. మొగలులు మూడుగోతులు తీసి వానియందు మందుదట్టించి వానిని ప్రేల్చుటకు సిద్ధముచేసిరి. ఆ గోతులలో ఒకదాని ప్రక్కను లారీ తన సేవకులచే మఱియొక గొయ్యి రహస్యముగతీయించి మొగలుల పాతరనుండి మందుగుండు సామాను చాకచక్యముతో తోడించెను. మిగిలిన రెండుగోతులను కోట సమీపభాగమును తడిపించి మొగలు గుడారములతట్టునఉన్న భాగములను తడిపించకవదలివైచెను. ఈ రహస్యమును మొగలులు కనుగొనలేదు. తాము ఈ పాతఱగోతులదగ్గర మాఁగి చప్పట్లుకొట్టుచు కోటగోడలకు ఎగఁబ్రాక ప్రయత్నపడుచున్నట్లునటించి లారీని, అతని జనులను అచటకు ఆకర్షించి వారు వచ్చినతోడనే మందుగనులకు నిప్పుముట్టించి లారీని ససైన్యముగ మట్టుపెట్ట వారు సంకల్పించిరి. అంతయును వారు అనుకొనినటులే జరిగెను. వారు చప్పట్లుకొట్టిరి, లారి అచటకు ససైన్యముగ వచ్చెను. లారీ, సగముతడిపించినగనులకు వారు నిప్పుపెట్టిరి. కోటవైపున మందు తడిసియుండుటచే ఆ గనులు మొగలు గుడారముదిక్కున ప్రేలెను. ఎవరు తవ్వుకొన్న గోతులలో వారే పడుదురనుసామెత సార్థకమయ్యెను. ఆగనులు ప్రేలి మొగలుసైనికులు మూడువేలమందికిపైగా చనిపోయిరి. చనిపోయిన వారిలో పలువురు గొప్ప ఉద్యోగస్థులుండిరి. మొగలు సేనా నివేశము చిందఱవందఱయయ్యెను. అదే మంచి సమయమని లారీ భటులతో శత్రువులపైబడి గారింప దొడంగెను. మొగలులు విషమపరిస్థితిలో పడిరి. ఈ సమయముననే పెద్ద వర్షము కురియనారంభించెను. ఔరంగజేబు స్వయముగ సేనను నడపెను. కాని వెనుకకు మరలక తప్పినదికాదు. లారీ నాయకత్వమున గోలకొండ సైనికులు మఱింత విజృంభించిరి. మొగలుల తుపాకులెన్నియో వీరు స్వాధీనపఱచుకొనిరి. మోసుకొనిపోవజాలినన్ని మోసుకొనిపోయి మోవదరముకాని వానికి మేకులుకొట్టి నిరుపయోగమొనర్చిరి. కందకము పూడ్చుటకు మొగలులుకూర్చిన ఇసుకబస్తాలను సంగ్రహించి వానితో పాడైనచోట కోటగోడలను దిటవుపఱచిరి. కందకమును పూడ్చుటకు మొగలులు అందులో పడవైచిన కొయ్యపలకలనుకూడ బయటికిలాగి వానితో కోటగోడల నెఱదలనుకప్పిరి. ఒకరాయితో రెండుపిట్టలనుకొట్టినట్లు వారు ఈవిధమున కందకమును తిరిగి లోతుచేసిరి; కోటగోడకు తిరిగి బలముకూర్చిరి.

చేసిరిగాక, కూర్చిరిగాక ఔరంగజేబు పుయిలోడలేదు. ప్రేల్చక మిగిలినది ఇంకను ఒకగనియున్నది కదా! మఱునాడుదయమున దానికి నిప్పంటించుటకు ఔత్సుక్యముతో ఔరంగజేబు ఆజ్ఞఇడెను. ఆజ్ఞయిడుటయేకాదు దగ్గఱయుండి కాల్పించుటకు కడంగెను. లారీ ఆవఱకే దానిని పందికొక్కు గావెను దొలచినట్లు తొలచియున్నాడని ఆతడేమి ఎఱుగును? నిప్పంటించవలసియున్నతావు ఏమియు చెక్కుచెదరక అట్లేయున్నది. లారీచేసిన మోసము చక్కగపాఱినది. కావున ఎట్టి అనుమానమునులేక మొగలులు అవురంగజేబు సమక్షమున దానికి నిప్పుముట్టించిరి. ఎంతకును

గనిప్రేలదు. ఏక్షణమున ప్రేలునో అని ఎవ్వరును దానిని డాయనొల్లరు. కొంతసేపటికి చారుడొకడు వచ్చి గోలకొండవీరుడు చేసినపని చక్రవర్తికి చెప్పెను. అప్పటి మొగలుచక్రవర్తి వెలరువారిన వగకు పారము లేకుండెను. మఱునాటివఱకు ముట్టడి ఆపుచేయవలసినదిగా ఆజ్ఞాపించుచు చక్రవర్తి నిరుత్సాహుడై తన గుడారమునకు పోయెను.

యుద్ధముచేసి సుల్తాను అబూహాస్సనును జయించుట కష్టమని చక్రవర్తికితోచెను. అగుట మాయోపాయము ప్రయోగించుటకు దొరకొనెను. గోలకొండ దుర్గరక్షణమున సహస్రాక్షుడై శౌర్యము ప్రకాశమానము చేయుచున్న అబ్దుర్ రజాక్ ఖాన్ లారీని లంచమిచ్చి లోబఱచుకొనినచో గోలకొండను గోటితో మీటవచ్చునని పాదుషా తలంచెను. ఈవఱకే ఎందఱో గోలకొండ సరదారులు తన డబ్బునకాశించి తనపక్షమున జేరినారు. లారీమాత్రము ఎందుకుచేరడు? డబ్బు చేదా? ఉన్నతపదవులపై చిత్తముపోదా? 'గోలకొండ కొలువువిడిచి నీవు మాసేనలోచేరినచో లెక్కలేని ధనమిత్తును; మొగలుసైన్యమున నాఱువేల గుఱ్ఱపుదళముపై నధికారిగా జేతును' అని మొగలుచక్రవర్తి లారీకి ఉత్తరము వ్రాసెను.

చక్రవర్తివ్రాసిన ఉత్తరము చల్లగనందుకొని లారీ చంకలుతాటింపలేదు. తుదకు దానిని అతడు రహస్యముగనైన ఉంచుకొనలేదు. ఆఉత్తరము నాతడు కూరాకులో పురుగునుచూచు అసహ్యముతోచూచెను. తన సైనికులఎదుట ఆ జాబును పెట్టి చదివి అందలి విషయములు వారికి వివరించి దానిని తుంబతుంబాలక్రింద చించి గాలికివిడచెను. మొగలుచక్రవర్తి ఇదివిని బహిరంగముగా లారీని తూలనాడెను. కాని అంతర్యమిచ్చిన మిత్రులతో చక్రవర్తి లారీ అసమానమగు రాజభక్తిని, నిరుపమానమగు ధైర్యమును బహుధాప్రశంసించెను.

అందఱును అబ్దుర్ రజాక్ వంటి అచంచల రాజభక్తులు కాజాలరు. గోలకొండ సైనికులలో మఱియొకడగు సర్దారుఖానునకుంగూడ అబ్దుర్ రజాక్ నకు వర్తమానముచేసినట్లే చాల ధనమిత్తునని ఔరంగజేబు వర్తమానముచేసెను. చక్రవర్తివలన లంచముతిని సర్దారుఖానుడు తనస్వామికి ద్రోహముతలపెట్టెను. ఒకనాటి రాత్రి తాను కావలియున్న కోటద్వారమును తెఱచి సర్దారుఖానుడు మొగలుసేనలు గోలకొండ దుర్గములో ప్రవేశించుటకు వీలుకలిగించెను. ఎనిమిదిమాసములమీద పదిరోజులు ముట్టడి సాగినతరువాత ఇట్లు మాయోపాయమువలన మొగలుసేనలు కోటగుమ్మములోపల కాలుపెట్టగలిగిరి.

మొగలుసైనికుల జయధ్వానములను వినిపించుటతో అబ్దుర్ రజాక్ నకు కాలుసేతులాడని కంగారుపుట్టెను. ఆ తొందరలో నాతనికిం దనగుఱ్ఱముమీద జీనువేసికొనుటకైన తీరుబడిలేకపోయినది; నడుమున వదులైయున్న పటకాబిగించుకొనుటకైన నవకాశము లేకపోయినది. బిగించని పటకాతో నాతడు జీనులేని గుఱ్ఱము నెక్కెను. గుఱ్ఱము దౌడుతీసెను. ద్వారమునుండి మొగలుసైనికులు కండచీమలవలె వచ్చుచుండిరి. కుడిచేతిలోనున్న కత్తి, 'యెడమచేతిలోనున్న డాలు గట్టిగం బట్టుకొని అబ్దుర్ రజాకు వారిమీదకు గుఱ్ఱమును దుమికించెను. 'అబూహాసనుపక్షమునం బోరుట కింకను ఒకడు మిగిలియున్నాడు. అనుచు నాతండు యుద్ధము చేయసాగెను. అతనివెంట అనుచరులు అప్పటికి పండ్రెండుగురకు మించిలేరు.

శత్రువులు వేనకువేలుండిరి. వారినడుమను వ్రేళ్ళమీద లెక్కింపగల అనుచరులతో తానొక్కడు. అయినను ఆ రాజభక్తుడు రవ్వంతైన భయపడలేదు. ఘోరముగా యుద్ధముచేయుచుండెను. ఆ రాజభక్తుని కరవాల మాసమయమున మొగలుసైనికుల నెందఱం జెండినదో లెక్కలేదు. శత్రువులు కందిరీగలవలె జుట్టును ముసిరి వాడికత్తులతో అబ్దుక్ రజాకునునొప్పింపసాగిరి. అతని శరీరము నఖశిఖపర్యంతమును కత్తివేటులతో, బాణపుపోటులతో నిండిపోయెను. అతనికి ముఖముమీదనే పండ్రెండుగాయములు పడెను; ఒక కంటికి బలమైనదెబ్బతగిలెను. నుదుటిపై చర్మమురేగి వదులై క్రిందికి వ్రేలాడుచుండెను. అట్లు వ్రేలాడుచున్న చర్మము కంటికడ్డముగా నుండుటచేత నతనికిం జూపు

తిన్నగా అనకుండెను. ఆ రాజభక్తుని మోయుచున్న గుఱ్ఱమునకుఁగూడ జాలగాయములు తగిలెను. గాయములవెంట రక్తమెడతెగక కారుచుండుటచేత నా గుఱ్ఱము మిక్కిలి నీరసస్థితిలోనుండెను.

చూపు ఆనకుండుటచే అబ్దుర్ రజాకు దారికూడ కనుఁగొనలేకపోయెను. అప్పుడాతడు గుఱ్ఱముమీద జాగ్రత్తగనుండి కళ్ళెమును వదులుచేసెను. ఆ గుఱ్ఱము మూకనుతప్పించుకొని యొకానొక తోటలోనికిబోయి యొక కొబ్బరిచెట్టుక్రింద నిలిచెను. ఆ కొబ్బరిచెట్టు సాయమున రజాకు గుఱ్ఱమునుండి క్రిందకుజారెను, అప్పుడాతనికి స్మృతి తప్పిపోయెను.

అంత మొగలుచక్రవర్తి గోలకొండదుర్గమును స్వాధీనము చేసికొనెను. అబూహాసనుని చెఱసాలలోఁ బెట్టెను.

రక్తములో దడసియున్న అబ్దులురజాకు ఆ కొబ్బరి చెట్టుక్రింద దేహముతెలియనిస్థితిలో నొకదినమంతయుఁ జడియుండెను. హుస్సేన్ బేగ్ అను సరదారునిమనుష్యులు అతనిని అనవాలుపట్టి బేగ్ యింటికి తీసికొని పోయిరి. శత్రుపక్షములోని వాడైనను లారీ కొనఊపిరితోనున్న కారణమున దయదలచి వారు అతనికి ఉపచారములుచేసి రూహుల్లాఖాను ఇంటికి తీసికొని వెళ్ళిరి. యుద్ధమున లారీచే ఓడింపబడిన శాఫ్ షికాన్ ఖాన్ ఆ సమయమున రూహుల్లాఖాన్ యింటియందుండెను. లారీధాటికి ఆగజాలక తాను ఆనాడు గాయముతగిలినట్లు నటించుచు పితపితలాడుబురదలో పండుకొనిన సంగతి జ్ఞప్తికిరాగా శాఫ్ షికాన్ ఖాన్ లారీ తలకొట్టించి దానిని కోటగుమ్మమునకు వ్రేలాడ కట్టవలయునని సూచించెను. కాని ఈ సూచనకు ఉదారహృదయుడగు రూహుల్లా అంగీకరింపలేదు. శాఫ్ షికాన్ చేసిన సూచన అనుచితమైనదని రూహుల్లా నొక్కిచెప్పి లారీ దొరికినవృత్తాంతము చక్రవర్తికి తెలిపెను.

రాతిగుండెకల మొగలు చక్రవర్తిసయిత మాతని సమాచారము తెలిసికొని, అతని రాజభక్తికి, శౌర్యమునకు మిక్కిలి యాశ్చర్యమును పొందెను. 'ఇట్టి సేనాని మఱియొకఁడు అబూహాసనువద్ద నుండినయెడల మేము గోలకొండదుర్గమును పట్టుకొనుట కలలోనివార్తయై యుండును' అని మొగలుచక్రవర్తి పలికెను. పిమ్మట ఔరంగజేబు అబ్దులురజాకునకుఁ జికిత్సచేయుట కిద్దఱు రణవైద్యుల నేర్పాటుచేసెను. ఆ వైద్యులలో నొకడు యూరోపుఖండమువాఁడు. మఱియొకడు హిందువుఁడు. వారిరువురు నతనికిఁ జికిత్సచేసి 'రజాకు శరీరముమీఁద డెబ్బదిగాయములు స్పష్టముగానున్నవి. ఇంకను ఎన్నోగాయములు కలవు. కాని గాయముమీఁదగాయము పడియుండుటచేత లెక్కవేయుటకు వీలులేకపోయినది.' అని చెప్పిరి. పదునాఱుదినము లుపచారములుచేయగా రజాకు కన్నులు విప్పిచూచెను.

కొన్నిదినములకు రజాకుగాయములు కొంచము నెమ్మదించెను. అప్పుడు ఔరంగజేబు అబ్దులురజాకు లారీకిట్లు వర్తమానముచేసెను. 'నీ అపరాధముల నన్నింటిని క్షమించితిని. నీవు నాకొలువులోఁజేరుము. నీకు గొప్పగొప్ప అధికారములనిచ్చెదను. నీ పెద్దకుమారుఁడు 'అబ్దులుకాదిరు'ని, మిగిలినకుమారులను నాదగ్గఱకుఁ బంపుము. వారికిఁదగిన ఉద్యోగము లేర్పాటు చేసెదను.'

ఆమాటలకు అబ్దులురజాకు ఇట్లు బదులుచెప్పెను. 'మీరు నా కుపచారములు చేయించినందులకుఁ గృతజ్ఞుఁడను. ఇఁక నేను చిరకాలముబ్రతుకను. బ్రతికియున్నను ఉద్యోగముచేయుటకు నాకు శక్తి, ఓపిక కలగదు. ఒకవేళకలిగినను అబూహాసను కుతుబుశాహి యుప్పుతినిన నేను తమసేవ కంగీకరింపఁజాలను. హసను సేవకులలో మానముకలవాఁడెవఁడును వానికి శత్రువులైన తమకొలువున కొడబడఁడు.'

ప్రాణములు నిల్పితివి నాదుప్రణుతిగొనుము,
గెల్చికొంటివి రాజ్యలక్ష్మిని బడయుము,
పెట్టిపుట్టినాడ వనుభవింపుము సిరి
కక్కురితిమాట లికజాలు కట్టిపెట్టు,
పిలువకుము నన్ను నుద్యోగఫలము చూపి
నాల్కయొక్కటి నాకు డెందమ్ము నొకటి,

విడిచి గోల్కొండ వేఱొకరెడకు చనుట
భండనమునకో, కాకున్న స్వర్గమునకో.

ప్రాణములనొడ్డి, రక్తస్రవంతు లీది
ప్రభువు తానాశాహకొలువున పడసినాడ:
మొగలుసామ్రాజ్య రక్షణమునకు గాదు
శిక్షణమునకుగాని నా చేతికత్తి.

సుతునిపోలిక తానాశాహ చూచెనన్ను
చనవొసగి గౌరవముచేసి ధనముగూర్చి:
క్షుద్రుడనునేను విజయమ్ము గూర్పనైతి
మీదుకట్టగవలదె యీ మేని నయిన.

కత్తివిడిచి ఢిల్లీశుడు కానువిసరె
చాలు గోల్కొండ కీగొప్ప · శాశ్వతమ్మె
జీవనము ? సొంతపురిజేరి చిత్రకథల
తేజరిలుమయ్య వేగ నీరోజునేడు.

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

రాజభక్తుఁడగు అబ్దులురజాకు ఈ మాటలు విని ఔరంగజేబు చిన్నపోయెను.

అబ్దులురజాకు లారీ సాటిలేని రాజభక్తుఁడు. ఔరంగజేబు లక్షలకొలఁదిధనమును, గొప్పగొప్ప యుద్యోగముల నిచ్చెదనని చెప్పినను రజాకు వానికాశపడి తన రాజునకు ద్రోహముచేయలేదు. తోడిసేవకులెందఱో ఔరంగజేబువలన లంచములుతిని స్వామిద్రోహులైరి. కాని రజాకు చివరకుఁ దనయజమానిని నమ్మికొలిచెను. అతనికొఱకుఁ బ్రాణములకు తెగించి యుద్ధముచేసెను. తనశరీరము గాయములతోఁ దూట్లబానవలెనైనను ఆతఁడు చింతింపలేదు. తన కన్నుపోయినను ఆతఁడు దుఃఖింపలేదు. తనస్వామి కపకారముచేసిన ఢిల్లీ చక్రవర్తిసేవలోఁజేరుటకుఁ బ్రాణములుపోవు స్థితిలోగూడ నాతఁ డొప్పుకొనలేదు. ఇట్టి యచంచలరాజభక్తుఁడందఱికి నన్నివేళలయందును పూజింపఁ దగినవాఁడు.

# విచ్ఛిన్నప్రణయము

౧

ఉదయం యెన్మిదిగంటలయింది.

పారిజాత వృక్షంక్రింద, రాతి తిన్నెపై పూలదండ గుచ్చుతోంది సుభద్ర. ప్రక్కన శూన్యదృక్కులతో చూస్తున్నాడు శ్రీనివాసం. యవ్వనప్రారంభాన్ని సూచించే నును మీసకట్టు ఆవిశాలమోముకి మరింత వన్నె దెచ్చింది.

అనన్య సామాన్యమైన ఆశయాల్ని అణచి, త్రొక్కుతూవున్న హృదయారాటంతోటి, భారంగావున్నాడు శ్రీనివాసు. ఆవికసిత నేత్రాల్లో దైన్యం తాండవమాడుతోంది. ఆలేత పెదిమలపై, భారంగా యేవేవో కొన్నిమాటలు రాబోతున్నా, పైబడ్డంలే—తుదకి—.

'రేపు కాలేజీ తెరుస్తారు' అన్నాడు.

నీరవయై, నిస్తబ్దయై, వంచినతల నెత్తింది సుభద్ర. చేతిలోనిదండ గట్టుపైబడింది. వాసు కళ్ళల్లోకి చూస్తూ—

'ఎప్పుడు ? రేపా ? - నాతో యింతక్రితం చెప్పలేదేఁ ?' అంది ఆదరిమొప్పే చూపులతోటి -

'ఇకనాకు చదువు జరగదు. రోజులు భారంగా వున్నాయి! కాలేజీచదువు చాల ఖర్చుతోకూడినది. నేను దరిద్రుణ్ణి....

అతని నేత్రగోళాలు నీటిమయమై పోయాయి. ఇంతయిన మోము వంచుకొన్నాడు. ఒకటి రెండు కన్నీటిబిందులు రాతిపైబడి సుభద్ర హృదయాన్ని కలచేసాయి. తటాలున లేచి నిలుచుంది. ఆతొందరలో భుజముపై పైట ప్రక్కకుజారింది. శ్రీను యెదురుగావెళ్ళి, రెండుభుజాలు అదిమిపట్టి, కుడిచేత్తో తలయెత్తింది. ఆదీన మోముని

జూచి, నీరవమైంది. తనదుఃఖ మాపుకోలేక పోయింది

'ఏడుస్తావెందుకు ? ఎందుకు కన్నీళ్ళొచ్చాయి.' అంటూ దీనంగాచూచింది.

'నేను దరిద్రుణ్ణి. 'నా' యన్నవారు లేరు ఏకాకిని'

'ఇపుడేల ? ఆవిచారమిపుడెందుకు ?— చెప్పవు ?'

'పరీక్ష ప్యాసయితే ముందుచదువు ?

.... ... .... ... ........ ... ...

'నాకుదిక్కెవ్వరు ? సుభద్ర! నేను వెళ్లిపోతానన్నాడు.'

మెల్లిగా లేవపోయాడు. లేవలేకపోయాడు. తలెత్తిచూచాడు. సుభద్రవీక్షణాలలోవున్న ప్రేమ, ప్రణయంకూడా ఆస్థితికి కరిగినీరయిపోయి కాల్వకట్టేస్తున్నాయి. ఆమె రెండుచేతులు వాసుమూపుపై వున్నాయి. తల కొంచెంవొరిగింది.

౨

ఆంధ్ర దేశానికల్లా ఉత్తమ తరగతిలో ప్యాసయాడు శ్రీను స్కూలుపైనలుక్లాసు. కాలేజీ తెరుస్తూవున్న హడావడి వొకమూల కాశీనుండి పండితమదనమోహన మాలవ్యా కాలేజీ చూడ్డానికివచ్చాడని తొందర ఒక మూల - చాలా హడావడిగావుంది. కాలేజీ ఆవరణలో కృతార్థులైన విద్యార్థులు కేళింతాలు కొడుతున్నారు. పరీక్ష తప్పినవారు దిగాలుపడిపోతున్నారు. కాలేజీ ప్రిన్సిపాలు దొర తనకాలేజీకి మొదటితరగతి వచ్చిందని, గర్విస్తూ, తనయెదుటకూర్చుని మాలవ్యా పండితులతో యేమేమిటో ప్రసంగిస్తూవున్నాడు. వారిరువురిదృష్టులు ప్రక్కనున్న శ్రీనివాసుమీదే వున్నాయి.పండితుల నేత్రాలలో ఆనందలక్ష్మి తాండవమాడుతోంది.

'శ్రీనివాస్! నాతో బనారసు వస్తావు? విశ్వవిద్యాలయంలో చదువుకుందిగాని' అన్నాడు పండితుడు ఆదరంగా.

'బాగుంది. ఇతను పేదవాడు మీవంటి వారు సాయంచేస్తే విద్యాధికుడు అవుతాడు. వాసూ! నాకుచాలా ఆనందంగావుంది. వెళ్ళిరా!' అన్నాడు ప్రిన్సిపాలు.

శ్రీను హృదయంలో, ఆనందం క్షణాన్కి తెరమరుక్కిపోయినసూర్యుడులావుంది, మరు క్షణాన్కి విముక్తభానుడిలాగుంది. ఇంతలో సుభద్ర కన్నీళ్ళతో - అంతలో కాశీ-విశ్వవిద్యాలయం, అందలి విద్యార్థులు. భావనేత్రాన్కి కనపడ్డారు.

'ఏమివాసూ!' అన్నాడు పండితుడు.

'చిత్తం! వస్తానండి'.... .......

పెద్దలముఖాన్ని ఆనందం వెల్లివిరిసిపోతోంది.'పన్నెండింటికి వెడదాము.ఇంటిదగ్గిర చెప్పి సిద్ధముగావుండు' అన్నాడు పండితజీ.

'ఇల్లువాకిలి, 'నా' అన్నవారు, పాపం, లేరండీ' అని ప్రిన్సిపాలు ఆదరంగా, శ్రీనుని చూచాడు.

'పాపం!— — —సరే! నాతోవుండు. పన్నెండుగంటలబండికి వెడదాము—'... పండితులు అభయము. శ్రీను మంత్రముగ్ధుడులా వారితో వెళ్ళేడు.

౩

కాలచక్రంలో నాలుగుయేళ్లు తిరిగాయి. బి. యె. ప్యాసయాడు శ్రీనివాసు. యీ కాలంలో పండితులహృదయాన్ని బాగా ఆకర్షింపగలిగాడు. ఆంధ్ర విజయధ్వజం, ఆంధ్ర మనోశక్తి, ఆంధ్ర యశస్సు - వెదజల్లిపారేశాడు కాశీలో. బాలబాలికలలో శ్రీనంటే, అతిగౌరవం, భయం, భక్తి. శ్రీను యశోవిశేషాల్ని అఖండంగా పొగుడుతున్నాయి పత్రికారాజాలు-ఆంధ్ర పత్రికలు శ్రీను యశోగానంపాడుతున్నాయి. చిత్రము

లలితా, శ్రీనుని, ఆంధ్రలో కాకిని పరిచయం చేస్తున్నాయి. ఆంధ్రమాత, నిజకుమారునికి స్వాగతమిచ్చుట కుర్రూతలూగుతోంది. శ్రీను బుద్ధిబలమునుగురించి, నడవడినిగురించి, మాలవ్యాపండితులు ఒక పెద్దవ్యాసం పత్రికలముఖాన్ని లోకానికి విసికిడి చేసారు.

౪

శ్రీనివాసు సాయంకాలం వెళతానని చెప్పి వెళ్ళడమే కాని తిరిగిరా లేదు. నోప్యమైన హృదయంతో కొంతకాలం వేచివుంది ఉద్రేకమయినచిత్తంతో మరికొంత కాలం చూచింది. శూన్యమైనభావంతో ఇక కొంతకాలం నిరీక్షించింది. నిస్పృహ, నిరాశ, మూర్తీభవించి, సుభద్రని కర్తవ్యవిముఖిని చేసాయి. సంవత్సరమయింది. శ్రీను రాలే. వేసంగిసెలవులకు వస్తాడని ఆశించింది. ఇక నెలున్నాయి యీలోగా, తండ్రి, యెదిగినపిల్ల అని చక్కని సంబంధంకుదిర్చాడు. వరుడుఒక ధనికుని ఏకమాత్రపుత్రుడు-సుందరుడు నీతి, తెలివియున్నవాడు.

శ్రీనుకొరకు నిరీక్షించిన వేసంగిలో సుభద్రకు, శ్రీనుబదులు, వేరొకయువకుని చెట్టపట్టవలసివచ్చింది. హృదయవిచారమెరిగింపలేనిముగ్ధ-పవిత్రప్రేమప్రవాహమున కొట్టుకొనిపోవు అమాయిక - జననీజనకులకు విధేయురాలగు పవిత్రచరిత్ర-కుమారప్రసాదునర్ధాంగి అయినది. మాతాపితల కానందమొనగూర్చినది.

ఆమెహృదయమున ప్రేమ నివురుగప్పిన నిప్పు.

ఆమె హృదయారాటము పొగలేనిమంట.

సంవత్సరము జరిగినది. సుభద్ర అత్తవారింట,—పతికి విధేయ, అత్తమామల కణకువ - ఇరుగుపొరుగులకు తలలోనినాల్క— రెండుసంవత్సరములు గడచినది. భగవంతుడు చూడలేకపోయినా ఈమిథునానురాగము. తనపని నిమిత్తము రుగ్ణత అనే వల పన్ని కుమారప్రసాదుని హరించుకొని పోయాడు.

గతభర్తృక, అడవిపువ్వను నవజీవితారంభములో, ప్రపంచకయాత్రా ప్రథమసోపానంలో, సౌఖ్యదినాల్లో—భగవంతుని వడిశెల దెబ్బకు మూర్ఛిల్లిపోయింది. ఆమె మనస్సులో తుపానుపట్టింది. ఆశానౌక వికలమైంది. సౌఖ్యసంపద, కాలసముద్ర గర్భగతమైనది. ఇంక ఆమోమున మార్దవము లేదు. ఆమాటల రసజీవము లేదు. ఆమూర్తిని ప్రాణములు దక్క హృదయము లేదు. సంవత్సరము గతించినది. కొంచెము దృష్టి మారినది. కొంతదుఃఖము దిగమ్రింగినది ఇల్లువిడచి బయట మొగమెరుగదు. ఆ దురదృష్టవ్యక్తి యింట కుమిలిపోవుచున్నది.

* * *

'అమ్మా!' అని పిలిచాడు రామచంద్రరావుగారు అప్పుడే రాజమండ్రీనుండి యింటికివచ్చి, కూతుర్ని.

'నాన్నగారూ!' అంటూ సుభద్ర గదిలోనుంచి, వచ్చి తండ్రికెదురుగా నిలుచుంది. తలవంచుకొని. తండ్రికళ్లు నీటిమయమైపోయాయి. నోట మాటరాలేదు. కరములు కంపించిపోయాయి. కొంతసేపటికి ఉపశమించుకొని.

'ఏంచేస్తున్నావు తల్లీ!' అని తలనిమురుచూ పలికాడు, గద్గదిక మొచ్చే మాటలతో. సుభద్ర మాట్లాడలేదు.

'అమ్మా! పుస్తకం కొన్నాను అర్ధరూపాయి యిచ్చి అంధరూ అపురూపంగా కొంటూవుంటే, అని పత్రికని సుభద్రచేతికిచ్చి, వికారంగా, తలూచి మెల్లిగా గదిలోకి చక్కా పోయ్యాడు.

సుభద్ర వంటింటి వసారాలో పీటకు జేర్ల

బడీ, కౌగిళ్లాలు నలక్కుండా ఒక్కసారి తటాలున పుస్తకం తెరిచింది. కళ్ళు మూతలు పడ్డాయి. వేడినిట్టూర్పు గంభీరంగా వెలువడింది, మరల కన్నులు తెరచి పుస్తకం కేసి చూచింది.

అదొక ఛాయాచిత్రము. నిగ్గులు తేరిన జుట్టు. ముద్దులుమూటకట్టు నును మీసకట్టు. విశాలమైన మోము, వికసించిన నేత్రాలు. భావగంభీరమైన చూపు.

సుభద్ర కన్నులు నీటిమయమైపోయాయి రెండుబొట్లు అప్రయత్నంగా ఆచిత్రంమీద పడ్డాయి. వెంటనే పైటకొంగుతో తుడిచింది. మరల చూచింది చిత్రాన్ని, మృదు మందహాసం చేస్తోంది. ఏమిటో పలుకుతూ వున్నట్లు స్మృతినేత్రానికి వినిపించింది.

'నేను దరిద్రుణ్ణి - ఏకాకిని'—అన్నట్లు - ఒళ్ళు నీరువిడచిపోయింది. 'చైతన్యము నశించినట్లయింది. అనుకోంది దృష్టి పుట పైభాగానికి పోయింది. 'ఆంధ్రాభ్యుదయము' అని వుంది. పుట దిగువభాగం చూసింది. 'శ్రీ శ్రీనివాస్' అని వుంది.

ఇక చూడలేకపోయింది. పుస్తకంమూసి, తటాలున లేచిపోయి, సావిట్లో బల్లమీద పుస్తకంపారేసి, గదిలోకెళ్ళి మంచంమీద బోర్లాపడుకుంది.

ఇంతవరకు హృదయమున శ్రీనివాసు నివురుగప్పిన నిప్పు. ఇపుడు పీతధూళుడైన అగ్ని. భరింపలేక పోయింది. విలవిల యేడ్చేసింది. తలగడ తడిసిపోయింది. కళ్ళు యెరుపెక్కాయి, మోము కందిపోయింది. మూర్ఛిల్లి నిద్రపోయింది శూన్యభావంతో.

౫

ఆంధ్ర దేశ యశోలతని దేశదేశాలమ్మట ప్రసరింపచేసిన పూజ్యుని ఆంధ్ర దేశయాత్ర, ముందుగా ప్రకటింపబడింది, తేదీలతోసహా, అనేక స్థలాలనుండి ఆహ్వానాలు వెళ్ళాయి శ్రీనివాసుకి - ప్రతీచోటికి వెళ్లి వార్నందరిని ఆనందాబ్ధిని ముంచేశాడు శ్రీను.

ఆ వేళ ది 5-6-1931 తేదీ కాలేజీలో శ్రీనువాసు మధ్యాహ్నం గం 3-30 లకు ఉపన్యాస మివ్వడానికి యేర్పాట్లు జరిగాయి. పురప్రముఖులతో హాలంతా కిటకిట లాడిపోయింది. సరిగా సమయానికి శ్రీనివాసు సభా వేదిక నలంకరించాడు. చెప్పేవిషయం- 'హిందూదేశము - ఆర్థికవిషయము' ప్రేక్షకులు తన్మయత్వ మందారు. శ్రీను - చెబుతూంటే - దేశాన్ని గురించి బొటబొట కన్నీరు కార్చేశాడు. వాసు కళ్ళల్లో గభీరత మెరుస్తోంది. జ్ఞానజ్యోతి ప్రకాశిస్తోంది. నిగర్వం మూర్తీభవించింది ఉపన్యాసాంతాన్ని చేతులుజోడించి, తలవంచుకొని, నమస్కరిస్తూ, బల్లపై, ఒక్కకన్నీటిబొట్టు వదిలి, క్రిందికి దిగాడు.

ప్రక్కన గూర్చున్న ప్రిన్సిపాలు ఆనందావేశంచే శ్రీనుని కౌగలించుకొన్నాడు. వెంటనే తప్పునెక్కి ఆవేశపూరిత వచనాలతో ఏవేవో జెప్పేశాడు ఆగలేక. అక్కడ ఆనందం వెల్లివిరిసి పోయింది చిరకాల మిత్రులంతా కుశలప్రశ్నలడిగి, తమయిండ్లకు రమ్మని కోరారు శ్రీనివాసుని.

'అయ్యా! ఒక్కసారి జన్మగ్రామం చూసుకొని వస్తాను ఉదయాన్నే' అని చెప్పి అందరిదగ్గిర సెలవుతీసికొని బయలుదేరాడు. ప్రిన్సిపాలు కారుతీసికొని వెళ్లమన్నాడు కాని, చిరపరిచితమైన దారిని కాలినడకనే వెళ్ళాలని వద్దని దారితీసాడు. అక్కడికి మూడుమైళ్లుంది వెళ్లవలసిన గ్రామం.

౬

'కాకమ్మా! నా శ్రీను వస్తూంటే ఖణేలున గంతెయ్యి' అనే కోకిలానాదం వీధిని

వచ్చే శ్రీనివాసు చెవిని పడింది. ఒళ్లు నీరు విడచి, ఒకసారి బిగియపట్టిన చిత్తంతో ఆలోచించాడు. మనస్సులో యేదో ఉరగలు గ్రక్కుతోంది చక్కని స్వదేశీపంచె, స్వదేశీ పెద్దలాల్చి, పైనకండువా, వాని నిరాడంబర జీవితాన్ని ధ్రువపరుస్తున్నాయి. వీధిలోజనం 'యెవరా?' అని తెల్లపోయి చూస్తున్నారు. కాని, ఒక్కరికి స్పృహకు రాలేదు. శ్రీను యెవ్వరినిచూడలేదు. పలుకరించలేదు. అతనిమనస్సక్కడలేదు.

* * *

'అయ్యా! తమదేయూరండి?' అన్నాడు రామచంద్రరావుగారు శ్రీను అరుగుమెట్లు యెక్కుతూంటే—

'నేను శ్రీనునండీ' అంటూ నిలబడిపోయాడు మధ్యమెట్టుమీద శ్రీను. కళ్లమ్మట ఆనందభాష్పాలు రాలుతున్నాయి.

'ఎవరు? శ్రీనా! నాతండ్రీ! జ్ఞాపకమున్నానా?' అంటూ రామచంద్రరావుగారు లేచి, గబగబ మెట్లుదిగి, శ్రీనివాసుని కౌగలించుకొన్నాడు. ఇరువురి కళ్లు నీటిమయమైపోయాయి. శ్రీను మెల్లిగా కౌగిలి వదల్చుకొని వంగి రామచంద్రరావుగారి పాదాలు కన్నులకద్దుకొన్నాడు.

'వద్దుబాబు! వద్దు!' అంటూ లేవదీశాడు భుజాలుపట్టి.

సావిట్లో దీపారాధన చెయ్యడానికి వచ్చింది సుభద్ర. వీధిలో యెవరో చుట్టమని తల్లివచ్చింది.

'ఎవరువారు! ఏమండి! ఎవరావచ్చింది' అని గృహిణి పతిని ప్రశ్నించింది.

'మన శ్రీనే! శ్రీను,-అంటూ రామచంద్రరావుగారు లోనికి తీసికెళ్లాడు శ్రీనివాసుని.

సుభద్ర తనకన్నుల్ని తనే నమ్ముకోలేకపోయింది. తనచెవుల్ని తనే నమ్ముకోలేకపోయింది. సావిట్లో దివ్యజ్యోతినుంచి, చీకటిగదిలో మంచంమీద బోర్లాపడుకుంది.

'నాజీవితము అంధకారమయము. ఆజ్యోతి యెదుట నాకు నిలుచుటకు తాహతు లేదు. యీజీవి, యిట, కుమిలి, కుమిలి చీకటిలో కరిగిపోవలసినదే'—అంటూ రోదనం చేస్తోంది.

లజ్జాబీజమైనా నాటని హృదయంతో, ప్రపంచక కష్టసుఖాలెరుగని బాల్యావస్థలో, యవ్వన ప్రేమాఫలితమెరుగని యమాయకత్వంతో, మునుపు, శ్రీనివాసుని రొమ్మున కత్తుకుంది. తనచేతిలో బొమ్మల్లె ఆడించింది తనకంట్లో పాపలా దాచేసుకుంది. ఆప్రేమాఫలిత మిదమిద్ధమని యెరుంగని యమాయిక అప్పుడు.

ఇపుడు—మరిగే మనస్సు - లోనిబాధల చూపే కన్నులు - యవ్వనవిలాసాన్ని బిగపట్టిన సౌందర్యం - తెరలుతెరలుగా వచ్చే ప్రణయ తరంగాలచే క్షుభితమైన మనస్సు—

'మాతాపితలకు భారమైన జీవిని, లోకానికి కొరగాని దిక్కుమాలినదానను. ఎందుకు నా కీయుదరపోషణ? ఎందుకు నా కీతనువుపై మమకారము.?'— అంటూ తటాలున లేచి నిలుచుంది. గుండె దడదడ కొట్టుకుంటూంది. కిటికీలోనుండి నీలాకాశం, అందుపై నక్షత్రాలు—శూన్యమైన చూపుతో చూసింది—మిణుకు మిణుకుమనే నక్షత్రాలు అక్షరాల్లా అనుతున్నాయి. కళ్లుచికిలించి చూచింది.—

'నే—ను—ద—రి—ద్రు—ణ్ణి—ఏ—కా— —'

ఇక తెలియులేదు - కళ్లు నీటిమయమయాయి. శరీరమవశమై పోయింది. నిలువునా మంచముపై బడింది.

—వాడ్రేవు చలపతిరావు.

# ముగ్గురు సాధువులు

[టాల్‌స్టాయి మహాశయునిచే రచియింపబడిన కథావ్యాసమున కనువాదము]

'దైవప్రార్థనచేసేటప్పుడు, అన్నమాటలే తిరిగి అంటూ కాలం వృథాపుచ్చకూడదు. ప్రార్థనలో ఎన్ని యెక్కువ పదాలుపయోగిస్తే, అంతగా భగవంతుడు మనమొర లాలకిస్తాడనుకుంటారు అజ్ఞానులు. మీ రెన్నడూ అటువంటిభ్రమలో పడవద్దు. ఎందుకంటే, మీకేది అవసరమో మీరడుగకముందే భగవంతునికి తెలుస్తుంది.'

ఒక 'బిషపు' (మతగురువు) ఆర్కేంజల్‌నుంచి ఒకానొక సన్యాసులమఠానికి పోవలెనని ఓడమీద ప్రయాణమైనాడు. ఆయోడలోనే మరికొందరు యాత్రికులు కూడావున్నారు. వాళ్ళుకూడ యాత్రార్థం ఆచోటికే పోతున్నారు. గాలి అనుకూలంగా వుండటంచేత ప్రయాణం సునాయాసంగా సాగిపోతున్నది. యాత్రికులలో కొందరు భోజనంచేస్తున్నారు. కొందరు గుంపులుగాకూడి కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంతసేపటికి బిషపుకూడ తానున్నచోటువిడిచి, యీ గుంపులమధ్యకువచ్చి అటుయిటు పచారుచేయుటం ప్రారంభించాడు. ఓడ ముందుభాగంలో యాత్రికుల గుంపొకటి నిలబడివున్నది. అదిచూచాడు బిషపు. బెస్తవాడొకడు గుంపుమధ్యనిలబడి వేలుబెట్టి సముద్రం వంకచూపిస్తూ, యేదో చెపుతున్నాడు. అతనిమాట లతి శ్రద్ధతోవింటూ, సముద్రంమీదికి చూస్తూ నిలబడ్డారు మిగిలినవాళ్ళందరూ. బిషపుకూడ వాళ్ళవద్దకుపోయి నిలిచి, తానూ సముద్రంవంకచూడటం మొదలుపెట్టినాడు. చూచాడేకాని సూర్యరశ్మిలో సముద్రంయొక్క తళతళతప్ప మరేమీ కనిపించలేదతనికి. ఐనా జాలరి చెపుతూన్నకథ తానుకూడ విందామని మరికొంతదగ్గరకు వచ్చాడు. బిషపురావటంచూచి జాలరి తలమీదిటోపీ తీసి, చెప్పేచెప్పేమాటలు హటాత్తుగా నిలిపివేశాడు. అక్కడున్నవాళ్ళందరూ అదేవిధంగా టోపీలుపైకెత్తిపట్టుకొని తలలువంచి బిషపుకు వందనాలుచేస్తూ నిలబడ్డారు.

'అయ్యో, మీమాటలకు నే నడ్డువచ్చాను కాబోలు! ఈ బెస్తచెప్పే సమాచారంవిందామనే నేనూవచ్చాను.—చెప్పు, చెప్పవయ్యా! నామూలాన్ని మానవద్దు. ఏమి, సమాచారం?' అన్నాడు బిషపు.

కాని ఒక్కరూ మాట్లాడలేదు.

'ఎక్కడో, యెవరో సాధువులున్నారట. వాళ్ళను గూర్చి యేమేమో చెపుతున్నాడీజాలరి' అని అందరిలో కాస్త ధైర్యంగల వర్తకుడొకడు చివరకు బిషపుకు జవాబిచ్చాడు.

'ఏసాధువులు? ఎక్కడున్నారు?' అంటూ బిషపు అక్కడనున్న ఒకపెట్టెమీదకూర్చుని 'చెప్పండి, చెప్పండి! నేనూవినవలె వాళ్ళసంగతి.—ఏమిటయ్యా, అట్లా వేలుబెట్టిచూపిస్తున్నావు?' అని జాలరిని అడిగినాడు.

'ఏమిటంటారా? అదికాదూ—అదిగో! దూరంగా ఒకచిన్నదీవి కనిపిస్తున్నదా మీకు?' అని తిరిగి వేలుబెట్టిచూపిస్తూ 'చూడండదిగో—కుడివైపున—అదే దీవి! అక్కడనేవున్నారు సాధువులు. అక్కడనే భగవధ్యానంచేసుకుంటూ ముక్తిపొందటమే వాళ్ళ ఆశయం.' అన్నాడు జాలరి.

'ఎక్కడనయ్యా ఆదీవి? నాకేమీ కనిపించటమే లేదే!'

'అదిగోనండీ—అదేమిటి! చూడండి నాచెయ్యి వెంబడే! ఆచిన్నమేఘం కనబడుతున్నదా మీకు? దానికిందనే చూడండి—కొంచెం ఎడమవైపు, నల్లని గీతలాగునలేదూ? అదేదీవి.' అన్నాడు జాలరి.

బిషపు బాగా దృష్టినిలిపిచూచాడు, కాని సముద్రాలమీద జాలరికున్నంత అనుభవమూ, సూక్ష్మదృష్టి

బిమపుకు లేకపోవటంచేత, అంతులేని నీరూ, సూర్య రశ్మితప్ప మరేమీ కనిపించలేదు.

'నాకిప్పటికేమీ కనిపించటంలేదుగాని ఆ సాధువుల వృత్తాంతం మరేమైనా నీకు తెలుసునా?' అన్నాడు బిమపు.

'వారా?—మహాత్ములు. వారినిగూర్చి చాలకాలం నుంచి వింటున్నాను. వారి దర్శనమాత్రం లభించి రెండేసంవత్సరాలయింది.' అని జవాబిచ్చాడు జాలరి.

సాధువులదర్శనం తనకెట్లా దొరికిందో చెప్పటం మొదలుపెట్టినాడు జాలరి. తానొకరోజున చేపలవేటకు సముద్రంమీదికి పోయినాడు. రాత్రివేళ పెద్దతుపానొకటి బయలుదేరి, సాధువులున్న దీవిగట్టుకు కొట్టబడ్డది నావ. దీవంతా తిరిగితిరిగి, చివరకొక చిన్నగుడిసె వద్దకు చేరుకున్నాడు జాలరి. గుడిసెముందర నిలబడ్డాడొక ముసలివాడు. మరొకక్షణానికి యింకాయిద్దరు వ్యక్తుల్లు గుడిసెలోనుంచి బయటకువచ్చారు. ముగ్గురూ కలిసి జాలరిని చేరబిలిచారు. ఆదరించి భోజనంపెట్టినారు. తడిసిపోయిన జాలరిబట్టలు తామే యెండలో ఆరబెట్టి, నావ మరమ్మతులో జాలరికెంతైనా సాయపడ్డారు.

జాలరిచెప్పిన యీ సమాచారం విని 'వాళ్ళెట్లా వుంటారు?' అని తిరిగి ప్రశ్నించాడు బిమపు.

'ఒకడు పొట్టివాడు. ముసలితనంచేత నడుము వంగి వుంటుంది. మతగురువులుధరించే పొడుగుపాటి అంగరకా వేసుకుంటాడు. వయస్సు నూరేళ్ళకుపైగానే వుంటుందని చెప్పవచ్చు. ముఖంలో యెప్పుడూ చిరునవ్వే. ఒకవిధమైనతేజస్సు అతనిచుట్టూ నిండివుంటుంది. రెండవసాధువూ ముసలివాడే. కాని కొంచెంపొడగరి. చినిగిపోయిన కోటొకటి తొడుక్కుంటాడు. కొంచెం పసుపుచాయతోకలిసిన తెల్లని పెద్దగడ్డం. మనిషి బాగా బలిష్టుడు. నావమరమ్మతుకొరకు సముద్రపు ఒడ్డుకు పోయినప్పుడు, నాసహాయం అక్కరలేకుండానే తానొక్కడూ నావను, చేతితో గిన్నెబోర్లించినట్లు, అవలీలగాయెత్తి బోర్లించాడు. అతని ముఖంలో కూడ దయ, శాంతం కనిపించాయి. మూడవసాధువు వీరిద్దరికంటెనూ పొడగరి. పొడుగుగా మోకాళ్ళనంటుతూవుంటుంది గడ్డం—తెల్లగా మంచులాగున. చూపు గంభీరంగా, తీవ్రంగావుంటుంది. కనుబొమలు ముందుకు పొడుచుకుని కళ్ళను కప్పివేస్తున్నట్లుంటాయి. ఇతని శరీరంమీద దుస్తులాట్టే కనిపించవు. చిన్నచాప ముక్కవంటిదేదో మొలకు చుట్టుకుంటాడు.'

'నిన్ను పలుకరించి ఏమైనామాట్లాడినారా వాళ్లు?' అని అడిగినాడు బిమపు.

'వారు చేసుకునే అన్నిపనులూ చాలవరకు మాటలతో పనిలేకుండానే, అతినిశ్శబ్దంగా చేసుకుంటారు. ఒకరితోఒకరు సంభాషించడమే చాల అరుదు. ఒకడొక చూపుచూడటంతోనే, అతని మనోభావం మిగతయిద్దరకూ అర్థమైపోతుంది. 'చాలకాలంనుంచి మీరిక్కడనే ఉంటున్నారుకాబోలు!'నని పొడుగువాని నడిగినాను. అంతలోనే కోపంవచ్చినట్లు తనలో తాను సణుగుకొనటం ప్రారంభించాడతడు. అదిచూచి మొదటిసాధువు (ముసలివాడు) వడివడిగావచ్చి చిరునవ్వునవ్వుతూ పొడుగువానిచెయ్యి పట్టుకున్నాడు. వెంటనే గొణగటంమాని నిశ్శబ్దంగా నిలబడ్డాడతడు. 'మామీద కాస్త దయవుంచునాయనా!' అని మందహాసంతో కోపిష్టిని నెమ్మదిగా మందలించాడు ముసలివాడు.'

జాలరి యీకథ బిమపుతో చెపుతూవుండగానే ఓడ చాలదూరం సాగిపోయింది. దీవి మరికొంత స్పష్టంగా కనబడ్డది.

'అదిగోనయ్యా, చూడండిప్పుడు. బెస్తచెప్పిన దీవి అదుగో!' అని గుంపులోవున్న వర్తకుడొకడు బిమపుతో అన్నాడు.

బిమపు తేరిపారజూచాడు. ఇప్పటికి కొంతనమ్మకం చిక్కింది. కొంతసేపు అట్లాచూసి, ఓడ వెనుకవైపుకు చేరి, ఆదీవిపేరేమని చుక్కానివాణ్ణి అడిగినాడు.

'అదా? దానికిపేరులేదు. అటువంటిదీవులనేకాలున్నాయి ఈ సముద్రంలో.' అన్నాడు చుక్కానివాడు.

'అక్కడయెవరో సాధువులున్నారటే? ముక్తి

కొరకై సాధనచేస్తూవుంటారట నిజమేనా ?'

'అవునట్లాగే అంటారు. ఐతే అదెంతవరకు నిజమో నాకు తెలియదు. చూచివచ్చామనికూడ చెపుతూ వుంటారీజెస్తలు. ఏమో—అంతా పుక్కిటిపురాణమే కావచ్చు !'

'నేనొకసారి అక్కడికిపోయి వాళ్ళను చూదామనుకుంటున్నానయ్యా. నన్నా దీవిగట్టున ఒకసారి దింపటానికి వీలుంటుందా ?'

'దీవిగట్టుకుపోదు ఓడ. కొంతదూరాన్ని ఆగుతుంది. చిన్న నావలోయెక్కి గట్టుకుచేరవచ్చు. ఆసంగతి ఓడ యజమానితో మాట్లాడండిమీరు,' అన్నాడు చుక్కాని వాడు.

అప్పుడు ఓడనాయకునిరప్పించి బిషపు అతనితో యిట్లన్నాడు: 'సాధువుల నొకసారి చూడవలెననుకుంటున్నాను. నన్ను దీవిగట్టుకు చేర్చగలరా ?'

అసలక్కడకు పోనేవద్దని బిషపును నిరుత్సాహపరుస్తూ ఓడసరంగు యిట్లన్నాడు: 'అంతగా పోవలెనంటే నావమీద గట్టుకుచేరవచ్చును. కాని మాకు చాల కాలహరణమైపోతుంది. అయ్యా మీతో అనవచ్చునో కూడదో కాని, మీరుపడేకష్టానికి తగిన ఫలితముండదు. ఆదీవిలో వాళ్ళకు ప్రపంచజ్ఞానం కూడ వున్నట్లులోచదు. వాళ్ళగొడవ మీకెందుకు ? మనంచెప్పేమాటలే వాళ్ళకర్థంకావట. మాటలే రాని వాళ్ళతో మనకేమిపని ? సముద్రంలో చేపలెంతో వాళ్ళూఅంతే.'

'ఏమైనాసరే, చూడవలెననేకోరిక నాకు చాలా వున్నది. మీకష్టానికీ, కాబోయే ఆలస్యానికి తగిన ప్రతిఫలం నావద్ద పుచ్చుకోవచ్చు. నాకొరకొక నావ సిద్ధం చేయించండి,' అన్నాడు బిషపు.

చివరకు బిషపును దింపటం తప్పనిసరిఅయినది. ఓడను దీవివైపుకే నడిపించారు. కుర్చీవేసి బిషపును ఓడముందు కూర్చోబెట్టినారు. బిషపు యెంతో ఆత్రతతో దీవివంకచూస్తూ కూర్చున్నాడు. మిగత ప్రయాణికులు అతనిచుట్టూచేరి దీవివైపుకే చూస్తున్నారు. అందులో కొంత సూక్ష్మదృష్టికలవాళ్ళకు దీవిలో రాళ్ళూ గుట్టలూ కనబడుతున్నవి. సాధువులగుడిసె కూడ కనబడ్డది. 'నాకు సాధువులుకూడ కనబడుతున్నా ర'న్నాడు ఒకడు. ఓడసరంగు 'టెలిస్కోపు' (దూరదర్శినీయంత్రం) తెచ్చి, దానితో తాను ముందుగా దీవిని చూచి, తరువాత 'టెలిస్కోపు'ను బిషపు చేతికిస్తూ 'దీవి యిప్పుడుబాగా కనబడుతున్నది. గట్టున ముగ్గురు మనుష్యులుకూడ కనబడుతున్నారు. అదిగో ఆపెద్దదిబ్బ కనబడుతున్నదే—దానికికొంచెం కుడివైపున' అన్నాడు.

టెలిస్కోపు అందిపుచ్చుకొని బిషపుకూడా చూచాడు. సాధువులుముగ్గురూ కనబడ్డారు. ఒకరిచెయ్యి ఒకరుపట్టుకొని ముగ్గురూ వరుసగానిలబడ్డారు.

ఓడసరంగు బిషపుతో యిట్లన్నాడు: 'అయ్యా ఓడ యింతకంటె దగ్గరకుచేరదు. మీరు దిగటం తప్పక పోతే నావలో యెక్కిపోవలె. లంగర్లువేసి ఓడనిక్కడే నిలిపివేస్తాము.'

ఓడకు లంగరువేసి నావను కిందికి దింపినారు. తెడ్లువేసేవాళ్ళుకొందరూ, బిషపూపోయి నావలో కూర్చున్నారు. తెడ్లువేస్తూ నావను నడుపుకొనిపోయినారు. సాధువు లంతకంతకు స్పష్టంగా కనబడుతున్నారు. నావ గట్టుకు చేరింది. తెడ్లవాళ్ళు కిందికిదిగి నావను గట్టుదగ్గరకు లాగి పట్టుకున్నారు. బిషపు దిగి గట్టెక్కినాడు.

బిషపును చూడగానే సాధువు లొక్కసారిగా తలలువంచి అతనికి నమస్కరించారు. బిషపు చేయెత్తి వాళ్ళ నాశీర్వదించాడు. సాధువులుతిరిగి తలలువంచి మరొకసారి బిషపుకు నమస్కరించారు.

బిషపు వాళ్ళతో యిట్లన్నాడు: 'ఏమయ్యా, మహాత్ములు ! మీరిక్కడ నిరంతరం భగవధ్ధ్యానంలో కాలంగడుపుతూ, మీముక్తికీ తోడిమానవుల క్షేమం కొరకూ సాధన జరుపుతూవుంటారని చెప్పుకోగా విన్నాను. క్రీస్తుసేవకుణ్ణయి నేనుకూడ ఈశ్వరకటాక్షం చేత యేదో నాశక్తికొద్దీ ప్రజలకు ధర్మబోధచేస్తూ, వాళ్ళ యోగక్షేమంకొరకు పాటుపడటానికి నియోగింపబడ్డాను. పుణ్యాత్ములు మీరిక్కడ నున్నారని విని

సాకు తెలిసినంతవరకు మీకుకూడ ధర్మసందేశమిచ్చి పోదామని యిక్కడికి వచ్చాను.

బిషపు మాటలువిని ముసలివాళ్ళుముగ్గురూ చిరునవ్వుతో ముఖముఖాలు చూచుకుంటూ మౌనందాల్చి ఊరకున్నారు.

'ముక్తిసంపాదనకు ఏయేసాధన లవలంబిస్తున్నారో, దీవిలో మీ రేవిధంగా ఈశ్వరసేవచేస్తున్నారో కొంచెం చెపుతారా ?' అన్నాడు బిషపు.

ఈ మాటలువిని రెండవసాధువు నిట్టూర్పువిడుస్తూ నడుమువంగిన ముసలిసాధువువంక చూచాడు. ఆచూపు గ్రహించి ముసలిసాధువు బిషపుకు జవాబిచ్చాడు: 'భగవంతుని సేవించుటమెట్లాగో మాకేమీ తెలియదయ్యా స్వామీ ! మమ్ము మేమే పోషించుకుంటూ, మాకుమేమే సేవచేసుకుంటున్నాము—ఇంతే మాకు చేతనైనపని.'

'అయితే భగవత్ప్రార్థన యెట్లాచేస్తారుమీరు ?' అని యడిగినాడు బిషపు.

'ఇదిగోయిట్లాగు: 'మీరుముగ్గురు దేవుళ్ళు, మేము ముగ్గురము సేవకులం! మమ్ము కాపాడి రక్షించండి!'— —ఇదే మాప్రార్థన,' అన్నాడు ముసలివాడు.

వెంటనే తిరిగి ముగ్గురూకలిసి అదేప్రార్థన ఒక్కసారిగా ఉచ్చరించారు.—'మీరు ముగ్గురు, మేము ముగ్గురము. మమ్ము కాపాడి రక్షించండి !'

బిషపు కొంచెంపరిహాసపు నవ్వునవ్వుతూ యిట్లన్నాడు: 'పరిశుద్ధులైన త్రిమూర్తులనుగూర్చి మీ రెక్కడనో కొంతవినివున్నారని మీ మాటలనుబట్టి తెలుస్తున్నది. కాని మీప్రార్థన సరిగాలేదు. భగవంతుని సేవించాలనే కోరికమాత్రం కొంతవున్నదిమీలో. అంతవరకు మెచ్చుకోదగినదే. కాని ఆయనను సేవించే ఉత్తమపద్ధతి మీకింకా తెలియలేదు. ఇదిగాదు ప్రార్థనచేయవలసిన విధానం. నేనుచెపుతాను వినండి.

నేనిప్పుడు చెప్పేది నా స్వంతకల్పనగా భావిస్తారేమో మీరు. కాదు, కాదు. మానవులందరూ ప్రార్థన యెట్లాచేయవలెనో భగవంతుడే విధించివుంచాడు. ఆ ధర్మశాస్త్రప్రమాణమే నేనిప్పుడు మీకు చెప్పబోయేది.'

భగవంతుడు మానవునికి తన్నుతానెట్లా తెలుపుకున్నాడో బోధించటం ప్రారంభించాడు బిషపు. తండ్రియైన భగవంతుడు, కుమారుడైన భగవంతుడు, పరిశుద్ధాత్మయైన భగవంతుడు—ఇట్లా మూడువిధాల దేవుడు ఈప్రపంచానికి తెలియబడుతున్నాడన్నాడు.

'దేవుడు మనుష్యులకు ముక్తినియ్యడానికే తానీ ప్రపంచంలో క్రీస్తురూపంగా కుమారుడై అవతరించాడు. ఆయనే చెప్పినాడు మనమెట్లా ప్రార్థనచేయవలెనో. ఇదిగో, యిదేమాదిరి వినండి. వింటూ నాతరువాత మీరుకూడ అనండి,—'ఓ మాతండ్రీ !''

బిషపు అనినవెంటనే మొదటిసాధువు 'ఓ మాతండ్రీ !' అన్నాడు. రెండవసాధువు 'ఓ మాతండ్రీ !' అన్నాడు. మూడవవాడూ అట్లాగే అన్నాడు.


'నీవు స్వర్గాధిపతివి' అని తరువాత మాటఉచ్చరించాడు బిషపు.

మొదటిసాధువు 'నీవు స్వర్గాధిపతివి !' అన్నాడు. రెండవసాధువు మాటనోటబట్టలేక తడబడ్డాడు. మూడవవాడుకూడ సరిగా అనలేకపోయినాడు. గడ్డం మీసాలూ పెరిగి నోటికడ్డుపడటంచేత అతడన్నమాటే వినబడలేదు. నడుమువంగిన ముసలివాడుకూడ, పండ్లన్నీ ఊడిపోవటంచేత, మాటసరిగా అనలేకపోయినాడు.


బిషపు ఆమాటనే తిరిగి మరొకసారి ఉచ్చరించాడు. అదేప్రకారం సాధువులుకూడ అనటానికి ప్రయత్నించారు. గుడిసెముందున్న రాతిబండమీద కూర్చున్నాడు బిషపు. సాధువు లతనికెదురుగా వరుసగా నిలబడ్డారు. ప్రార్థనచెప్పేటప్పుడు బిషపుయొక్క నాలుక, పెదవులు యెట్లా తిరుగుతున్నవో శ్రద్ధగాచూచి గుర్తుపట్టుతూ, అతడన్నట్లే తామూ అనడానికి ప్రయత్నించారు. బిషపు ఒక్కొక్కమాట ఇరవై, ముప్పై, నూరు సార్లుకూడ ఉచ్చరిస్తూ, సాధువులచేత పదేపదే అనిపిస్తూ దినమంతా కష్టపడ్డాడు. సాధువులు తడబడ్డపుడల్లా తప్పులుదిద్దుతూ, తిరిగితిరిగి అనిపించేవాడు.

సాధువులముగ్గురికీ తనప్రార్థన నోటబట్టేవరకూ, తమంతటతాము దాన్ని స్పష్టంగా చెప్పగలిగేవరకూ వాళ్ళను విడిచిపెట్టలేదతడు. ముగ్గురిలోనూ రెండవ

“ఆంధ్రభూమి”



"ఆంధ్రభూమి"



నిలుచున్నవారు ఎడమనుంచి కుడికి

1. విశ్వనాథ వెంకటేశ్వర్లుగారు.
2. సి. పేరాజుగారు, బి.ఏ.
3. విశ్వనాథ సత్యనారాయణగారు, ఎం.ఏ.
4. కొడాలి సుబ్బారావుగారు, బి.ఏ.

కూర్చున్నవారు ఎడమనుంచి కుడికి

1. మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మగారు.
2. చింతా దీక్షితులుగారు, బి.ఏ., ఎల్.టి.
3. గురుభాగవతుల సుబ్బారావుగారు, బి.ఏ.

సాధువుకే ముందుగా ప్రార్థన కంఠస్థమైనది. అది కని పెట్టి అతనిచేతనే యింకా పదేపదే చెప్పించాడు బిషపు. క్రమంగా మిగత యిద్దరికీకూడ ప్రార్థన కంఠతా వచ్చింది.

అప్పటికి ప్రాగ్దిశుంకి చంద్రోదయమాతున్నది. ఓడవద్దకు పోదామని బిషపులేచి నిలబడి, సాధువులవద్ద సెలవుపుచ్చుకున్నాడు. సాధువులు బిషపుకెదురుగా సాష్టాంగపడి నమస్కరించారు. బిషపు ఒకొక్కక్కనినే చేయిపట్టుకొని లేవదీసి, కౌగలించుకొని, తాను నేర్పిన ప్రార్థననే ప్రతిదినమూ చేస్తూవుండమని వాళ్ళతో చెప్పినాడు. తరువాత నావలోకూర్చుని తిరిగి ఓడవద్దకు ప్రయాణమైనాడు.

బిషపు బయలుదేరగానే సాధువులు తాము నేర్చుకున్న ప్రార్థన బిగ్గరగా వల్లెవేస్తూ సముద్రపుఒడ్డున నిలబడ్డారు. కొంతదూరంవరకూ సాధువుల కంఠధ్వని బిషపుకు వినిపిస్తూనేవున్నది. పోగాపోగా ధ్వని అంతరించిపోయినా, సాధువుల స్వరూపాలుమాత్రం వెన్నెట్లో స్పష్టంగా కనబడుతున్నాయి. ముసలివాడు మధ్యను, అతనికిరుప్రక్కలా మిగిలినయిద్దరూ నిలబడ్డారు. కొంతసేపటికి బిషపువచ్చి ఓడ నెక్కినాడు. లంగరులుతీసి, తెరచాపలెత్తి ప్రయాణంసాగించారు. గాలి విసురుమీద ఓడ వడివడిగానడిచిపోతున్నది. బిషపు ఓడ వెనుకవైపు చోటుచూచుకొని, సాధువుల దీవిమీదనే దృష్టినిలిపి చూస్తూకూర్చున్నాడు. ఓడ సాగి వెళ్ళగా వెళ్ళగా సాధువులు అదృశ్యులైనారు. మరికొంతసేపటికి దీవికూడ కనిపించలేదు. వెన్నెట్లో ధగధగ మెరుస్తూ నీరుమాత్రం యెటుచూచినా అనంతంగా వ్యాపించివున్నది.

ప్రయాణికులందరూ నిద్రపోతున్నారు. అంతా నిశ్శబ్దమయింది. బిషపుమాత్రం నిద్రపట్టలేదు. చుక్కానిప్రక్కనే కూర్చున్నాడొక్కడూ. దీవి కనిపించకపోయినా, ఆ దిశకేచూస్తూ సాధువులసంగతే మననంచేస్తూ కూర్చున్నాడు. తాను ప్రార్థననేర్పినప్పుడు వాళ్ళుచూపిన సంతోషమూ ఆసక్తీ తలచుకుంటూ, వాళ్ళకు ధర్మబోధచేయుటకు తన్నక్కడకు పంపిన దైవాన్ని అభినందిస్తూ కూర్చున్నాడు.

ఇట్లా దీర్ఘాలోచనలో మునిగివున్నాడు బిషపు. ఒకసారిక్కడ ఒకసారక్కడ తళతళమెరుగుతూ అలలతోనిండివున్నది సముద్రం. ఆ తరంగాలకాంతిమధ్యనే కండ్లు చెదిరిపోయేటట్లు ప్రకాశిస్తూ తెల్లనివస్తువొకటి బిషపుకు కనిపించింది. ఏదో నీటిపక్షేమో ననుకున్నాడు మొదట. తెరచాపయెత్తుకొని వస్తూన్న పడవేమోననుకున్నాడు తరువాత. రెప్పవాల్చక ఆశ్చర్యంతో తెల్లబోయి దానివంకనేచూడటం మొదలుపెట్టినాడు.

'ఏదోపడవే అయియుండవచ్చు' ననుకుంటూ 'అయితే వడివడిగా మీదిమీదికి వస్తున్నట్లున్నదే! ఒక్కక్షణంక్రిందట యెంతోదూరాన్ని వున్నట్లుండి, ఇంతట్లో యింతదగ్గర కెట్లావచ్చిందో! కాదుకాదు— ఇది పడవేకాదు. తెరచాపే కనిపించదేయిప్పుడు! మమ్ము పట్టుకోవాలన్నట్లుగా వెంటతరుముకొని వస్తున్నది! ఏమోకదా యీ వింతవస్తువు!!' అనుకొంటూ కలవరపడ్డాడు బిషపు.

అతని కేమీతోచలేదు. 'పడవకాదు—పక్షీకాదు— చేపకూడాకాదు—మనుష్యుడా కాడు. మనిషికంటె చాలపెద్దదిగా కనబడుతున్నది. మనుష్యునికిమాత్రం ఈ నడిసముద్రంలో యేమిపని వుంటుం దిప్పుడు? ఇట్లా తనలోతాను వితర్కించుకుంటూ కూర్చున్నాడు బిషపు. ఈస్థితిలో కొంతసేపటికి తాను దీవిలో చూచివచ్చిన సాధువులే గుంపుగూడి నీటిమీద ఓడవెనుకనే అతివేగంతో పరుగెత్తుకొనివస్తున్నట్లు కనబడ్డారు. బిషపు చూచాడది. ఎటూతోచిందికాదు. కంగారుగా లేచి నిలబడి చుక్కానివానిభుజం తట్టి యిట్లన్నాడు:

'చూడవోయి, చూడవోయి! అదేమిటి?'

చుక్కానిమనిషి తలయెత్తి చూచాడు. చూచీ చూడగానే భయంపుట్టి చేతిలో చుక్కాని విడిచిపెట్టి బిగ్గరగా అరవటం మొదలుపెట్టినాడు 'అయ్యయ్యో, మనవెంట పరుగెత్తుకొనివస్తున్నారు వీళ్ళెందుకో! భూమిమీదలాగున నీటిమీదనే పరుగెత్తుతున్నారేమి దేవుడా!'

ముసలివాని వెర్రికేక విని ప్రయాణీకులందరూ గడబిడగా లేచి గుమిగూడినారు. సాధువులు ముగ్గురూ చేరి చేయీచేయీ పట్టుకొని పొడుగుపాటి తెల్లని గడ్డాలతో పడవలాగున నీటిమీద తేలివస్తున్నారు. కాళ్ళు కదల్పకుండ వాయువేగాన్ని మించి వస్తున్నారు. ముసలివాని కిరువైపులా నిలబడ్డ సాధువులిద్దరూ ఒకసారి ఓడ ఆపండని కేకలుపెడుతున్నారు. ఓడ నిలపటానికి ప్రయత్నమింకా జరుగుతుండగానే సాధువులు వచ్చి ఓడను కలుసుకున్నారు. ముగ్గురూ ఓడప్రక్కను చేరి వరుసనే నిలబడి బిషపునుపిలిచి యిట్లన్నారు:

'మీరుచెప్పిన ప్రార్థన మరచిపోయినామయ్యా స్వామీ! అదేపనిగా నోరు ఆడుతూవున్నంతసేపూ సరిగా నేవచ్చింది మీ ప్రార్థన. మధ్య కొంచెంసేపు ఊరుకునేసరికి యెక్కడనో ఒక్కమాట తప్పిపోయింది. దానితో సమస్తం చెడిపోయింది. చివరకన్నిమాటలూ తబ్బిబ్బైనాయి. ఇప్పుడొక్కమాటైనా జ్ఞప్తికి రావటంలేదు. మరొకసారి చెప్పుదురూ ప్రార్థన!'

సాధువులశక్తిని, అద్భుతమైనవాళ్ళ భక్తిని చూచి బిషపు నివ్వెరపోయి ధ్యాననిమగ్నుడై ఆత్మపరీక్షలో బడ్డాడు. ఆ పరీక్షలో తన అల్పత్వమే తనకు గోచరించింది. ఓడప్రక్క నీటిమీదనిలబడ్డ సాధువులవైపువంగి లజ్జతో యిట్లన్నాడు:

'అయ్యా నిజమైన సాధువులు, భక్తులు మీరే! మీ ప్రార్థనే ప్రార్థన. అదే అవిచ్ఛిన్నంగా భగవంతుని చేరుతుంది. నేనా మీకు ప్రార్థనతత్వాన్ని బోధించ గలిగినవాణ్ణి? నాబోటి పాపాత్ములకొరకుకూడ మీరే ప్రార్థనచేయవలె! మీ ప్రార్థనలే మాకందరకూ ముక్తి నియ్యగలవు!'

ఇట్లంటూ వినయవిధేయతలతో బిషపు సాధువుల కెదురుగా సాష్టాంగపడ్డాడు.

సాధువులెట్లావచ్చారో అట్లాగే తిరిగి వెళ్ళిపోయినారు. వాళ్ళు వచ్చిపోయినమార్గమంతా మరునాడు తెల్లవారేవరకూ దేదీప్యమానంగా వెలుగుతూనే వున్నది.

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, ఎం.ఏ.

# స్త్రీ మూర్తి

స్త్రీమూర్తి నిత్యానందశ్రీల విరాజిల్లు కల్యాణ స్వరూపిణి. సర్వమంగళ ప్రదాయిని

సాధ్వీహృదయము కరుణారసప్రపూరితము. విశ్వజనీన ప్రేమ విభాసితము.

ఉన్నత సతీమణి భావము లతులితమాధురీమహితములు. కుసుమ కోమలములు. సుధారసార్ద్రములు.

ఉత్తమయువతి చెయ్వులు అత్యంత ప్రమదావహములు. పవిత్రస్నిగ్ధ ప్రణయ పరిణామహేతుభూతములు. సౌశీల్యప్రేరేపకములు. జనాదరణీయములు.

కల్యాణిపలుకులు 'శిరీష కుసుమ పేశల సుధామయోక్తులు. మృదుభావ ప్రకర్షకములు. నిష్కళంక ప్రేమైకసూత్రములు. వీనుల విందుసేయుచు, ఆనంద సాగరతరంగడోలికల నోలలాడింపదగు అపురూప సంగీత మార్దవోపేతములై, హృదయాకర్షక ఉత్కృష్ట భావోన్మీలనము కలిగి జుంటితేనియ లొల్కుచు వఱలు నట్టి లోకోత్తర మహామంత్రరాజములు.

మనోజ్ఞ హావభావ విజృంభణమునకును, శాంతియుత నిర్మల ప్రవర్తనకును, చతుర్విధ పురుషార్థ సమార్జనమునకును అంగనామణి చేయూతలేనిదే పురుషునకు దుర్భేద్యము.

వైదుష్య ప్రభావయగు జనయిత్రి నిజవర్తనమందలి లోపాలోపములను గుర్తించి, బాగోగుల విచారించి, ఉన్నతాశయ సంపన్నయై లోకకల్యాణ కాంక్షతో ఋజుమార్గముపట్టి, మనోరథసిద్ధి నొందగలదు.

ప్రజల కష్టములను తనవేయని భావించి వారి అభివృద్ధికై, ఎట్టి ఇక్కట్టుల బడినను సరకుగొనక వ్యయప్రయాసముల కోర్చి, నిష్కళంక వాత్సల్యముతో సాయముచేసి భవ్యజీవియగును.

అట్టి మహిళామణికి స్వార్థముతో నిమిత్తములేదు. ఇహలోక భోగములు బాహ్యేంద్రియ ప్రవృత్తులు ఆమె నణుమాత్రము ఆకర్షింపజాలవు.

ఆమెకు శీలమే ప్రధానము. ప్రశాంత ప్రభావ మంగరక్ష. ధర్మమార్గానుసరణ మవశ్య కర్తవ్యము నిర్మల ప్రవర్తనమే సర్వస్వము.

సుగుణరాశియగు లలనామణిని కన్నదేశమే దివ్యక్షేత్రము—పసిండినేల—ధన్యభూమి.

—శ్రీపాద వెంకటావధాని.

# వెలి

నల్లటి !—చిక్కటి !!—మేఘం ఆకాశాన్నంతటినీ ఆవరించేసుకునుంది. తెరమీద తెర, తెరమీద తెర యింకా అలావచ్చేస్తున్నాయి మేఘాలు. కళ్లు చీకట్లుకమ్మేటట్లు పద్రంగా మెఱుస్తున్నాయి మెఱుపులు. శ్మశానభూమిలోపడి నరు డేడుస్తూన్నట్లు 'దీ!' మంటూ వీస్తూందా రొంజగాలి ;—ఏడుస్తూ మధ్యమధ్య వెక్కుతూన్నట్లురుస్తున్నాయూ ఉరుములు ; - వెక్కుతూ మధ్యమధ్య దగ్గుతూన్నట్లు పడుతున్నాయూ పిడుగులు. గాలివల్ల ధూళంతా రేగిపోయింది. చినచిన్న చినుకులు కూడా పడుతున్నాయక్కడక్కడ.

బుడ్డిదీపం పట్టుకుని రెండుమూడుసార్లొచ్చిందా స్త్రీ, కుటీరం వెలుపలకు ; భయం వేసిందిగబోసు వెంటనే లోపలికెళ్ళిపోయింది. ఆకుటీరానికి దూరాన్ని—చాలా దూరాన్ని (అరమైలుదూరంలో)——మరో కుటీరం ప్రక్కనే మిణుకుమిణుకుమంటూ మండుతూవుంది కొంత చితాగ్ని. వింటే ఉపద్రవైన భయం వేసేటట్టదో మోస్తరు ఏడుపుస్వరంతో మండుతూందా అగ్ని.

ఆ స్త్రీ అలా పైకి వస్తూంది, లోపలికొస్తూంది. లోపలనుంచి అదో మోస్తరు హీనస్వరంతో—అదో మోస్తరు గద్గదస్వరంతో పిలుపువినబడ్డది. ఆమె వెంటనే లోపలికి వెళ్లిపోయింది. లోపల్ని వో కుక్కిమంచంమీదను చేతులానుకుని కూర్చునివున్నాడో పురుషుడు క్రిందను. 'పాలుకావాలంటున్నాడు' అని చెప్పేడతడామెతో. కళ్ళమ్మట రెండు నీళ్లు జారవిడుస్తూ 'పోనీ ఆగ్లాసులో వున్న నీళ్లు పట్టండి దాహమేఁనా తీరుతుంది' అని అన్నాదావిడ. అతడు మంచినీళ్లు నోట్లోపోసేడు ; కాని త్రాగలేదు. బలవంతాన్ని పోసేడు ; కాని కక్కేసేడు. 'ఇలావచ్చివళ్లుచూడు. ఎంత వేడిగావుందో!' అని అన్నాడతడామెతో పిల్లడివొంటిమీద చేయివేస్తూ. 'అబ్బా! చాల వేడిగానే వుంది విసురుతానుండం డొకమారు. చెమటలు పోస్తూన్నట్లున్నాది.' అని ఆవిడ విసనకర్రతీసుకుని విసురుతూవుండి, పిల్లాడికి ఊపిరి సలుపదేమోనని మళ్లీ మానేసింది.

'నాన్నా! - నాన్నా! - పలకవేమిఁనాన్నా? నామీద నీకు కోపమాఁ? నేనేంజేసేనమ్మా, నిన్ను? అంత కోపమాఁనామీద! పోనీలే ; ఒక్కసారి పలకవూ? నామీద దయలేదూ?....' అని పిల్లాడిమీద ముఖం పెట్టి, కళ్లమ్మట నీళ్లు తెచ్చుకుంటూ పలకరించిందామె. పిల్లాడేమీ ఉలకలేదు, పలకలేదు. 'ఎందుకలా చెదరగొట్టేస్తావు పిల్లాడ్ని' అని ఆతడు కోంపడ్డాడు.

భయ వుట్టిపడేటట్లా అతిగంభీరంగా అరుస్తూంది గుడ్లగూబ కుటీరానికెదురుగా వున్న చెట్టుమీదనే కూర్చుని. ఒకసారి పైకి వచ్చి, మళ్లీ లోపలికెళ్లిపోయిందా స్త్రీ. వెళ్లి పిల్లడి మంచంమీదనే కూర్చుంది. అతడు కూడా ఓమారు పైకివెళ్లేడు ; కాని, భయం వేయడంవల్ల తిరిగి వచ్చేసేడింట్లోకి 'పులుగు కూడా అరుస్తూంది! చూడు, అదుగో అరుపు!' అని అన్నాడతడామెతో. 'భయ వేస్తూవుంటే మీరొక్కరూ వెళ్లకండి! నేనుకూడా వస్తా'నని అన్నాదామె. పిల్లడి దగ్గర నువ్వుండు. నేనెలాగో వెళ్లివస్తా,'

అన్నా డతడు....

'పిల్లడు బెదురుతున్నాడండి! ఒకమారిలావచ్చి పట్టుకుందురూ. పిచ్చిపిచ్చి కేక లేస్తున్నాడు.' అని అన్నాదామె. గద్గద స్వరంతో పిల్లాడిని పట్టుకుంటూ 'నాకు కూడా భయం వేస్తూంది. మరి నేనిక్కడుండ లేను. మరోమారు వెళ్లి, బ్రతిమాలి పిలుస్తా.' అని అతడామెతో చెప్పి పైకివచ్చేసేడు. దిక్కులు చూసుకుంటూ తడబడే అడుగులతో మెల్లగా వెళ్లేడతడా కుటీరాలదగ్గరకు. అతనివెనకాలె వచ్చింది గుడ్లగూబకూడా ఎంతో భయంకరంగా - ఎంతో గంభీరంగా అరుస్తు. గద్గదస్వరయుతో 'తలుపుతీయరూ? తలుపుతీయరూ! భయవేస్తూంది తలుపు తీయరూ? - ఇంకెప్పుడూ పంచమజాతివాళ్లతోకూడి.... ఇంకెప్పుడూ అలాంటి కులవిద్ధమైనపనిని చేయను. తలుపుతీయరూ? ఒక్కమారు రారూ మాయింటికి. భయమేస్తుందండి! తలుపుతీయరూ?' అని అంటూ తట్టేడో కుటీరపు తలుపుని. ఒకపావుగంటలా కొట్టేసరికి పైకివచ్చేరు ఆకుటీరాలలోనున్న వాళ్లంతా. 'పో! పోవేం? పో! వెళ్లు! నిన్ను వెలేసేము, ఇక్కడికిరాకు. మమ్మల్ని నిద్రపోనీకుండ ఎందుకుపిలుస్తావు? పో!' అని నలుగురూ కలిసి కర్రలుచ్చుకుని అతని నడుంమీద వేసి వాళ్లకుటీరాల్లోకి వెళ్లిపోయారు. 'బాబోయ్! ప్రాణంపోయిందే! రక్షించు బాబోయ్! దేవుఁడా! ....అమ్మా!' అంటూ పడిపోయాడతడా ప్రక్క నున్న పొదల్లో.

కొంతసేపటికి ఓపిలు చేసుకుని మోకాళ్ళ మీద చేతులానుకుని కాని పాపం లేవలేక పోయాడు — కూలబడి పోయాడు క్రిందను! మళ్ళీ లేచాడు మెల్లగా నడుంమీద చేతులానుకుని మెల్లగా నడవడం మొదలెట్టాడు. భయంమరింత వేస్తూంది. మెల్లిగా ఎలాగో జేరుకున్నాడింటికి. కుటీరపుతలుపు పట్టుకుని పిలచేడు హీనస్వరంతో ఆమెను. కంగారుతో వచ్చిందామె పైకి 'ఏం! ఏమైంది!' అని అంటూ. 'పిలిచేను - పైకి....అంతా వచ్చి, నన్ను ... నన్ను ... నడుంమీద .... అబ్బ! నొప్పి!....కర్రతో ... కొట్టి ... పోయారింట్లోకి! అమ్మో! నొప్పే! పిల్లడేడీ?' అని అన్నాడు 'ఆఁ! ఆఁ! ఎంతపని! కొట్టేరు! అయ్యో!... కళ్ళుమూస్తున్నారేమండీ! ఆఁ! ఆఁ! పిల్లాడండీ! పిల్ల...డు! పి...ల్ల...డు....' అంటూ క్రిందను పడిపోయి కళ్ళుమూసిందామె. అంతానిశ్శబ్దం!....

'దాహం! దాహ వేఁ, అమ్మా! దాహం పీకెండిపోతూం దే. మంచినీళ్ళివ్వవే, అమ్మా! మంచినీళ్ళే!' అని పిలుస్తున్నాడు పిల్లడు. ఇంకా అలాపిలుస్తూనేవున్నాడు; కాని ఎవళ్ళూ పలకరు.

—చిట్టి సుందరరావు.

## జనని

చిఱుతప్రాయంబునం దెదఁజేర్చియుండి
యమృత సమమైనయట్టి స్తన్యంబునిచ్చి
కంటికిని రెప్పపోలికఁ గాచుజనని
సౌఖ్యమెఱుఁగని జన్మంబు జన్మమగునె?
సాత్త్వికాహారనియమంబు నలిపికొనుచు
మాతృపర్యంకపీఠ సన్మాన్యుఁడగుచు
విమలసంతోషసామ్రాజ్య విభుఁడనంగఁ
జెలఁగి బాల్యసుఖంబును జెందనట్టి
జనుని జన్మాన నేముండు సార్థకంబు!

—ముక్కవిల్లి వెంకటనారాయణ బి. ఏ.

# కీలుబొమ్మ

రైలుప్రయాణం చేసేటప్పుడు మొత్తంమీద రకరకాల మనుష్యులు తటస్థపడుతూంటారు...

అతనంతట అతనే నన్ను పలకరించాడు, నాకు నేనై కొత్తవాళ్ళను పనిలేకుండా సామాన్యంగా పలకరించను. ఎందాకానన్నాడు, చెప్పాను. ఎక్కడెక్కించన్నాడు, అదీచెప్పాను. ఏవేవో సంగతులు తెచ్చాడు. అతనిఉత్సాహం స్నేహభావం నాకూ అంటుకున్నై. మనిషి చాలా అందంగా నాజూగ్గా ఉంటాడు. అతని మొహంలో ఆనందం ఆరోగ్యం తొండవిస్తున్నై. అతని జన్మలో చింతకాని ఆగ్రహంకాని ఉన్నట్టులేదు. అతని మొహాన నవ్వటాని కలవాటుపడ్డ లక్షణాలున్నై, కాని కోప్పడటానిక్కాని దుఃఖించటానిక్కాని ఆ మొహం అలవాటుపడ్డట్టులేదు. డబ్బు పుష్కలంగా ఉండి విరివిగా ఖర్చుపెట్టే మనిషల్లే కనపడ్డాడు. అతిశయంకాని బెట్టుసారికాని ఉన్నట్టు లేదు మనిషిదగ్గిర. ఎక్కువ తెలివిగలవాడల్లే కనిపించలేదు కాని మందమతి కాదు.

మాసంభాషణ ఎట్లావెళ్లిందో 'విధి' మీదికివెళ్ళింది.

'మనుషునకు విధి ఉన్నట్టే దేశాలకూడా విధి ఉంటుంది కామాలు?' అన్నాడతను.

నేను నవ్వి 'మనుష్యులకు విధి ఉంటుందని రుజువెక్కడయింది?' అన్నాను.

అత నాశ్చర్యంతో 'ఎందుక్కాలేదు?' అన్నాడు. అతని మొహాన ఆశ్చర్యం చూసినప్పుడు ఒక కొత్త విషయం కనిపెట్టాను. ఆశ్చర్యంలోకూడా నవ్వటానికి వీలున్నప్పుడు నవ్వులో ఎందుకు నవ్వకూడదు? అందుచేతనే అతని నవ్వులో వెన్నెల్లు కాయటం! బహుశా అందుకనే కొందరినవ్వు చవితివెన్నెలల్లే ఉంటుంది!

సరే నేను ఎక్కడయిందన్నాను. అతను నవ్వుతూ 'నేను రుజువుచేశాను,' అన్నాడు.

'ఉండం డుండండి! మీ ఉద్దేశంలో విధి అంటే ఏమని? ఎందుచేతంటే కర్మఫలితాన్ని నేను విధి అని అంగీకరించను. పంచదార తీపిగాఉండటాని కేవిధీ సహాయ్యం చెయ్యక్కర్లేదు. అదే విధి అయితే దేశాలకూడా విధి ఉంది—కొద్దిమంది వ్యక్తులు చేసిన కర్మయొక్క ఫలితం దేశమంతా అనుభవిస్తుంది. అప్పుడు దేశాలకూడా విధి ఉంటుంది మరి.'

అతను మెల్లిగా తల అడ్డంగా తిప్పాడు.

'అదికాదు నేను చెప్పే విధి. విధంటే మనం మనోవాక్కాయాలా చేసే కర్మకు సంబంధంలేకుండా మన భవిష్యత్తును నిర్ణయించేది. అటువంటి విధంటూ ఉందని మీరు నమ్ముతారా?'

'ఎన్నటికీ నమ్మను! ఖచ్చితంగా చెప్పగలను. తన యిష్టానుసారం మనల్ని నడిపించే విధి ఉందని ఎవరైనా నిరూపిస్తే నేను జీవితంలోనూ, న్యాయంలోనూ, ధర్మంలోనూ అర్థంలేదని ఒక్కక్షణంలో నిరూపిస్తాను,' అన్నాను.

'మీరుచెప్పింది నిజం. వాటిల్లో అర్థంలేదనే తీర్మానానికి నేనూ అదివరకే వచ్చాను. వాటిని నేనిప్పుడు పాటించటంలేదు! అన్నాడతను.

నేను నిర్ఘాంతపోయినాను. అతను అబద్ధం ఆడుతున్నాడో. లేక న్యాయం, నీతీ, ధర్మం మొదలైనవి పాటించనివాడి మొహాన 'లుచ్ఛా' అని రాసిఉంటుందని నేనింతకాలం అనుకోటం పొరపాటా? ఇటువంటి వాటికి సంఘంలో ఎక్కువప్రాముఖ్యత ఇస్తున్నామా? అట్లా అనవసరమైన ప్రాముఖ్యత ఇస్తున్నామని రుజువైతే ఇప్పుడు చేస్తున్నట్టుగా ప్రతివాడూ మిగిలినవాళ్ళలో పాతేరుతూ కాలయాపన చెయ్యకుండా చాలాసుఖంగా జీవించవచ్చునేమో?

'ఏమి టాలోచిస్తున్నారు!' అన్నాడతను.

అంటే, మరేమీ లేదు. మీరు ఒకమాటకు ఒకమాట ఉపయోగిస్తున్నారేమోనని నా అనుమానం!...ముందు వినంటూ ఉందని రుజువుచెయ్యండి చూద్దాం! తరవాత నా ఆలోచన చెబుతాను!'

అతను బిగ్గరగా నవ్వి 'విధంటూ లేదని మీ కెట్లా తోచిందండీ! ప్రతిరయితూ సాలుకుకొన్ని లక్షల వరిమొక్కల తదితరజీవాలను తన ఇచ్ఛానుసారం పెంచి చంపుతున్నాడు. మనం మన పెంపుడు జంతువులను మన యిష్టానుసారం పెంచటమే కాక మనయిష్టం వచ్చిన కొత్తజాతులు పుట్టిస్తున్నాం. సృష్టికి మనిషే నాయకుడా? మనిషిమీద ఇంకా ఎన్నిరకాల జీవరాసులున్నయ్యో!' అన్నాడు.

'ఉంటే కనిపించవేం?'

'మనం చెట్లకేం కనిపిస్తాం?'

'అదా మీవాదన?...అసలు చెట్లకు ప్రాణంఉందని అంతో ఒప్పుకోలేదు?' అని ఒకచొప్పదంటు వాదన అడ్డం పెట్టాను.

'మనకు ప్రాణం ఉందని ఎవరు రుజువుచేశారు. ఎవడో కథలో రాక్షసుడిప్రాణం ఎక్కడో దాచి పెట్టిన ఈగల్లో ఉన్నట్టు మనప్రాణం గుండెకాయ మొదలైనవాటిలో ఉండవచ్చును. అవి వేరేప్రాణులు కావని ఎవరునిరూపించారు? అటువంటి తెలీనివిషయాలు మనకొద్దు. చెట్లు కర్మచేస్తున్నై. వాటికి మంచిచెడ్డలున్నై. చెట్టు తనమేలుకోసరం ఆకులను చీల్చుకుంటుంది రాల్చుకుంటుంది. అది కర్మకాదా? దాని ఆహారం అది వెతుక్కుంటుంది. మనం అంతకన్న చేస్తున్నదేమిటి? మనకన్న తక్కువతరగతి ప్రాణులను చూసి మనమే ఉన్నతంగా ఉన్నామని అహంకరించటం ఎందుకు? మనకన్న పెద్దతరగతి జీవాలు కొన్ని పరిపాలిస్తున్నట్టు నేను గట్టిగా నమ్మాను. వాటికి మనం లొంగిఉండక చేసేదేమీ కనిపించలేను.'

'మనకన్న ఎక్కువవాళ్ళు మనల్ని కీలుబొమ్మలాడించినట్టు ఆడిస్తున్నారని మీకెట్లా నమ్మకం కలిగింది?'

'వినండి. నేను చిన్నతనంలో రెండుసార్లు చచ్చి బతికాను. మాటవరస కనటంకాదు. నిజంగా చచ్చిబతికాను! మానాన్న గొప్పడాక్టరు. రెండుసార్లుకూడా ఆయనా ఆయనస్నేహితులైన పెద్దడాక్టర్లూ ప్రాణం పోయిందని సర్టిఫైచేశారు. రెండుసార్లుకూడా ఒక ఔషధసహాయంగాని ఒక చికిత్సగాని లేకుండానే బతికాను. నన్నెవరు బతికించారు?

'నా జీవితంలో ఇటువంటివి శతసహస్రాలు. నా వివాహంగురించి చూడండి. నా పెళ్ళి నిశ్చయమైన కొద్దికాలానికే యీ సంబంధం నాయజమానికి—నన్ను ఆడిస్తున్న దేవతకు—ఇష్టంలేదని నాకు తట్టింది. ఎవరితోనూ చెప్పలేదు. ఆ వివాహం అయిదురోజులూ నాకు ఇదీ అదీ అని తెలీనిరోగం! నాభార్య కాపరానికి వచ్చినతరవాత మా ఇద్దరిమధ్యా ఎవరో అడ్డం వస్తూనే ఉండేవాళ్ళు పానకంలో పుడకల్లే. ఏమీ జరక్కుండానే నా ఉత్సాహంయావత్తూ ఎక్కడికో పీల్చుకుని పొయ్యేది. అటువంటిది కేవలం సైకలాజికల్ అని అనగలరు. నేనప్పటికి విధిలో నమ్మకం కలవాణ్ణి కాను. ఈ కనిపించని భూతం నాకూ నాభార్యకూ మధ్య పెట్టనిగోడ అయిపోయింది. నాభార్య చాలా మంచిది. మొదట్లో నాకు దాన్నిచూస్తే ఎంతో ప్రేమ. నా భార్యఎదురుగా లేనంతసేపూ దాన్నిగురించే ఆలోచించేవాణ్ణి ఎదురుగారాగానే నా కళ్ళలో కారం కొట్టినట్టయ్యేది. లోపలనించి విపరీతమైన అసహ్యం పుట్టేది.

'చాలాకాలం ఈ దయ్యాన్ని తోలెయ్యాలని ప్రయత్నంచేశాను. అప్పటికింకా ఈదయ్యం నాలోనే ఉందని నాభ్రమ. నాకు బాహ్యంగా ఉందని తెలీదు...చివరకు నా భార్యను వదిలేశాను!

'ఆరోజుల్లో నా స్థితి చాలా భయంకరంగా ఉంటూ వచ్చింది. మానాన్న ఏమీ మిగిల్చిపోలేదు. ఇన్స్యూరెన్సు ప్రీమియములు కట్టటంమానేసి దానధర్మాలు చేశాడు! నా విద్యాభ్యాసం మధ్యలో తెగిపోయింది.

'నాభార్యను పుట్టింటికి పంపించేసిన మర్నాడు నేనెన్నడూ ఎరగని పెద్దమనిషి మానాన్న స్నేహితు

ణ్ణంటూవచ్చి నాకు ఉద్యోగం ఇస్తానన్నాడు!...

'నాకు భోగంవాళ్ళంటే ఎప్పుడూ అసహ్యమే! ఒకరోజున నేను సానివీధివెంబడి పోతుండగా నన్నెవరో ఒకయింట్లోకి పొమ్మని ప్రేరేపించినట్టయింది. ఆ యింటిది తాగుబోతు. ఉత్త దరిద్రపు లంజ నాకు దాన్ని చూస్తే ఆవగింజంత ప్రేమలేకపోగా పరమ అసహ్యం. అయినా ఆయింట్లో దూరాను!... మర్నాడు ఒక పెద్దమనిషి నన్ను ఒక బాంకు ఏజంటు దగ్గిరికి తీసుకుపోయి నెలకు డెభ్భై రూపాయలమీద నన్ను గోడౌన్‌కీపరుగా నియమింపచేశాడు. నాకాపని కూడా తెలీదు. ఆఉద్యోగంలో ఉంటూ నాకిష్టంలేనివీ ఎవడైనా వింటే నోట్లో ఉమ్మేసేవీ అనేకపనులు చేశాను. నామీద కేసులుకూడా వచ్చినై. నన్ను నా యజమాని దివ్యంగా తప్పించాడు. నాప్రయత్నం ఏమీ లేదు. నా అభివృద్ధికి ఏమీలోపంరాలేదు. కొద్ది కాలం కిందటే నన్ను ఏజంటుచేశారు. ఇప్పుడు రెండువందల యాభై ఇస్తారు!...

'నేనిప్పుడు ఎవర్నీ తప్పుపట్టను. నన్ను తప్పుపడితే సహించను! నాజీవితానికి నాఅనుజ్ఞ ఎంతమాత్రం లేకుండా ఉంటున్నది. నేనేంచెయ్యాలి? నన్నుపట్టిన గ్రహం చాలాదుష్టగ్రహంగా కూడా ఉంది! భగవంతుడనేవాడుంటే అతణ్ణి చాలాకాలంనించీ ప్రార్థిస్తున్నాను నన్ను మంచిగ్రహంచేతులో పారెయ్యవయ్యా అని. ఇంకా నా మొర ఆలకించలేదు భగవంతుడు.'

నేను కొంచెంసేపు ఆలోచించి 'చాలా విచిత్రంగా ఉంది—నిజమైతే! కాని ఒక్కకేసునుబట్టి ఏమీ తేల్చలేం!' అన్నాడు.

'ఒక్కకేసా! వందలు! వేలుచూపిస్తాను! మీ రామాట అనటంబట్టి మీ రీవిషయాన్ని గురించి ఎన్నడూ ఆలోచించలేదని తెలుస్తుంది. నాఅనుభవం ఒకటి వినండి. నేను ఒకప్పుడు ప్రతి ఆడదీ పతివ్రతే అనుకునేవాణ్ణి. అప్పుడు నాకు రంకువాళ్ళనుగురించి ఆలోచనే లేదు. తరవాత ఎందుచేతనో ఆవిషయం ఆలోచన వచ్చినప్పుడు గమనిస్తే దాదాపు నేనెరిగిన ప్రతి ఆడదీ రంకుతనం చేసిన మనిషే! ఇంటికొకత్తె! అనేక విషయాలను గురించి ఆలోచించక మనం జీవితంలో నూటికి తొంభైతొమ్మిదిపాళ్ళు అసలు చూడనే చూడటం లేదు—విచారించటం మాట దేవుడెరుగు!... నేనిప్పుడు నాజీవితంలో వలుసులన్నీ ఏరితెచ్చాను కనుక నా జీవితం విపరీతమైనట్టు మీరు భావించుకుంటారు. కాని అందరి బతుకంటికిదే నాదికూడా. కారణంలేకుండా భార్యను వదిలేసిన వందల్లో నేనొకణ్ణి. లంచాలుపుచ్చుకుంటున్న వేలల్లో నేనూ ఒకణ్ణి. ముండల ఇళ్ళచుట్టూ తిరిగి సాధ్యమైనంతవరకూ తప్పించుకుంటూ పొరపాటున తగిలితే వెంటనే నయంచేసుకుంటూ తిరుగుతున్న కోట్లమందిలో నేనొకణ్ణి. నన్నుబాగా ఎరిగినవాళ్ళు విపరీతంగా చూడనే చూడరు!'

నేననుమానంగా తలఊపాను.

'అందుకనే కృష్ణుడు తక్కువదేవతలను కొలవక తన్నేనమ్మి ఉండమన్నాడు! వీళ్ళను జయించటానికి ఇంద్రియనిగ్రహం కావాలి!'

'అదీ ఆలోచించాను. ఆ భగవంతుడి స్వరూపం తెలిస్తేకద ఆయన్ను నమ్మటమనేది జయప్రదంగా జరిగేది. నేను నమ్మేఉన్నాను. ఇక తక్కువదేవతలను ఎదిరించటం మాటా? మనిషికి ఎదురుతిరిగిన కుక్క మనిషికన్న ఎక్కువేఅవుతుందో తోడేలే అవుతుందో? నాకు వృద్ధిపొందాలనేఉంది కాని క్షీణించాలనిలేదు. ఇప్పటిమట్టుకు ఒక్కపని చేస్తున్నాను. నన్ను రెండు భాగాలు చేసుకున్నాను. ప్రస్తుతం అందులో ఒక భాగం మాత్రమే వీధికి లొంగిఉన్నట్టూ, రెండోభాగం దానికి ఎడంగాఉండి దాని మంచిచెడ్డలను నిశ్చింతగా గమనిస్తున్నట్టూ నటిస్తున్నాను. అసలటువంటి రెండో భారం నాలోఉన్నట్టే ఉంది. కేవలంసైకలాజికల్ ఎఫెక్టే కావచ్చును మరి!' అంటూ అతనునవ్వాడు.

—కొడవటిగంటి కుటుంబరావు.

స్త్రీలు

ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.





# మహిళా లోకము

## స్త్రీవిద్య

[జాన్ రస్కిన్ పండితుడు స్త్రీవిద్యావిధానవిషయమై యిచ్చిన ఉపన్యాసభావమును, ఈ వ్యాసము సంక్షిప్తముగాఁ జెప్పును.]

స్త్రీ విద్యావిధానములో, ఆమె యారోగ్యమును సౌందర్యమును పెంపొందించుటకు తగిన శరీర వ్యాయామశిక్షను గఱపుట మొదటివిధి. సౌందర్యమును వృద్ధిపఱచుటకు, కేవలము శారీరకస్వేచ్ఛ నిచ్చియో జనము హృదయస్వాతంత్ర్యముకూడ నుండవలెను. ఈ సందర్భమున నొక మహాకవి రచించిన పద్యకావ్యములో, ప్రకృతిదేవత—'లూసీ' బాలికనుగుఱించి చెప్పినసంగతి గమనింపదగినది:—

'మూడుసంవత్సరాలు, ఎండలోను. వానలోను, ఆమె పెరిగినది;

అప్పుడు ప్రకృతిదేవత చెప్పిందిల్లా: 'భూమిమీద నింతకంటె సౌందర్యకుసుమము పుట్టియుండలేదు.

ఈపసి బిడ్డను నేను తీసికొందును:.

అమె నాస్వంతమే కావలెను, నేను ఆమెను నా దానినిగాఁ జేసికొందును.

'లూసీకి ఉన్నతభావములనే యిచ్చెదను—ఆమె, నేనూ, ఈ సుఖవాసములో కలసియున్నంతవఱకు—'

ఆ కవియే స్త్రీసౌందర్యాన్ని పరిపూర్ణముగా నెట్లు వర్ణించినాడో చూడుడు:

'ఆ ముఖారవిందంలో—తియ్యని తలంపులు తియ్యని ఆశావాగ్దత్తములును కలసికొన్న ఆ ముఖారవిందంలో—'

పై విధముగా బాలికలను మార్చవలెను. ఆమె శరీర దృఢత్వమెంతవఱకవకాశమిచ్చునో అంతవఱకు, విజ్ఞానము నివ్వవలెను. పురుషుని పనినిగ్రహించి, సహాయపడుటకు ఆమెను శక్తికలదానిగా చేయుటకు తగినంత విద్యనివ్వవలయును. విద్య విద్యకొఱకే గాక ఆమెకు విమర్శనా జ్ఞానమును, భావనాజ్ఞానమును, వృద్ధిచేయవలెను. ఇతరుల భావమగ్రహించి, సానుభూతి జూపించునెడల, ఆమె యెన్నిభాషలను నేర్చినను నేర్వకున్నను మనకనవసరము. ఏశాస్త్ర శాఖలోను ప్రత్యేకనిపుణతఁ బొంద నవసరములేదు. స్పష్టమయిన ఆలోచనలు, తలంపులు సేయుటయందు ఆమెకు అభ్యాసశిక్షణ నొసంగవలెను. ప్రకృతిధర్మములను, ఈశ్వరశక్తికి మానవశక్తులు కొద్దివని యామె నేర్చుకోవలెను. సంగతులు తెలిసికొనుటకుమాత్రమే గాక, ముఖ్యముగా మానవ కుటుంబమునకు సానుభూతి జూపించుటకు, దేశచరిత్రలు భూగోళశాస్త్రముల నభ్యసింపవలెను. సమకాలిక చరిత్రలను చదివి తన గృహమునకు వెలుపల జరుగుచుండెడి, ఇతరులకష్టముల నామె గ్రహించుకొనవలెను.

ఇంతవఱకు నందరు సమ్మతించెదరు. మఱియొక విశేషము గలదు. స్త్రీలోకమున కపాయకరమగు నొక శాస్త్రముగలదు. అది వేదాంతశాస్త్రము. ఈతత్వశాస్త్రములో గొప్పగొప్ప వేత్తలును మహాజ్ఞానులు కూడా చీకాకుబడిరి. తప్పుడుద్రోవంబోయిరి. స్త్రీలు కొద్దిగానే గ్రహించి ఎక్కువభాగమును తిరస్కరింతురు. భగవంతునితోఁబాటు తీర్మాననిర్ణయ హక్కును కోరుదురు. తత్వశాస్త్రములోనున్న తప్పులుకూడ వారి మనఃఫలకముల నాటుకొని, సంఘమును భీభత్సపఱచును. అందువల్ల మతసత్యములు తలక్రిందులవును. పూఁబోడులు వారివారి స్వంత ఆధ్యాత్మిక స్వరూపముల నెలకొల్పుదురు (స్పిరిట్యుఅల్ డాల్స్) వాని యభి

ప్రాయములను బహిరంగముగా ఖండించుటలో కుటుంబ సౌఖ్యము నశించునని భయపడి, భర్తలు అసంతృప్తితో దూరముగా మెలగవలసి వచ్చును. కనుక నారీలోకమునకే తత్వశాస్త్రమును మాత్రము బోధింపరాదు.

ఈ మినహాయింపు తప్ప, విద్యావిధానమంతయు బాలబాలికలకు దాదాపు నొక్కటే కాని, బాలికలకు ప్రత్యేకదృష్టితో బోధింపవలెను. ఏస్థితియందైనను, తనభర్త ఏవిషయములెఱుంగునో, ఆవిషయములన్నిటిని భార్య యెఱుంగవలెను. పురుషుని విద్య గట్టి పునాదిగలదిగా నుండవలెను. బాలికవిద్య సర్వ సామాన్యముగా నుండి దైనిక జీవితములో నుపకరించునట్లుగా నుండవలెను. అట్లయినచో, ప్రస్తుత ప్రయోజనమునుగాను, పురుషులుకూడా స్త్రీల మార్గముననే విద్యనభ్యసించుట మంచిదిగదా యందురేమో? విశాలదృష్టితోఁ జూచినచో పురుషుడు, శాస్త్రమునుగాని భాషనుగాని ఆమూలాగ్రముగా నేర్చుకోవలెను. ఆశాస్త్రములనే, ఆభాషలనే, తనభర్తయొక్కయు, భర్తయొక్క ఆప్తులయు సౌఖ్యములతో సానుభూతిగా నడచుకొనుటకు తగినంత సామర్థ్యముకల దానినిగా చేయునంతవఱకే స్త్రీ విద్యనభ్యసింపవలెను.

ప్రాథమిక విద్యకును, సూపర్‌ఫిషియల్ విద్యకును చాలభేదముగలదు. ప్రాథమికవిద్య యనగా పునాదిగల ప్రారంభము. సూపర్‌ఫిషియల్ విద్య యనగా అన్ని విషయములు సగము తెలిసి సగము తెలియక యుండుట. స్త్రీ తననేర్చుకొన్న కొద్ది విద్యతోనే భర్తకు సహాయముగా నుండవచ్చును. అర్థచదువుతో అనగా తెలిసీ తెలియని చదువుతో భర్తను సదా విసికించుచుండును కనుక ప్రాథమిక విద్యయైనను, శ్రద్ధగాను, స్పష్టముగాను నేర్చుకోవలెను.

బాలుని జ్ఞాననేత్రముకంటె, బాలిక జ్ఞాననేత్రము త్వరలో వికసించును గనుక బాలికనే ముందు ఉన్నతాశయములుగల విద్యలో ప్రవేశపెట్టవలెను. చిల్లర సారస్వతమును ఆమెదరికిఁ జేరనీయరాదు. ఆమెకు, సదా, ఓర్పును, శాంతి గాంభీరాది సుగుణములను, ఉన్నతాశయములను కలిగించుటకర్హమగు సారస్వత గ్రంథములనేఁ జెప్పవలెను. భావోద్రేకమును గల్గించు నవలలు, ప్రణయ ప్రబంధములు, ఆమెను చదువనియ్యరాదు నవలా పఠనమువల్ల సాధారణ జీవితమందలి శ్రద్ధ నశించును. నవలలో వర్ణింపబడిన ఊహాప్రపంచమునకై మనస్సు పరువిడును. మనస్సు చంచలమగును. స్థిరబుద్ధి నశించును. నవలారచయితలు, ఉన్నదానికంటె పదిరెట్లుగా నూహాబలముచే చిత్రవర్ణనఁజేతురు. ఆ వర్ణనావిశేషమునే సత్యముగాభావించి, పాఠకులు వ్యామోహమునుఁ జెందుదురు. నవలలుఁగాని, పద్యకావ్యములుగాని. చరిత్రలుగాని వాటివెలుపల నేమున్నదో దానికొఱకు గాక, వాటిలోనున్న దానికొఱకే చదువవలెను. సద్గ్రంథములు మంచిబాలికలకు హానిఁజేయవు. కాని గ్రంథకర్తలయొక్క తెలివితక్కువ, బాలికల నధోగతికి లాగును. కేవలము పూర్వగ్రంథములు మాత్రమేగల గ్రంథాలయములో, స్త్రీకి 'ఈపుస్తకమా' 'ఆపుస్తకమా' అను ప్రశ్నయే యుండదు. ఆధునిక నవలలునూ, మాసపత్రికలునూ, బాలికల కందుబాటులో లేకుండా చేయవలెను. ప్రాచీన గ్రంథాలయములోనికి ఆమెను స్వేచ్ఛగాఁ బోనివ్వవలెను. ఆమె తనకేది మంచిదియో అందు నిర్ణయించుకొనగలదు. బాలురు నిర్ణయించుకొనలేరు. ఇచ్చటనే బాల బాలికల శీలములో భేదముఁగలదు. ఇత్తడిముక్కను సుత్తెతోఁ గొట్టి ఏయాకారమునకైన నెట్లు మార్చవచ్చునో, రాతినుండి యెట్టి విగ్రహమునైనను తయారు చేయవచ్చునో, అట్లే మంచిబాలు నేవిధముగానైన మార్చవచ్చును. బాలికను మార్చుటకు శక్యముగాదు. ఆమె పుష్పమువలె స్వేచ్ఛగా పెరుగును. సూర్యుని వెలుతురు లేక వాడిపోవును. పరిశుభ్రమయిన వాయువులేనిచో నామె క్రుంగిపోవును. ఆమె జీవితములోఁ గొన్ని సమయములందు, నీ (పురుషుని) సహాయములేనిచో పడిపోవును. అయినను ఆమెను నీవు నిర్బంధపిశాచముచే పీడింపరాదు. నీవు పొలములో పావురమును నేవిధముగా వదలుదువో, తత్సమముగానే యామెను గ్రంథాలయములోని కట్టువిడువుము. తనకు ఇచ్చవచ్చిన ఆహారమును గైకొనగలదు. నీకంటె యిరువదిరెట్లు ఆమె మంచిచెడ్డలను గ్రహించగలదు.

కళలో సున్నితమైనవాటినే యామె కొసంగుము,

జ్ఞానకళను నేర్పించుము. కళ నిజమయినదిగాను, క్లుప్తమయినదిగాను, ఉపయోగమయినదిగాను నుండవలెను.

బాలురకేయే యవకాశములిచ్చెదవో బాలికకుఁ గూడ వాటినే యిమ్ము. ధైర్యము, సత్యము, మానవ జీవితమునకు, ఊత స్తంభములని బోధింపుము. ఉన్నత బోధనే గాక, ఆదర్శప్రాయులగు నుపాధ్యాయులను ఆమెకై సంపాదించుము. నీ కుమారులకు విద్యగఱపు గురువుల గౌరవించువిధముగనే. నీ కుమార్తెలకు విద్య జెప్పు గురువులనుకూడ గౌరవింపుము.

వీటికన్నిటికంటె ముఖ్యమయిన విషయమొకటి గలదు. ఆమెకు ప్రకృతి సహాయముఁ గావలెను. అది యామె కత్యంతోపకారి. బాలికావిద్యకు మెఱుగుఁ బెట్టును. ఫ్రాన్సు దేశములోనున్న సహజదృశ్యములు ఇంగ్లాండునలేవు. ఒకవేళ ఉన్నప్పటికిన్ని, అడవులను, ఆరామములను, ఉద్యానవనములను, ధ్వంసముఁజేసి, యంత్రాలయములను కట్టించెదరు. ప్రస్తుతయుగమున, ఇంగ్లాండునంతయును, పాగను ఆవిరిని బయటికిబంపు యంత్రాలయముగా మార్చినారు ప్రకృతిదేవత సహజ సౌందర్యమును నాశనముజేసి వికృతాకారము దెచ్చిపెట్టినారు. తద్వారా విద్యకునూ, మానవజాతికిని, ఎంత నష్టమో గ్రహించలేదు. గ్రీసు దేశస్థులు, నదులందును, పర్వతములందును దేవతలుందురని నమ్మెదరు. అందు వల్ల వారు ప్రకృతి సౌందర్యమును బాడుచేయరు.

ఆంగ్లేయులు నమ్మకములేక చెడగొట్టుచున్నారు. బాలికలను సహజమైన ప్రకృతి సౌందర్యమునఁ బెంచవలెను విద్య నేర్పవలెను. ప్రకృతి సహాయములేక మానవుడు, సత్యమును అన్వేషించలేడు. మనమెన్ని చిత్రవిచిత్రమయిన భవనముల నిర్మించినను ప్రకృతి సౌందర్యమున కన్నియు లోకువ.

——వల్లభదాసు రాజగోపాలరావు. బి,ఏ.

---

# సత్కవి సాంత్వనము

ఘోరతరాధి బాధలకుఁ గుందుచు నెట్టులో జీవయాత్ర సం
సారమహాబ్ధి భంగముల చాటునఁబుచ్చుచు దీనమూర్తివై
సారెకు నుష్ణబాష్పముల జార్చెడి నీకనుదోయి యేజగ
త్కారణు దివ్యరూపమును గన్గొనఁగల్గు గదయ్య సత్కవీ.

ప్రశిథిల దేహలగ్నమగు ప్రాక్తనరక్తము దైన్యసంకులా
నిశపరితాపవహ్నిఁ గొగి నిత్యము ప్రుగ్గుచుండఁగా దివా
నిశలు సరస్వతీచరణ నీరజనవ్యమరంద ధారకుఁ
వశమయి కావ్యజీవన వశ్యమొనర్తువు నీవు సత్కవీ॥

చెదరిన ప్రాక్తనప్రథితశిల్పపరంపర, పూర్వభారతా
భ్యుదయము, విస్మృతంబయిన యార్జితవాఙ్మయ భోగభాగ్యముల్
మది దలఁపోసి దుఃఖరసమగ్నుఁడవై యొనరించు నీ, రసా
స్పద కవితావిలాసము లె జాలు జగంబులుదన్ప సత్కవీ॥

పద సంబంధముచే స్వరూపగరిమం బాటించి, నానా రసా
స్పదధారాకలనంబుచేత నునురుఁ సంధించి, సారస్వతా
భ్యుదయ శ్రీలను సొమ్ములంచి కవితాయోషామణిఁ నీవ తీ
ర్చెద వత్యుత్తమ కావ్యకల్పన విరించీ! వాఙ్మయోద్ధారకా॥

అల చతురాననుండు జగదాద్యుఁడు దీర్చిన పాంచభౌతికో
జ్జ్వలమగు మేనుపోయిన విచారమునొందరు ధీమణుల్ భవ
ల్లలిత పదాభిరామ రసలక్షణలక్షిత కావ్యరత్నమే
నిలుపును గాదె మృత్యుముఖ నిర్గతుఁగాఁ గవితాప్రియాత్మునిన్ ॥
కావ్యజగంబునఁ గమలవనీజాత సురభివాతముల కేకఱవు లేదు
కృతివీధి నుద్యానగత మధూదయ మదకోకిలగీతి కేకొఱంత లేదు
కవితాప్రపంచరంగమున శారదచంద్రకలిత యామినుల కేవెలితి లేదు
భావలోకమ్మునఁ బ్రకృతి సౌభాగ్య మహాటవీ వితతి కేలోటు లేదు.
ఈజగన్నాట్యశాల కెన్నెన్ని నిరుపమాన సౌందర్యమహిత సంపదలు వలయు
నన్నిసమకూర్చి భువి దివి నాచరించు నిన్నుఁగొనియాడ నెవ్వండు నేర్చు సుకవి.
కవితాప్రపంచమంతయు స్తవనీయముగాఁగ శాంతిసందేశముచే
మిత్రుల సవరించు నీకావ్యవిశేషము నిలుచుగద యుగాంతముదనుకన్ ॥
నీ విజ్ఞానమె జాతికభ్యుదయ మంతేఁగూర్చె, నానారస
శ్రీవిభ్రాజిత యుష్మదీయరచక జీవాతువుల్ భాషకీ
నీవే సత్పథ దర్శకుండవు జనానీకంబునందైన నే
మీవిశ్వాసము జూపరేరయినఁ బేర్మిన్ నీవయిన్ సత్కవీ ॥
అతిదారిద్ర్య పరంపరానుగతమౌ నత్యంత కష్టంపు జీ
వితమున్ బుచ్చుచు శూన్యలోకమును సేవింపఁగఁ గాంక్షించి స
త్కృతి రత్నంబులు కాంతిమంతములు నీ ధీశక్తిచేతన్ జగ
ద్ధిత కాంక్షన్ సృజియింతు వీకృషి జగత్ శ్రేయంబుఁగూర్చున్ గవీ ॥
గురుకులవాసమున్ సలిపి కూర్చితి వెంతయొ విద్య, ధారుణీ
శ్వరుల సభాంగణంబులను సైచితి వెంతయొ దైన్య మావలన్
కఱగినబుద్ధితో నిశిత కావ్యపరిశ్రమ సల్పినిష్ఫలా
కరమగు శూన్యజీవితము గంటివి లోకహితార్థివై ; కవీ ॥
మాసిన యాంధ్రసామ్రాట్ కీర్తి తేజస్సు కావ్యజగత్తునఁ గ్రాలఁ జేసి
భువనమోహనమైన కవితామృతంబుచే విబుధలోకమునకు విందుఁగూర్చి
ప్రశిథిల దేహస్థ బ్రహ్మతేజస్సుచే కావ్యసృష్టిని మహోత్కర్షఁ జూపి
సమధిక శాంత ప్రసన్న జీవితముతో నుత్కటానందాబ్ధి నోలలాడి.
భావిభారతవర్ష సౌభాగ్యకాంతు దారితీయఁగ సుకవితా తరుణి వెంట
ననుగమించుచు లోకకల్యాణ భావగీతి పాడెడి నీకు మ్రొక్కెదఁ గవీంద్ర ॥
నీరమణీయకావ్యసరణిన్ జనిప్రాజ్ఞత నొంది నిన్ దిర
స్కార మొనర్చుచుండెదరు కాకవులెందఱొ నీపవిత్ర వా
గ్ధారకు నీయనంతరము తన్మయులౌదురు లోకులీ చమ
త్కారము జూచి చింతిల వొకానొక వేళను నీవు సత్కవీ ॥

—శ్రీ శేషాద్రిరమణకవులు.

# నేటి సాహిత్యము

తలదిమ్మెత్తించిన ప్రాతపద్ధతులనుండి యాంధ్రభాషను బయటపడవైచి నూత్నజీవనము గూర్చుటకుత్సాహ సంక్షోభితులగు నాంధ్రపుత్రులు పాతికముప్పది సంవత్సరములనుండి నిరంతరము పాటుపడుచున్నారు. ఆంధ్రవీరులు గిడుగువారియండను నిలిచి యోధానుయోధులై భాషాయోషామణిని విశాలలోకరంగమునకు గొనితేర నాబిడను బంధించిన వ్యాకరణపు చక్రమును తుత్తునియలుచేసి భుజాస్ఫాలనములతో జయజయారావముల నొనర్చుచున్నారు. ఇప్పుడామెకు బంధములు వీడినవి. అరచాటుననుండి పండిత పుత్రులను దొంగిచూచు నిర్బంధము తొలగినది. ఇష్టమువచ్చిన యెల్లకడల దిరుగాడుచు నెల్లరతో సల్లాపములాడు స్వాతంత్ర్యము లభించినది. శారీరక నియమనము సడలబాటి పలువిధములగు తన రూపములను ప్రపంచమునందు ప్రదర్శించుచున్నది. సరి!

దేశమున సమాజములు - సంఘములు - మండలులు - పరిషత్తులు వెల్లివిరిసినవి. కవికుమారులు ప్రేమగీతములను మృదుమధురస్వరముల నాలపించుచు, రసిక జనహృద్విపంచికలను మీటుచు రసార్థులం దేల్చుచున్నారు. కవితా - కళాదిశబ్దపూర్వక కుటీరములనుండి రసవాహినులు - తేనె సోనలు ప్రేమగానములొనర్చుచు జాలువాఱుచున్నవి. పత్రికలును కొలదియో - గొప్పయో విజృంభించి కవిశారికా గానములను నాంధ్రోద్యానమున ప్రతిధ్వనింప జేయుచున్నవి. అన్నియుంజేరి చేసినదేమి? 'భాషకు ప్రాతతీరులు పనికిరావు క్రొత్తపోకడలు కావలయును.'

అయినచో నెంతవఱకు చేకూరిన దీక్రొత్తదనము? పూర్వ కవివరులు గద్యపద్యములకే పట్టముగట్టి. నియమితమార్గములనే సంచరింపగా నేటి కవికుమారులు గీతములు - పాటలు - పదములు మున్నగు నూతనమార్గములయందు గూడ నిరాఘాటముగ విహరింపగల్గుచున్నారు. పూర్వు లాశ్వాసములకొలది గ్రంథములను నిర్మింపగా నపూర్వులు హ్రస్వరూపము నొసంగి యానందించుచున్నారు. నాడు ముక్తకంఠమున - తేటతెల్లముగ - వారిగోడు వెళ్ళబోసికొనగా నేడు చాటుమాటుగ నవిముక్తకంఠమున తమసొద జెప్పుకొనుచున్నారు. వారొక కామినీరత్నమును లంకించుకొని యెదుటనిలిపి యంగప్రత్యంగములను వర్ణించి వర్ణించి చూపరుల కూటలూరింపగా వీరుతమవలచిన 'కాంతామణి' యెడబాటున కోరువక కుమిలి కుమిలి జనుల హృదయములకు జాలిగొలుపుచున్నారు. ఇది ఆంధ్రసాహిత్యమున కిప్పుడు గల్గిన క్రొంగ్రొత్త పోయాలు.

కవిశుకములు - కవిశారికలు - కవివృషభములు - కవివ్యాఘ్రములు హృదయములు రసపరీవాహముచే నిండి - పొంగి - పొరలి తమయిష్టమువచ్చినట్లు గానమొనర్చుకొనుచుందురుగాని లోకముకొఱకు గానము సేయరందురు. లోకమునుద్దేశింపక యాయానందానుభవమున నున్మత్తులై యాడుకొననిండు - పాడుకొననిండు - గంతులువైచికొన నిండు - మఱేమియైన చేసికొన నిండు - మనకు చిక్కులేదు; ఈపత్రికామతల్లులు - గ్రంథకుసుమములు పూరింపక - విరియింపక యాప్రేమాలాపములు వాయుతరంగమాలికలపై విడచి యాకాశరంగమున విహరింపబంపినచో లోకమునకు గొఱతయుండదు. కాక యిన్నిగీతములతో - ఇన్ని కథలతో - ఇన్నిపద్యములతో నిన్నివిధముల నిరంతరము తలచుకొని తలచుకొని విలపించుచున్నచో నెంత యస్పష్టముగనున్నను పాపము! చీకాకునొంది యెంతటి పాషాణహృదయమైనను బ్రద్దలయి సమాశ్వాసరూపమున స్రవియింపక పోదు. 'సరసకవితా లతాంగిని సరసజేర్చి పాడుకొనుచుండు...ప్రణయగీతు'లతో పాప! మా లతాంగియు నసురుసురయి యడలిపోక మానదు.

ఒకచిన్నదో పడుచుదో కంటబడినంతమాత్రమున కవికుమారుడు వెంటబడి 'ఆ చెట్టుక్రిందుండు ఓ చిన్నదానా పైచెట్టు క్రిందుండు ఓ పడుచుదానా!' అని

మెల్ల మెల్లగా పిలిచి 'సల్లెమొగ్గ కావాలంటే మంచి నీళ్ళకు రావాలోసీ వచ్చి పావంచాలకాడ ముచ్చటాడి పోవాలోసీ' అని హితోపదేశమొనర్చుచుండును 'పది యేలసారులే బ్రహ్మదేవుణ్ణి యేడుకొంటున్నాను జోడు కలుపంగ దిగులాదిలివుండవే' యని కవిసింహము తన ప్రార్థనా పరమార్థమును వివరించుచు తన యింటుకత్తె ననునయించుచుండును.

కవిత జాతియొక్క మనస్తత్వమును విస్పష్టరీతుల బ్రకటించుచుండును. పూర్వాంధ్ర వాఙ్మయమున (ముఖ్యముగ 17-18 శతాబ్దులలో) శృంగారరసము తెప్పలు దేలుచు దేశమున నెల్లయెడల బర్యాటకు గారణము ఆనాటి యాంధ్రరాజన్య లన్యకార్యములను విస్మరించి యంతఃపురరంగముల విలాసినీ లలామల కటాక్ష బాణాహతులై ప్రపంచము నెఱుంగక కాలము బుచ్చుటయే యని వాఙ్మయచరిత్ర విజ్ఞానులందురు. ఆంధ్రరాజశిఖామణు లీయపయశః కలంక దోష దూషితులనుట ఒకప్పుడు మగధసామ్రాజ్యము నేక ఛత్రముగ నేలుబడిచేసితిమని విఱ్ఱవీగు నాంధ్రపుత్రులకు తలవంపులుగాకపోదు. కాని యానాటి యాంధ్ర జనసామాన్య హృదయములను — వారి ప్రవృత్తిని మన మెఱుంగజాలము. నాటి వాఙ్మయమునకు నరపతులు మూలస్తంభములుగనుంటయే యిందులకు మూలము.

కాని నేటిస్థితి యదిగాదు. పాలకులకు భాషతోడి సంబంధము బాదరాయణము. కాన సాహిత్యమంతయు ప్రజాసామాన్య హృదయమును ప్రతిఫలింపజేయుచుండును. కాన నేటి సాహిత్యముం జదివినచో నాంధ్ర జాతియెడ నితరులకు...

ఆంధ్రులు కూటికిలేక కడుపు కాలుచుండియు, పరుల పాదుకలకు బ్రణామము లొనరించుచుండియు, విపరీతభావతరంగములలో నూయేలలూగుచుందురు. వారికి ధైర్యసాహసములు కలలోన్ని వార్తలు. కార్యపటుత్వము ప్రాజ్యము. రేయింబవళ్ళు తమవలచిన యొక కాంతామణి మోముదమ్మిని రెప్ప వ్రాల్పక కాంచుచు కాంచుచు నంతటితో దనివితీఱక కళల నీనుచు ముద్దులొలుకుచుండెడి యంగకముల గన్నారంద గాంచనిమ్మ' అని ముక్తకంఠమున వేడికొనుచుందురు. కామిని కనబడుటయే తడవుగ 'రేయెల్ల నిద్దురే లేదుగావలెను రక్తమగ్రమ్మె నీదు నేత్రాంతములను' అని పెదవులు గొఱికికొనుచు - వడుగుచు - నామె పెడమొగమై పోవుచున్నను 'ఇంత మైకమ్మదేల సుంతవినిసంతసింతు వచింతువో కొమ్మ?' యనుచు చేతులు జోడించుకొని వెన్నాడుచుందురు. ఆంధ్ర యువకుడు స్త్రీనీడ పొడగన్నను 'నాదుగుండె పొగ లైనది వాడియువత్తలైనదిక' అని తన దౌర్భాగ్యము నెస నించుకేని జాలిగొలుప పలుపాటుల వడుచుండును. కవితాకామిని యాంధ్రయువకుని గాంచినంతనే 'పాల వంటి యౌవనము నీ పాలుచేయ నేగుదెంచితినను గటాక్షింపు మనంఘ!' యని మానినీజన సహజమగు గాంభీర్యమును విడనాడి మచ్చునందుచల్లినట్లు— చంద్రుని తారా రమణీమణివలె— మరులుకొలుపుచుండును' అనితోచుట యబ్బురమా?

ఇందులకు సాక్ష్యము గావలయునా?

'సమానఉజ్జీలు' అను కథనుజూడుడు ఆంధ్రులలో ఇంట వంటసేయుటకు యువతిని నియమించుకొనవలయునని పురుషుల ప్రయత్నము, పురుషుని నియమించుకొనవలయునని పొలతుల పట్టుదల. అలుమగల తగాదా. చివరకు తేలునదేమి? 'ఎందుకు నాన్నా! ఒకరొకరు అనుకోడం? అంత సమఉజ్జీలం. మామయ్యగూడ మీకు సరిపోయినాడు. . .అమ్మదగ్గరుంది - నర్సు - నీదిఫొటో. ఆవిడది నీదగ్గిరుంది. . .ఎవరంతవాళ్ళు వాళ్ళయినప్పుడు- ఎవరిసాహసం ఎవరిచరిత్ర వాళ్ళకున్నప్పుడు - ఇక చెప్పేదేముంది. సమఉజ్జీలై పోయినారు' అని కుమారిత తీరుపు. ఇది నేటి యాంధ్రసాహిత్య ధోరణి. అబ్బబ్బా! (దయయుంచి యుదాహరణము లడుగకుడు)

పోనిండు - ఇతరు లేమనుకొన్న మనకేమికొఱత? ఆంధ్రజాతి పరుల యాటుపోటులకడలెత్తి తన స్వేచ్ఛాగానమునకు వాకట్టుకట్టి పిఱికికండగలదికాదని యొక నిమిషము సంతోషింతము. కాని యాంధ్రకుమారుడు ఆంధ్ర యువకుడు నేటి సాహిత్యమును జదివినచో

నతని కానువంశికముగనున్న సత్తువ - పటుత్వము - కార్య నిర్వహణశక్తి - మున్నగునవి యెడారియందు ప్రవహింపజేసిన పిల్లకాలువలవలె తగ్గితగ్గి యెండిపోక తప్పదుగదా!

దీనింజదివిన నాటనుండియు నతనికి హాయలు మీఱు జిలుగు వలువలంధరించి ముక్కుద్దము చేగడియారము నొయ్యారముగదాల్చి నవనాగరకతా సాధనములగు విలాసవస్తువుల నాశ్రయించి యెంతేనేని యొకచక్కనిచుక్కను— 'ప్రణయమూర్తి'ని— 'జ్యోతిర్మయి'ని— 'ప్రేమవాహిని'ని— విలాస సంశోభితను—సధవనేని విధవనేని—ఒక ధనవతిని—తన తౌతతండ్రులు సంపాదించిన ముల్లెనుగొనియేని లేక త్యాగ మొనర్చియేని యేదే నొకపట్టనమున నీ 'చంచల ప్రపంచమును మఱచి - తన్మయభావమున నా 'ప్రేమమూర్తి' యడుగుదామరలచెంత 'నద్వైత' భావమున నమరలోకసుఖము ననుభవింపదలంపు వొడమక యుండునా?

'వలదేలా? నన్ని త్రిప్పలబెట్టెదవు తరుణీ విముగ్ధ క్షణశృంఖలలకో బూవుల హారమ్ములటంచు మెడదవిలించి పారిపుచ్చెదవా' అని కవిగజములు పూవులహారమ్ములను భ్రాంతితో శృంఖలలను మెడదవిలించు కొనుచున్నారుగాదా! 'ముగ్ధహృదయను నన్ను సమోహవార్ధి భంగముల ద్రోసిపోవగ బ్రతుకగలనే? రమణ నీదివ్య నామాక్షరముల నెమ్మి నెడదదలచుచు బ్రాణమ్ము విడుతుగాక' అని వేడుకొనునట్లు ఆంధ్రముగ్ధలను గూడ వార్ధిభంగములద్రోసి బ్రతుకుమీద వైరాశ్యమును గలిగించి ప్రాణములు విడుచునట్లు చేయుచున్నారుగాదా!

'ఇదె వచ్చుచున్నాను ప్రియురాలా—ఇక నిలువలేను నా ప్రియురాలా—ప్రేయసీ ప్రేయసీ ప్రియుడనే ప్రేయసీ వేయికన్నులుదాల్చి వెదకుచున్నానే' అని 'నన్ను పెండ్లాడవే చెంచీత' అని నరసింహస్వామి వెంటబడినట్లు - దరువులేయుచు భీతహరిణము వెంటాడు భీకరవ్యాఘ్రమువలె - తన్నంగీకరింపక తిరిగిచూడక పోవుచున్న యువతింగాంచి వెంటబడుట యాంధ్రకవి సామాన్యలక్షణముగ గానబడుచున్నది.

ఇటులంటినని యీ కవిత్వములెల్ల రసహీనములని గాని - ఆంధ్రకవిత్వములన్నియు నిట్టివేయని గాని - ఆంధ్ర కవివరులెల్లరు నిట్టివారేయని గాని మా తలంపు గాదు. కాని యాంధ్రసాహిత్య ప్రవృత్తి యిటులున్నది. గీతములు - కథలు - నాటకములు - ప్రహసనములు - పద్యములు - పాటలు, అన్నియు సామాన్యముగ నిట్టివే యాంధ్రుల కామప్రవృత్తిని రేపుచు - భోగలాలసను ప్రవర్ధించుచు జాతిని పెడమొగమున కీడ్చుచున్నవి.

ఇటులంటిమని శృంగారమును ద్వేషించుచున్నామని గాని, దాని కార్డినెన్నను ప్రయోగింపవలదనని గాని - మా యభిప్రాయముగా భావింపరాదు. కాని యదియే సర్వస్వముగాదు యువకుల కోమలహృదయ క్షేత్రములందు ధైర్యసాహసాది బీజములను శృంగార రసమునముంచి మొలకెత్తించి ధ్వంసముసేయరాదు. అటులేయయినచో జాతి శీఘ్రకాలమున పేరులేకుండ నశించిపోగలదు.

అయినచో మఱి సాహిత్యమెట్లు నడుపవలయును అనుప్రశ్న ముదయింపకతప్పదు విచారింతము.

—వడ్లమూడి వేంకటరత్నము.


# ఆంధ్రభూమి

సచిత్రాంధ్రమాసపత్రిక.

ప్రతిమాసమున ౨౧-వ తేదిని ప్రచురింపబడును.

చందా వివరము.

| | |
| --- | --- |
| సంవత్సరమునకు | రు. 3-0-0 |
| అర్ధసంవత్సరమునకు | రు. ౧-౮-౦ |
| నాలుగు మాసములకు | రు. ౧-౦-౦ |
| విడిసంచిక | రు. ౦-౪-౦ |

# మణిమాల

## ఎడ్వర్డుచక్రవర్తి—ఇండియా

'ఇంగ్లండు దేశంలో ప్రభువు నామమాత్రుడనీ, మంత్రివర్గము చేసే ప్రతిపనికీ తలఊపి, సమ్మతులు ఇవ్వవలసినవాడని అనుకుంటున్నాము. అది చాలావరకు నిజమే. అయితే అప్పుడప్పుడు రాజుల అభిప్రాయాలకుగూడా ప్రాధాన్యము కలిగి మంత్రివర్గపుఅభిప్రాయాలు రాజులఅభిప్రాయాల ననుసరించి మారిపోవడం గూడాకద్దు హిందూదేశం విషయంలో.

ఎడ్వర్డుచక్రవర్తి హిందూదేశపు వ్యవహారాలలో ఎక్కువ శ్రద్ధతీసుకుంటూ ఉండేవాడు కాని ప్రపంచ ఖ్యాతిగలిగిన ఈ చక్రవర్తికి మనదేశం విషయంలో కించిత్తయినా సానుభూతిలేనట్లు మనకు తెలియనే తెలియదు. సర్ సిడ్నెలీవ్రాసిన ఎడ్వర్డుచరిత్రలో గల 'ఎడ్వర్డు—ఇండియా' అను ప్రకరణంలో సంగతులను బట్టి ఆయనకు మనదేశంమీదగల సవితితల్లిప్రేమా, మనదేశ వ్యవహారాల్లో ఆయన తీసుకున్న ప్రత్యేక శ్రద్ధా, శ్రద్ధతీసుకున్నప్పుడల్లా ఆయన అభిప్రాయాలే చలామణి అవుతూఉండడమూ వ్యక్తమవుతవి.

ఒకసారి అప్పుడు రాజప్రతినిధిగానున్న కర్జను ప్రభువు, సంస్థానాధీశ్వరులు తమ సంస్థానములనుండి విదేశములకు తఱచు తరలిపోవడమూ, ఎక్కువకాలము అక్కడ గడపడమువల్ల గలుగు చెడుగులనుగురించి ఎడ్వర్డుగారికి వ్రాస్తూ, అందులో కొందరినిగురించి తీవ్రమైనభాష ఉపయోగించాడుట. ఆ సమయంలో చక్రవర్తి 'తను స్వయముగాఎరిగిన కొందరు సంస్థానాధీశ్వరులను' గురించిన వాక్యాలకు తీవ్రమైన ఆక్షేపణ తెలిపి సంస్థానాధిపతుల గౌరవము నిలిపాడు. కాని ఆయనగూడా సంస్థానాధీశ్వరుల విదేశగమనాలు తఱచు అవుతున్నవనిమాత్రం అంగీకరించక తప్పింది గాదు. చక్రవర్తి సంస్థానాధిపతుల పక్షం మాట్లాడడం చాలా కొద్దివిషయము.

పత్రికాశాసనము కావింపబడ్డ పరిస్థితులు గమనించతగ్గవి. అప్పుడు రాజప్రతినిధి మింటోప్రభువు. ఇండియా మంత్రి (సెక్రటరీ ఆఫ్ స్టేటు ఫర్ ఇండియా) మార్లే ప్రభువు. ఇండియాలోఉన్న సర్వసైన్యాధిపతి పత్రికానిర్బంధశాసనము—కేవలం సైన్యానికి సంబంధించినంతవరకయినా—ఒకటి కావలెనని వ్రాశాడు. కాని మార్లేప్రభువు, మంత్రివర్గము దీనికి చాలా, ఏకగ్రీవమయిన ప్రాతికూల్యం చూపారు. ఆ సందర్భంలో చక్రవర్తి ఒకపత్రం వ్రాయించాడు. 'సర్వసైన్యాధిపతేగాక, రాజప్రతినిధి, ఆయన కార్యనిర్వాహకవర్గము గూడా కోరకోరకను తృణీకరించడములో గల గొప్ప బాధ్యతలను మంత్రివర్గము పూరుతున్నముగా తెలుసుకున్నారనే ఎంచుకొంటున్నాను. సైన్యానికి సంబంధించినంతవరకే పత్రికా స్వాతంత్ర్యాన్ని అరికట్టితే సైన్యములో లోపములుగలవని ఒప్పుకొన్నట్లు కావచ్చు, అందువల్ల తొందరలు ఎక్కువకావచ్చు కాబట్టి మొత్తముమీద (నియామకములేకుండా) పత్రికల స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి తీవ్రమైనశాసనాలు చేయవలసిన అవసరాన్ని గురించి జాగ్రత్తగా ఆలోచించవలెనని మంత్రివర్గము వారిని కోరుచున్నాను. పరజాతి నిరంకుశ ప్రభుత్వం క్రిందఉండే ఒకజాతి పత్రికాస్వాతంత్ర్యాన్ని సక్రమముగా ఉపయోగించదు. మనకు లోగడకలిగిన కష్టాలకు రాజద్రోహకరములైన పత్రికలే కారణము' అని. తుదకు చక్రవర్తిసలహాలే సంపూర్ణంగా అంగీకరించ బడ్డవి.

రాజ ప్రతినిధియొక్క కార్యనిర్వాహకవర్గంలో ఒక భారతీయుణ్ణి నియమించడం విషయంలో ఎడ్వర్డు చక్రవర్తిభావాలు చాలా ఆశ్చర్యాన్ని కలుగచేస్తవి. బ్రిటిషు మంత్రివర్గము పైసూచన ఒప్పుకుంది. మార్లే ప్రభువు సింహాగారి పేరుగూడా సూచించారు. ఈ

సూచన మింటోప్రభువు సమ్మతి పొందింది. ఆ సందర్భంలో మార్లేకు చక్రవర్తి వ్రాసిన ఉత్తరంలో 'ఈ విషయంలో తన అభిప్రాయం మార్చుకోలేనందుకు చక్రవర్తి చాలా విచారపడుతున్నాడు. దీన్నిగురించి మార్లేప్రభువు విచారించినంతమాత్రం ఆయనా ఆలోచించారు. కాని బ్రిటిషు పరిపాలనక్రింద హిందూ సామ్రాజ్యాన్ని నిలుపుకోవడానికి ఈ ప్రయత్నం చాలా అపాయం కలుగజేస్తుందని ఆయన అభిప్రాయపడుతున్నారు. దానికిగల కారణాలు ఇండియామంత్రికి, రాజప్రతినిధికి బాగా తెలుసు. కాని రాజప్రతినిధి ఒత్తిడివల్లనూ, మంత్రివర్గమువారు ఈ సూచనను ఏకగ్రీవంగా సమ్మతించిన తీర్మానమువల్లనూ తమకు బొత్తిగా ఇష్టములేకపోయిననూ ఈ విషయమున వారికీ ఒప్పుకోనక తప్పినదిగాదు. కాని ఈ నూతన మార్గమునందు వారి కేమాత్రము సానుభూతిలేదని అందరికీ తెలియావలెనని వారు కోరుచున్నారు. ఈ పద్ధతివల్ల భారతదేశములో గల ప్రభుత్వము ఇబ్బంది పడకుండుగాక! అంతకన్న రాజుగారేమియు చెప్పలేరు. మార్లేప్రభువున్నూ, రాజప్రతినిధిన్నీ ఎవరో సింహాఅనే ఆయన్ను ఒకాయన్ను సిఫార్సుచేస్తున్నారు గనుక ఆయన నియామకము అంగీకరించడముకంటె వారికి వేరేమార్గము లేదు. ఆయన శక్తివంతుడు, విశ్వాసపాత్రుడు అగుగాక యని వారు ఆశించుచున్నారు' అని వ్రాశారు.

మార్లేప్రభువు ఈ విషయాన్ని పునః ప్రస్తావిస్తూ 'విక్టోరియామహారాణి వాగ్దానాన్ని నిర్వర్తించుటవల్ల తమయందు భారతదేశీయులయిన తమ ప్రజలకు ప్రేమ అతిశయించును' అని వ్రాస్తే దానికి ప్రత్యుత్తరముగా 'ఇది నా ఉత్తరమునకు సమాధానమనుకుంటాను. విక్టోరియామహారాణిపేరు ఈ సందర్భంలో ఎందుకు తీసుకొనిరావలెనూ, ఆమెకూ, ఈ విషయానికి ఏమి సంబంధమున్నదో నాకు బోధపడడంలేదు. ఆవిడ ఈ పనిని హర్షించేదని నాకు నమ్మకం ఏమాత్రం కలగడంలేదు. నేనుమాత్రం ఈ ఆక్షేపణీయమయిన కాగితంమీద దస్కతుచేయవలసివచ్చింది.' అని కోపంగా ముగించాడు.

ఈ సందర్భంలోనే చక్రవర్తిగారు రాజప్రతినిధి మింటోప్రభువుకు రెండుఉత్తరాలు వ్రాశారు. ఒకదాంట్లో 'నీవుచెప్పిన కారణాలవల్ల నీతోనూ, ఇండియామంత్రితోనూ వ్యతిరేకించ దలచుకోలేదు. కాని ఈ విషయంలో నేనూ, నా కుమారుడు (జార్జిచక్రవర్తి) కూడా ఈలాంటి పూర్వకాలపు అభిప్రాయాలనే కలిగిఉన్నాము. ప్రస్తుత హిందూదేశంలో ఉండే పరిస్థితులలో కార్యనిర్వాహకవర్గపు సభలలో అనేక రహస్యవిషయాలు చర్చింపబడుతుంటే అవి ఆ దేశీయుడికి తెలియడం భావ్యంకాదు. హిందువుణ్ణి ఈ ఉద్యోగానికి నియమించినతర్వాత మహమ్మదీయులు ఇదే కోరిక కోరవచ్చు. ఒకవేళ తీరా దేశీయుణ్ణి నియమించినతరువాత మనం అనుకున్నట్లు జరగకపోతే తిరిగి వీళ్ళను వదల్చుకోవడం చాలా కష్టం. దేశీయుడు ఎంత తెలివిగలవాడయినా, ఎంత రాజభక్తి పరాయణుడైనా, మనకు అపకారంచేయకుండా ఉంటాడనీ, సంగతిసందర్భాలు స్వదేశీయులకు చెప్పకుండా ఉంటాడనీ నమ్మకంలేదు. మీరుచెప్పిన మాటలవల్ల ఈ నూతన పద్ధతికి నేను ఒప్పుకున్నా, నా అభిప్రాయం రికార్డులో ఉండవలెనని ఏర్పాటుచేశాను. మీరుచేసినపనికి పశ్చాత్తాప పడవలసిన అవసరము రాకుండుగాక అని కోరుచున్నాను.' అని వ్రాశాడు. రెండవదాంట్లో 'ఈ పద్ధతి భారతదేశంలో బ్రిటిషు పరిపాలనకు చాలా అపాయకరమనే నా అభిప్రాయము మారలేదు. ఆ దేశ పరిచయం, సంబంధముగల అనేకులు నా అభిప్రాయాన్ని సమర్థిస్తున్నారు. ఇండియామంత్రి రహస్యవ్యవహారములు భారతీయులకు తెలుస్తున్నవనీ, మీ ఆఫీసులో రహస్యములైన కాగితాలు భారతీయులే సాఫు వ్రాస్తున్నారనీ మీ ఉత్తరమందున్నది. ఈ విషయం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలుగజేస్తున్నది. ఇది చాలా ప్రమాదకరమైన అలవాటు. అది ఆలా ఇంకా జరుగుతూఉండడం ఆశ్చర్యం. ఒక దేశీయుణ్ణి ఇప్పుడు నియమిస్తే ఆయనస్థానంలో తిరిగి భారతీయుణ్ణే నియమించవలసిన అవసరం—సూత్రంలో లేకపోయినా ఆచారంలోనైనా—ఏర్పడుతుంది. మనో

నిగ్రహంగల వాడైతేనేతప్ప ఈ ఆచారమునుండి రాజప్రతినిధి తప్పించుకోలేడు. ఈ నియామకాన్నిచూచి మహమ్మదీయులుగూడా తమరిలో ఒకర్ని—సిన్హా తరువాతనైనా—నియమించవలసినదని కోరడం న్యాయమేగదా!' అని వ్రాశాడు.

వీనివల్ల ఎడ్వర్డుచక్రవర్తి భారతీయులయందు ఏమాత్రం సానుభూతిలేనివాడని తేలుతుంది. కలకత్తా హైకోర్టులో ఎడ్వొకేటు జనరలుగా పనిచేసే సిన్హాగారి పేరు ఆయనకు తెలియకపోవడం మరొక ఆశ్చర్యం. దీనినిబట్టి హిందూదేశాన్నిగురించీ, హిందువులనుగురించి ఆయనకుండే జ్ఞానం మనకు తెలుస్తుంది.

—'హిందూస్థాన్ రివ్యూ'

*　　*　　*

## విక్రమశిలావిశ్వవిద్యాలయము

ప్రాచీనకాలమునందు భారతదేశములో విజ్ఞాన సముపార్జనమున కనువగు విద్యాపీఠములు పెక్కులుండినవి. వానిలో విక్రమశిల పేరుప్రతిష్ఠలం దితర విద్యాలయముల కెంతమాత్రమును వెనుకబడియుండలేదు. దీనిని తొమ్మిదవశతాబ్దమునందు పాలవంశసంభవుడగు ధర్మపాలమహారాజు ప్రతిష్ఠించెను. అప్పటినుండియు ఆ విశ్వవిద్యాలయమునకు తగినటి వ్యయభారమంతయును పాలవంశీయ నరపాలురే వహింపసాగిరి.

ఆ విశ్వవిద్యాలయమునకు ప్రధానద్వారము కడు నిరుపమాన ప్రజ్ఞావైభవసంపన్నులని పేరు ప్రఖ్యాతులు గాంచిన దీపంకర, నాగార్జునులచిత్రములు నెలకొల్పబడి ప్రవేశకులకు స్వాగత మొసంగును. ఆ ద్వారము గడచి లోనికిజనినపిదప 'విజ్ఞానభవనము' గోచరమగును. ఆ కట్టడమున ఆరుద్వారములు: ఒక్కొకటి యొక్కొక విద్యాలయమునకు ప్రవేశ మొసంగును. విద్యార్థులను పరీక్షించి లోనికి బోనిచ్చుటకయి శేముషీసంపన్నులగు ద్వారపండితు లాద్వరచ్చట గూర్చుండియుందురు. మహారాజుల కృపావలోకనములకు పాత్రమగుటచే ఆ విశ్వవిద్యాలయమునకు గల సౌకర్యములు వర్ణనాతీతములు. విద్యార్థులకును ఉపాధ్యాయులకునుకూడ వసతిగృహము లందే నిర్మింపబడెను. అచ్చటనే వారి కన్నపానములును, జపతపాదులకు సదుపాయములను సమకూర్చబడును. శిష్యులుకాని గురువులుకాని జీవితనిర్వహణమున కేచింతయులేనక తమతమ విద్యాశాస్త్రసంగతులందు నిమగ్నులై తదేకదీక్షతో కార్యములు నెరవేర్చుకొనుటకు సావకాశము పుష్కలముగ లభించియుండెను. ఆ విద్యాలయమున కలంకారప్రాయముగ పెద్ద పుస్తకభాండాగార మొకటి వెలసియుండెనని తెలియుచున్నది. ఆ కాలమునందచ్చటి విద్యార్థులు మూడువేలును, శిక్షకులు నూటతొమ్మండుగురు నుండిరి.

అచ్చటి విద్యగ అచుటనై ముఖ్యముగా బౌద్ధధర్మమునకు సంబంధించిన శిక్షనుబడయుటకై, 'తిబ్బెతు' దేశమునుండి యెందఱో విద్యార్థు లరుదెంచుచుండిరి. భారతీయ విద్వాంసులుసైతము ప్రయాణకష్టములను సరకుజేయక దూరదేశములకేగి విజ్ఞాన వ్యాపనముగావించిన దినములవి. ఈ విశ్వవిద్యాలయపు పండితులనేకులు త్రివిష్టపమున కరిగి యాదేశభాషలో గ్రంథములు వ్రాసి యచ్చటిజనుల అజ్ఞానమును పారద్రోలి యొనరించిన మేలు ప్రశంసనీయము. వారిత్యాగము, నిరుపమానము: మతసారస్వతములకు గావించిన సేవయమూల్యము. ఆ మహాపురుషులలో కొంతమందినిగురించి సంక్షేపముగ నిచట వివరింపబడును.

ఆచార్యజేతారి (940—980):— ఇతడు విక్రమశిలావిశ్వవిద్యాలయమునందు జ్ఞానమునభ్యసించి మహాపండితుడని విఖ్యాతిజెందిన విద్వాంసుడు. ఇతడు తంత్రశాస్త్రమును సూత్రములనుగురించి లిఖించిన గ్రంథములు సుమారు నూరు త్రివిష్టపభాషయందు పరివర్తితములయ్యెను. రత్నాకరశాంతి యితనిశిష్యుడే.

ఆచార్య రత్నాకరశాంతి:—ఇతడు కాశ్మీరదేశనివాసి. ముప్పదియారవ సంవత్సరమునందే మంత్రశాస్త్రములను, బౌద్ధసూత్రములను పఠించి యశేషపాండిత్యమునగడించి యా సూరివరుడు విక్రమశిలావిద్యాలయమునందు ద్వారపండితుడుగ నియమితుడయ్యెను. కొంతకాలమున కితడు కాశ్మీరాది రాష్ట్రములు తిరిగి త్రివిష్టపముజేరుకొని బౌద్ధమతసేవయందు తన జీవితశేషమును గడపెను. సంస్కృతమునందితడు

రచించిన పుస్తకములు పదునాల్గు! వానిలో 'యుక్తి ప్రయోగము' అనునది తర్కశాస్త్రమునకు సంబంధించినది.

ఆచార్య అభయంకరగుప్త :—నేటికి సైతము త్రివిష్టపదేశవాసు లితని నొక దివ్యపురుషునిగ పూజింతురు. ఇతడు వ్రాసిన స్వతంత్ర గ్రంథము లిరువదియారు: అనువాద మొనరించినవి.

జ్ఞానశ్రీమిత్రుడు :—ఇతడు వంగదేశస్థుడు. చాల కాలము విక్రమ శిలావిద్యాలయములో నాచార్యపదవి నధిష్ఠించెను. పిదప త్రివిష్టపమునకేగి యాభాష నభ్యసించి తర్కశాస్త్రగ్రంథము లనేకము లాభాషలో వ్రాసి కీర్తిబడసెను.

శాక్యశ్రీభద్రుడు :—ఇతడు విక్రమ శిలావిశ్వవిద్యాలయమునకు ప్రధానాచార్యులలో తుదివాఁడు. జన్మస్థానము కాశ్మీరము: తర్కశాస్త్రమునం దద్వితీయుడు. ఇతడు సంస్కృతమునందు గ్రంథసప్తకమును రచించి త్రివిష్టప భాషలోనికి రెండుపుస్తకములు అనువదించెను.

విక్రమశిలా విద్యాలయమునందు నేర్పబడెడి ప్రధాన విద్య తంత్రశాస్త్రము ఈవిద్యలో నుత్తీర్ణులగుట కెంత దూరమునుండియో భిక్షుకులును విద్యార్థులును శ్రమల కోర్చి వచ్చుచుండెడివారు. దాని కుపాంగములై తర్క వ్యాకరణాదులు దనరుచుండెను. ఈవిద్యాలయము క్రమక్రమముగ వృద్ధినొంది శిష్యకోటుల నెందఱినో యాకర్షించి రాజపోషణముచే నభ్యుదయము గాంచెను దీని యౌన్నత్యముతోఁబాటు నళంద విద్యాలయమున కవసానదశ సమీపించెను.

ఆనాటి భారతీయ జ్ఞానవాహిని దుర్గమ పర్వతశిఖరములనుదాటి, యపాయకరములగు యెడారులను తరించి, విదేశములకుగూడ అవ్యాహతముగ ప్రవహించిన తెఱంగు విస్మయావహము. దారులా, భీకరవన మృగ సంకులములు: ప్రయాణమునకు సదుపాయములా, పూజ్యము: అట్టి విషమపరిస్థితులు సైతము భారత విజ్ఞాన ప్రసారమున కంతరాయము గల్పింపలేక పోయెను. నళంద, విక్రమశిల, ఓదాంతపురి, తక్షశిల - యీ విశ్వవిద్యాలయము లొనరించిన మహత్తర శ్రేయము వర్ణించుట కలవియగునా? ఆపవిత్ర విద్యాసంస్థలన్నియును కాలగర్భమున లీనమైనవి: జ్ఞానభిక్షనొసంగి యన్యదేశములను పునీతముగావించిన భారత మాత నేడు పాశ్చాత్య విద్యావ్యామోహమునందు మునింగి తనమునుపటి జ్ఞానవైభవమును మఱువవలసిన దినములు ప్రాప్తించెను కదా!

—గోడావరి సత్యనారాయణ, బి.ఏ

* * *

## వర్ణములు

జన్మముచేతనే వర్ణము సిద్ధింపనిచో వర్ణములనునవి ఏర్పడియేయుండవు. గుణకర్మలను బట్టిగాని వృత్తులను బట్టిగాని వర్ణమేర్పడునెడల నది క్షణక్షణము మాఱుచునే యుండును. అప్పుడు వర్ణములనునవి అనేకములుగానే యేర్పడియుండును. ఒకేపురుషు డొక్కజన్మయందే అనేకవర్ణములను బొందినవాడగును. అట్టి స్థితిలో ఈ పురుషుడీ వర్ణమువాడు అని చెప్పుకొనుటట్టి అవసరమట్టేయుండదు. వృత్తినిబట్టి వర్ణముగల్గునని చెప్పినచో ఒకేవృత్తి ఒకనియందు దుత్కృష్టముగాను వేరొకనియందు నికృష్టముగాను ఉండును. ప్రపంచానుభవమందిది నిదర్శనమేను. వర్ణముస్థితి దీనివలన దెల్లముకాదు కదా. అప్పుడు వర్ణమునునది ఉండినను లేకుండినను గూడ ప్రయోజనముండనేరదు కదా. గుణములనుబట్టి వర్ణముల నేర్పఱచుటయు నసంభవమేయగును. శ్రీ గాంధీగారు, మాళవ్యాగారు, అంబేట్కరుగారు మొదలగు ప్రముఖులుగలరు. మఱియు కాంగ్రెస్సునాయకులు, హిందూమహా సభానాయకులు, జస్టిస్‌పార్టీవారు, శాసనసభవారు మున్నగు ప్రముఖులుగలరు. వీరందఱును ఉత్కృష్ట గుణవంతులే గాని ఆశయములు (ధర్మములు) మాత్రము వారికి భిన్నములుగనున్నవి. వారి ప్రవర్తనలుగూడ నొక్కొక్కరి నొక్కొక్కవిధముగా నున్నవి. అట్టివారికి వర్ణములెట్లు నిర్ణయింపవచ్చును. కర్మలనుబట్టి వర్ణమన్నచో నదియు నసంభవమేను: ఉత్కృష్టజ్ఞానవంతుడగువాడుగాని బ్రాహ్మణుడుగాజాలడు అనినచో

కొన్ని సంస్కారములు సదా ఆచరణశూన్యములగును. బ్రాహ్మణు నీరీతిని సంస్కరింపవలయును అనియున్న జాతకర్మ నామకరణాదిగ వివాహాంతమువఱకు జరుగు సంస్కారము లేరికినిగూడ గావింప వలనుపడదుకదా. అట్టి సంస్కారములయందు నమ్మికలేనివారికి వర్ణములతో నేమి ప్రయోజనముండును. అందఱును అన్ని కర్మలు గావింపవచ్చును అనునప్పుడుగూడ వర్ణములతో బ్రయోజనములేదు. ఇంకొకవాదము దీనివిషయమై గలదు.

‘బాల్యమున సామాన్యముగ అజ్ఞానావస్థలో నుండురు గనుక దానికి శూద్రదశయనియు, పైన యుక్తవయస్కులై వివాహాది కార్యముల నిర్వర్తించుకొని కుటుంబ పోషణార్థము పశుపాలన వాణిజ్యాది వృత్తులవలంబించుట వైశ్యదశయనియు. అనంతరము స్వార్థరహితులై గ్రామసేవగాని దేశసేవగాని యొనర్చుట క్షత్రియత్వమనియు, ఆపైన సంసారకాంక్షాదికముల వీడి వీతరాగుడై మోక్షముకొఱకు ఈశ్వరసేవ జేయుట బ్రాహ్మణదశయనియు, చాతుర్విధవర్ణములు లేవనియు పైనాల్గుదశలే మానవుని దశలనియు’ శ్రీదుగ్గిరాల రాఘవచంద్రయ్య సచ్ఛాస్త్రిగారు అభిప్రాయమును వెల్లడించిరి (ఆంధ్రభూమి. శ్రావణమాసము)

ఇట్లు చెప్పినయెడల ఒకేపురుషున కొకేమారు రెండు మూడు దశలు సంప్రాప్తము లగుచుండును. ఒకడైను వివాహమాడి వెంటనే గర్భముగావించి దేశసేవయందు ప్రవేశించి జైలున బంధింపబడి ఈశ్వరధ్యానమున నున్నవారు ఇప్పుడు గలరుగదా. వారు ఏదశవారని చెప్పవచ్చును. ఆట్టిపరిస్థితులం దట్టిదశావిభాగమం దేమి భావముండును. మాయూరిలో నొకమాలవాడు గలడు. వాడు సన్యసించి ‘ఈశ్వరుడా! నాకు మోక్షమీయవా’ అని కేకవేయుచు ఈశ్వరలింగమును గట్టిగా మోదినాడు. వాడు బ్రాహ్మణదశలోనివాడేయగునా? (అచ్చటనున్న జనము ఆమాలవాని వ్యాపారమును జూచి ఆవలకు బంపివేసిరి.) వర్ణములనునవి జన్మతో గలిగినవని శాస్త్రములందుగలదు. అట్లుగనే చిరకాలము నుండి అనుభవములో నున్నవి. ఉన్నదానిని నమ్మక ఇప్పటివా రెన్నియోవిధముల తమస్వభావములను వెలిబుచ్చుచున్నారు. బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థము, సన్యాసము అని నాలుగు ఆశ్రమములు మనశాస్త్రములందు చెప్పబడియున్నవి. వానిని సంఘసంస్కర్తలు నమ్మువారునుగారు, నమ్మనివారునుగారు దేశమా! ఇట్టిస్థితికి వచ్చితివిగదా. కాలమా! నీ కెంత మహిమగలదు. వర్ణమా! అమృతతుల్యమగు అన్నము కూడ ఒకప్పుడు రుచింపదుగదా.

—కాళూరి వ్యాసమూర్తి.

# గులాబి

నిన్నటి సాయంతన మిూ వున్నది లేనిదిసి జాడయు తెలియ దీట్లో
కన్నులు పండ కులుకెదవు వన్నియలాడి యెటనుండి వచ్చితి వమ్మా ॥

ఱెక్కలురాని పిట్టవలె రేకులమధ్యను చిక్కువడ్డ నీ
చక్కదనంబులుఁ గనులు చల్లగవిప్పగ లేక బెంగచే
గ్రుక్కఁబ్రమింగి దీనవయి గూడున నుండియె భ్రాంతితోడ న
ల్దిక్కులుఁజూచి సిగ్గున విలీనము జెందగ నిన్నఁజూచితిఁ ॥

గర్జించు మేఘాల గాంభీర్యమున కోడి
చాటుమాటుల డాగి చంద్రు డగిగె
కనుగవ మిఱుమిట్లు గొనునట్టి మెఱపులఁ
దారలు భయమొంది తలుపుమూసె

చలిగాలి వీవగన్ మెలగుట కష్టమై
దినరాజు పానుపు డిగ్గకుండె
ముసురుపట్టుటచేత ముల్కులు గురిదప్పి
మదనుడు చల్లగ గదుల దూరె
ఇట్టి కడుభయంకరమైన యట్టి రేయి
సొగను చూపుల జగమెల్లఁ జూరగొనెడి
నిన్ను బోలెడి ధన్యాత్మ కన్ను విప్ప
గలుగు శుభలగ్న మొండేమి కల్గెనమ్మ ॥

ముసుగును గప్పు విడిపోయిన యింటను జిక్కినట్టి యా
కుసుమశరుండు తమ్మువిడి గ్రుమ్మరు నెక్కడికేనటంచు దా
కొసరుచు ప్రాణనాథులనుఁ గూడెడివేళల యేలతాంగినీ
ముసిముసి నవ్వులన్ మురియు, మోహములెంచితపించు నన్వినా ॥

రవి శయ్యం దిగిరాదు మేఘతతి గర్వంబూని సంధ్యోపరా
గ విశేషంబులనైన భూమిపయి సోకం జూడలేకుండె రా
దు విహంగంబొకటేని గూడువిడి యుత్సాహులౌ వారి కే
మి వియోగార్తులపాలి దిక్కగుచు నున్మీలించితే పుష్పమా ॥

దేశము కాని దేశముల దీనతగుందుచు నెట్లు జూచినన్
దోసములెంచి కావలయు దొంగలరీతిని తోయజాక్షులున్
మూసినతల్పుచాటులను ముద్దుముఖంబుల దాచినారు నీ
కేసియు నైనఁజూచి సుఖింపగనిమ్ము గులాబిపుష్పమా ॥

ఎన్నగరాని చక్కదనమేర్చి రచించి కులాసజెందు నీ
కన్నెతనంపుఁ జోద్యములు కాననగాచిన వెన్నెలాయె; దా
కన్నులఁగాంచు పుష్పముల కమ్మగఁ గొప్పునఁబెట్టుచుండు; మా
వన్నియలాడి నిన్నుఁగన వాసికి దెచ్చెడు నీదు సొంపులన్ ॥

తళతళలాడు చెక్కిళులఁ దమ్ములపాకుల రక్తిమంబులన్
గలకల లాడు నోష్టమునఁ గాంతులనీనెడు సోయగంబులన్
లలిత గులాబియుద్దియును నాసతిగర్వరసోక్తులెంచి నీ
సలలిత రూపమేఁగనిన జాయనుగాంచిన సంతసంబగున్ ॥

గజముఖుఁ జేతువాయనిన గమ్మరి తత్పితఁ జేసి ప్రజ్ఞకున్
భుజములుఁ గొట్టినట్లు; మృదుపుష్పసమాంగుల చెక్కిటిం రసం
బు జవుకళింప ముద్దిడినఁ బొందగలట్టి సుఖంబులెంచుచున్
నిజమున కొక్కపూవువగు నిన్నని పొంగుట లెంతవెఱ్ఱిరో ॥

—మిత్తింటి నరసింహమూర్తి, బి.ఏ.,బి.యల్.

జిజ్ఞాస

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొనఁ పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.

మీమాంస

### 31. దయ్యములు

దయ్యములు కలవా? లేవా ? ఉన్నచో అవి మనుష్యులను ఆవేశించుట ఎట్లు ? ఎందులకు ? చనిపోయినవారు దయ్యము లగుదురా ? నిదర్శన మేమి ? దయ్యములు మనుష్యులను బాధించునటుల వార్తాపత్రికలు కూడ చెప్పుచున్నవి. దీనికేమి ఉత్తరువు. దయ్యములెటుల జీవించును ?

—చందా వెంటయ్య.

### 32. ఆంధ్రుల వేషము

ఆంధ్రుల వేషము ఏది ?

—వ. వేంకటరత్నము.

### 33. సంశయము

శ్లో. కాచస్త్రీ మృదుపల్లవై ర్విరచితే
శయ్యాతలే శాయినీ
సఖ్యావీచిత తాళవృంత పవనా
బాలా ముహుర్నిందతి
రామం, వానరపుంగవం, మధురిపుం
మారస్య మార్వీరవం
కుంభోద్భూత మహామునిం, పురహరం,
రాహుం, రవేస్సారధిం.

ఇంతలి స్త్రీ ఏయేకారణముల్లచే వీరిని నిందించుచున్నది. ఇందఱిని ఒక్కసారిగ నిందించుటకు గల హేతువు లెవ్వి ?

—తటవర్తి సూర్యనారాయణమూర్తి.

### 28. సౌందర్యవర్ధకములగు నగలు.

బంగారునగలకంటె రాళ్ళనగలు ఎక్కువసౌందర్యవర్ధకములనుట సత్యమని ఒప్పుకొనకతీరదు. అందము ముఖ్యముగా అవయవసూర్తిమీదను, ముఖవర్చస్సుమీదను ఆధారపడియుండును. మనదృష్టిముందు ఎదుటవారి అవయవసూర్తిమీదకు కంటె ముఖకళమీదికి పారును. అందమునకు ముఖకళ ప్రధానమైనది. దుద్దులు, ముక్కుపుడక, బేసరిమొదలగు రాళ్ళనగలు ముఖముయొక్క సహజసౌందర్యమునకు మెఱుగుపెట్టును. కావుననే మెడలోనుండు కాసులపేరు, కంటె మొదలగువానికంటె ముఖముపైనుండు దుద్దులు, బేసరి మొదలగునవి హెచ్చు సౌందర్యవర్ధకములుగా నుండును. ఈకారణముచేతనే బంగారునగలు ఎక్కువగ ధరించు ఆంధ్రస్త్రీలకంటె రాళ్ళనగలు హెచ్చుగ ధరించు అరవస్త్రీలు ఎక్కువ అందముగ కనిపింతురు.

—కె. రాజారావు.

బంగారునగలకంటె రాళ్ళనగలు ముఖకళను పెంపొందించుననుట నేనును అంగీకరింతును. కాని అంతమాత్రమున బంగారునగలు ఎక్కువగ ధరించు ఆంధ్రస్త్రీలకంటె రాళ్ళనగలు ఎక్కువగ ధరించు అరవస్త్రీలు హెచ్చు అందముగ కనిపింతురనుటకు నేను సమ్మతింపజాలను. అరవలలో తక్కువజాతి స్త్రీలుకూడ రాళ్ళనగలు (ఖరీదు తక్కువవేయగుగాక) ధరింతురు. కాని వారి మొగములుచూడ చాల అసహ్యముగనుండును. కారణము వారిదంతములు తాంబూలముతో గారబట్టిన నల్లబడి వికార్యముగనుండుటయే రాళ్ళనగలు లేకపోయినను ఆంధ్రజాతి స్త్రీలు తమ దంతమరీచులతో చాల అందముగనుందురు. దీనినిబట్టి ముఖమునందు ఎట్టిలోపమును లేనప్పుడే రాళ్ళనగలు రాణించుననియు, రాళ్ళనగలు లేకపోయినను దంతము అందు ధావళ్యము పెదవులయందు రక్తిమ ఉన్నచో ఆ ముఖమే హెచ్చు అందముగనుండుననియు, సహజసౌందర్యమున పైచేయిగనుండు ఆంధ్రస్త్రీలు రాళ్ళనగలుకూడ ధరించుచో అరవలకంటె ఎక్కువ అందముగనుందురనియు నిర్ణయింపవలసియున్నది.

# గాంధర్వము

(ఏకాంకరూపకము.)

ఉదయము అయిదుగంటల వగ.

[బ్రాహ్మణవీధిలో తూర్పుముఖంగా పెద్దమేడ; సావిట్లో విశాలమైనగది. సావిట్లోనుంచి గదిలోనికి వొక ద్వారమూ గదిలోనుంచి వెనక చీడీలోనికి వొకద్వారమూ వుంటాయి. మేడకువెనక యిరవై మువ్ఫై గజాలదూరాన వంటలకూ భోజనాలకూ దగిన సదుపాయాలతో నిర్మింపబడిన పెద్ద హాలు. మేడకూ వెనకటి వసారాకూ మధ్య విశాలమైన వాకలి, వాకట్లో మధ్యనుంచి వెనకటి వసారాచెంతకు పాలరాతిపలకలు అమర్చబడిన మార్గము. మార్గమున కిరుపక్కలా రకరకాల పువ్వుల మొక్కలూ క్రోటన్సుమొక్కలూ వుంటాయి. వాకట్లో వొకపక్కనుంచి మాధవీలత వొకటి పందిరిపై ప్రాకి మార్గము మధ్యను గుబురుగా అల్లుకునివుంటుంది. దానికింద నున్నని పాలగచ్చుతిన్నె చూసిన వారికి పని లేకపోయినా తప్పక వొకసారి కూచోవాలని బుద్ధిపుట్టిస్తూవుంటుంది. దానికెదురగా దృఢమైన టేకుబెంచీ, దానికిరుపక్కలా చిత్రవస్తు ప్రదర్శనశాలలో వుండడానికి తగిన నాలుగైదు కుర్చీలూ వుంటాయి. వెనకటింటి చీడీఅంచున నరసమ్మ సుమారు నలభై అయిదేళ్ళ పితంతువు కూచుని అప్పుడే కడుగుకున్న ముఖాన్ని పైట చెరగుతో వొత్తుకుంటూ వుంటుంది. ముందరింట్లోనుంచి సీతారామ సుమారు యిరవై యేళ్ళ అమ్మాయి ఆసెుకేసి హడావుడిగా వస్తూవుంటుంది]

సీతారామ (ఆదుర్దాతో):—అమ్మోయి!

నరసమ్మ (ఉలికిపడి):—ఏమిటీ...?

సీ (గుండెబాదుకుంటూ):—అమ్మ! అమ్మ...! ఏంఘోరణం! ఏంఘోరణం!!

న (ఆతృతతో):—ఏమిటదీ?—

సీ:—ఎంతపనికి సాహసించింది!

న (చిరాకుతో):—అబ్బా!... ఏమిటీ అదీ— సరిగా చెప్పకా?

సీ:—ఏంచెప్పనూ! సిగ్గు సిగ్గు...మీకోడలు—లేచి—పోయిందిటా!

న (అదిరిపడి):—ఆఁ? ఏ—మి—టీ...! ఎవరిమాటా నువ్వంటున్నదీ—?

సీ:—ఎవరిమాటా? మీ కోడలి మాటే! అన్నయ్య పెళ్ళాం మాట...మా వొదినగారి మాట!!

న (కొంచెంకోపంతో):—ఛీ, నోరుముయ్యి—ఏమిటా యెగతాళీ!

సీ:—ఎగతాళి! ఎగతాళీ యేమిటీ! నిజం చెబుతూవుంటే!

న (గాభరాపడి):—ఆఁ...! నిజమే! ఒట్టే!! ...నన్ను చంపుకుతిన్నట్టే!!!

సీ:—నిజమేనమ్మా! నీతో నాకు హాస్యమేఁమిటీ?

న:—ఎవరు చెప్పారూ?

సీ:—ఎవరు చెప్తారూ? అన్నయ్యే చెప్పాడు.

న:—ఎవడితోనూ?

సీ:—ఎవడో నారాయణ—

న:—అయ్యో! ఆ వెధవతోనే? ఎంతపనికి నెట్టుకుంది? ఛండాలురాలు! నే మొదట్నించీ అనుమానిస్తూనే వున్నాను—యిదెల్లాగూ తిన్నగా మనవదని. లేకుంటే కాపరంచేస్తున్న ఆడదానికి సిగ్గూ—అభి

మానం—యేమీ లేకుండా ఆ పరాయివెధవతో ఆ షికార్లూ, ఆ స్నేహం, ఆ నవ్వులూ, చూపులూ... అయితే యెప్పుడు దాటేసిందీ?

సీ:—రాత్రి యే వొంటిగంటప్పుడో నట్టూ!

న:—అర్ధరాత్రే! అన్నట్టు—ఆ నగలు?... అయ్యో! వొంటివొంటేడు నగలు!— కొంప ముంచేసింది! ఇంకేంవుందీ..? సంసారం ధ్వంసంచేయాసింది! ఏం దారి? డెబ్భై యెనభై తులాల బంగారం—ఆ పాళ్ళ సరుకులూ—అన్నీ నష్టేట్లో కలిసినట్టే! అయ్యయ్యయ్యో! ఏంసాధనం? వీడింకా యేంచేస్తున్నాడూ?—ఆ గదిలోని—?

సీ:—ఏదో వుత్తరం రాస్తున్నాడు—అదిగో వస్తున్నాడు—

[ధర్మారావు సుమారు యిరవై అయిదేళ్ళవాడు. దేహచ్ఛాయ కొంచెంనలుపు. సామాన్యమైన పొడుగు; అయినా లావు మీద కొంచెం పొట్టిగా కనిపిస్తాడు. ముఖం ప్రబంధకవులు వర్ణించినట్లూ గుండ్రంగానే వుంటుంది. ఆముఖానికి కళ్ళు కొంచెం చిన్నవిగానూ నోరుకొంచెం పెద్దదిగానూ కనబడుతూ వుంటాయి. అతని మనోభావాల నెన్నడూ అతడు వెలిబుచ్చడు. అయినా వాటిని కప్పిపుచ్చడానికి ప్రయత్నించినట్టు కూడా కనబడడు, అందంగా కనబడాలని లోన ఎంతప్రయత్నిస్తున్నా పైకిమాత్రం ఆ తలంపే లేనట్టు యెంతో ఉపేక్షాభావం నటిస్తాడు. నలిగిన అతనికళ్లూ, రేగినజుట్టూ రాత్రల్లా అతడు నిద్రలేకుండా దుఃఖించినట్టూ రూపిస్తాయి. అతడు తలకొంచెం వంచుకుని జోగుతూ నెమ్మదిగా తల్లిచెంతకు వస్తాడు.]

న (కుమారునుద్దేశించి):—ఏంనాయనా! చూశావా?...ఎంతవరకూ మునిగిందో! దీనితరహా చూస్తే యేం బాగులేదు; ఎప్పుడో నాడు దగా చేశాటట్టూ వుందని నీ కెన్నిసార్లు చెప్పాను? నామాటేం వినిపించుకున్నావా? గడ్డిపరకంత ఖాతరీచేశావా! దాని స్వభావం నీ కర్థంకాదు. అదట్లాంటిమనిషి కాదన్నావే! ఎట్లాంటి మనిషో యిప్పుడర్థమయిందా అబ్బాయికీ! ఆ నగలన్నీ నష్టేట్లో కలిసినట్టేనా? వాటికి నీళ్ళు వారేనా?

ధర్మారావు (శుష్క కంఠంతో):—ఏమిటా ఖంగారూ? నగలెక్కడికి పోయేయీ?

న (విస్మయంతో):—ఆఁ! పోలేదూ! వున్నాయీ! దాచావా?

ధ:—నే దాచలేదు. కాని—

న:—కాని—? మరెవరు దాచారు? ఎవరు దాస్తారూ? ఇంకా వుంటాయనే నమ్ముతున్నావు!

ధ:—నమ్మకేంచెయ్యనూ? కళ్లారా చూసి—

న (ఆశ్చర్యంతో):—చూశావూ! ఎక్కడ చూశావూ? కల్లోగాని కాదుగదా?

ధ:—కాదు—గాని కల్లోకూడా అటువంటిది చూస్తానని యెన్నడూ అనుకోలేదు—

న (ఆతృతతో):—ఎందుచాత?... ఏమిటీ... చెప్పు.

ధ:—వినుమరీ—అర్ధరాత్రే ఆమె వెళ్ళిపోవడం చూస్తే నగల్తో దాటేసివుంటుందనే నాకూ అనుమానం కలిగింది. ఇంతలో హఠాత్తుగా మంచంకింద ఆమె నగలపెట్టె కంటబడేసరికి యేమున్నాయో చూడాలని బుద్ధిపుట్టింది. దగ్గిరికి వెళుదునూ తాళంకూడా దాన్నే వుంది. అందుచాత ఖాళీ అయివుంటుందన్న నమ్మకంతోనే పెట్టెతెరిచాను. [illegible]ని చూతునూ—నా హాశ్చర్యం యేంచెప్పను? [illegible]మో లేక మేలుకుని కంటున్న స్వప్నమో నాకే తెలీ[illegible]. ఆ గడియారపు గొలుసూ, నానుపేటా, జిగినీ, ముత్యాలహారం, బంగారు రిస్టువాచీ, గాజులూ, మువ్వలవడ్డాణం, పెళ్ళినాడుపెట్టిన వుంగరం అన్నీ వేటిస్థానంలో అవి నా కళ్ళముందు ధగధగా మెరిశాయి. నాకళ్ళు మరి చూడలేకపోయాయి—

న:—నిజమే. కలకాదు—

ధ :—ఆఁ కలే! నీవుకూడా కనబడుతుంది. చెల్లీ మంచంకిందవున్న ఆ నగలపెట్టె తీసుకురా అమ్మా.

[సీతారామ తొందరగావెళ్ళి నెమ్మదిగా నగలపెట్టెను తీసుకువచ్చి తల్లినుండు తెరచి జాగ్రత్తగా వొక్కొక్కటిగా పైకితీస్తూ వుంటుంది. తల్లికళ్ళు పెద్దవిచేసి ఆశ్చర్యంతో వాటిని చూస్తూ వుంటుంది]

సీ :—దీనిల్లు బంగారంకానూ. ముక్కుపుల్లా తలపిన్నూ దగ్గర్నించీ యెంత జాగ్రత్తగా అమిర్చిందో? అన్నయ్యా. ఇదిగో వుత్తరంకూడా—

ధ (అదిరిపడి అంతలోనే సంబాళించుకుని) :—ఏదీ?

[ఆమె అందివ్వగానే వొణుకుతున్న వేళ్లతో వుత్తరంవిప్పి ఆత్రతతో పంక్తులవెంట తన కళ్ళను నెమ్మదిగా నడిపిస్తాడు. హఠాత్తుగా అతనికళ్ళనుంచి రెండు నీటిబొట్లు చింది వుత్తరంపైన రాల్తాయి.]

న :—ఏం రాసింది?

ధ :—చదూ. (తిరిగి చెల్లెలిచేతికందిస్తాడు.)

సీ :—(చదువుతుంది.)

శ్రీ ధర్మారావుగారికి—

మీ తాలూకు నగలుగాని సొత్తుగాని యేమీ నాతో తీసుకువెళ్ళలేదని నమ్మిస్తున్నాను. మీరు నామీద అంతప్రేమా, ఆదరం చూపుతూవుంటే నేనింత కృతఘ్నతగా ప్రవర్తించడంచూసి చాలా కఠినాత్మురాలిననీ నీచురాలిననీ భావిస్తారు. కాని దేముడు నన్నిలా చేశాడు. నేనెంత నీచురాలినని మీరు భావించినా నా మనస్సంతా, హృదయమంతా ఇంకొకరిమీద వున్నప్పుడు దానిని కప్పిపుచ్చి మీమీద దొంగప్రేమ నటించేపాటి నీచురాల్ని మాత్రం కాను. ఎంత ప్రయత్నించినా కాలేకపోయాను. అట్లాకాకుండా ఇంకెట్లా అయినా మీయందు నాకున్న గౌరవం, విశ్వాసం మీకు తెలియజేయగలిగితే... మీకానందం కలిగించగలిగితే నావిధిని నెరవేర్చానని నమ్ముతాను. నాయందు మీరుచూపిన ఆదరణకీ, ఉదారభావానికీ జన్మ జన్మాంతరాలవరకూ మీకు కృతజ్ఞురాలిని—

ఇట్లు,

సుందరి—

న :—ఇంతవరకూ నువ్వీవుత్తరం చూడేలేదు—

ధ :—ఉఁహుఁ.

న :—అయితే యింతసేపూ యేంచేస్తున్నావు?

ధ :—...........

న :—ఇంకొకళ్లా యెవర్కీ వుత్తరం రాస్తున్నావటా—

ధ :—మామాకు—కాదు, శ్రీనివాసరావుగారికి.

న :—దేనికీ?

ధ :—మరిదేనికి? అతనొస్తే యీ విషయమై అతన్తో ఆలోచించాలని—

న :—ఆలోచించి యేంచెయ్యాలనీ వుద్దేశం?

ధ :—ఏమో. ఇప్పుడేం చెప్పలేను. కాని—వివాహమనగా యేమిటో, భర్తఅంటే యేమిటో తెలీని బాల్యావస్థలో ఆమె అనుమతి తీసుకోకుండా నాకు కట్టబడినంతమాత్రాన వొక అమాయకపు బాలిక యొక్క—

న :—ఓ.. అమాయకురాలు. ఎంత అమాయకురాలు కాకుంటే కట్టుకున్న భర్తనువొదిలి అర్ధరాత్రే లేచిపోతుంది? ఘండాలురాలు. కృతఘ్నురాలు—

సీ :—ఊస్. అదిగో. అత్తయ్య వొస్తూంది.

[అందరూ వీధిద్వారముకేసి చూస్తారు. వెంటనే చీడీదిగి వాకిటిమధ్యనున్న మాలతీ పందిరను సమీపిస్తారు. సరసమ్మా సీతారామా ఆ పందిరకిందనున్న గచ్చుతిన్నెపైన చతిగిలపడతారు. దాని కెదురుగావున్న టేకు బెంచీపైన ధర్మారావు జేర్లబడతాడు. సావిడిద్వారమున్న రాజలక్ష్మి మెల్లగా

[ప్రవేశించి నరసమ్మ చెంత తలవాల్చుకుని వోరగా నిలుచుంటుంది. ఆమె ముఖము విచారసూచకంగా వుంటుంది. వయస్సు ముప్పై ఐ అయిదేళ్ళలోపు.]

న (రాజలక్ష్మినుద్దేశించి) :—వొదినా! చూశావా? ఈ నాటకమంతా యెల్లావుందో!

రాజలక్ష్మి (విచారంతో):—ఏం చెయ్యనూ—? ఈ సంగతివిన్న దగ్గిర్నించీ మనసులో నేనెంత యేడుస్తున్నానో, యెంత కుమిలిపోతున్నానో ఆ పరమాత్ముడి కెరుక! జెప్పపని—కోతి పని చేసింది—మీ ముఖం చూడ్డానికే సిగ్గువేస్తూంది—

న :—అది మాయింటికి వచ్చిందిమొదలు యెంత చేశానూ? ఎంతముద్దుగా, యెంత గారాబంగా చూసుకున్నానూ?—

రా :—ఆసంగతి మీరు చెప్పాలా ?

న :—దాని తిండికిగాని, ముస్తాబుకిగాని, ఆటలకిగాని వొక్కనాడేనా యేమేనా లోటుచేశామా? ఇంత చేసినందు కేమేనా విశ్వాసముంచిందా? ఇలా బుద్ధి చెబుతుందా?

రా :—వొదినా ! ఏదో జరిగిపోయింది—అదంతా మీరు మరచిపోవాలి! ఇదిగో—, నా మొహం చూడండి! మీ పాదాలుపట్టుకుని వేడుకుంటున్నాను. అదంతా వొక చెడ్డకల అనుకోండి! ఏమీ జరగనే లేదనుకోండి! అసంగతి మరి తలబెట్టకండి! మళ్ళీ అటువంటి పాడుపనిచేస్తే మరిదాన్ని మీగుమ్మం తొక్కనీకండి! ఈసారికిమాత్రం యెలాగో గడిపుచ్చుకోవాలి! ఇదంతా మీకడుపులో పెట్టుకోవాలి !

న :—కడుపులో పెట్టుగోక యేంజేశానూ?

రా :—నిజమే, లేదని—

సీ :—అయితే మామయ్య యింట్లోలేడా యేమిటి? ఎక్కడికి పనిమీద—

రా :—ఆఁ పని? పనిమీద వెళ్ళినట్టేవుంది మా బతుక్కి. ఇంతకన్న యేంపనీ? దాన్ని తీసుకురావడానికేవెళ్ళారు అతనూ మా అన్నయ్యానూ.

న :—ఇంకా అదివొస్తుందనే నమ్మకం?

రా :—ఆఁ! రాకేంచేస్తుందీ? పసితనం! వొకసారి గడ్డితిని యేవో అవకతవకపని చేసింది. వాళ్ళనాన్నా, మామయ్యా గట్టిగా నాలుగు చీవాట్లువేస్తే అదే తిన్నగావుంటుంది! ఏంచెయ్యనూ! మా గర్భవాసం వొకటీ అవొకటీకాదు. అంతకన్న నేనేం చెప్పలేను.

న :—నువ్వింతచెప్పాలా మాకూ? దానికంటె మాకెవరున్నారూ? ఎంతముచ్చట పడ్డామూ? ఎంత ఆశ పెట్టుకున్నామూ? ఇంక మీ అల్లునిసంగతి మీకు తెలుసు కదా? ఎన్నడేనా దానియిష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడా? ఎంత ఆప్యాయంతో చూసుకున్నాడూ! ఒక్కనాడేనా వొక్కదెబ్బకాదు గదా, పల్లెత్తుమాట అని—

రా :—అమ్మమ్మ! అతడ్నెవరేనా అనుకోగలరా? అతను నిజంగా ధర్మరాజే. ఈకాలంలో పుట్టవలసిన మనిషికాడు.

న :—అందుకే అది ఆడిందిఆటా, పాడిందిపాటా అవుతూంది. లేకుంటే కాపరంచేస్తున్న పడుచుపిల్ల ఆ పోకిరీవెధవతో ఆ నవ్వులూ, ఆకళ్ళ విసుర్లూ, ఆ షికార్లూ, చెలగాటలూ... ఎవరు సహిస్తారూ?

రా :—ఆ మూర్తిగాడితో టేనా?

న :—ఇంకెవడితోనూ ?

రా :—అయ్యో! ఆ వెధనపీనుగ యిక్కడకూడా యెలా దాపరించాడూ శనిగ్రహంలాగా, జునపాలూ వీడూ పాడుమొహం వేసుకుని—?

న :—అదివరకు వాడి మొహమేమిటో సంగతేమిటో మే మెరగం. మీపిల్ల మాయింటికివచ్చిన వారం రోజుల్నాడే మొదటిసారి వాడు మాగుమ్మం తొక్కడం ఆవేళమట్టుకు యేదో ముక్తసరిగా మాటాడి వెళ్ళిపోయాడు. ఆ మర్నాటినుంచీ ప్రతిరోజూ రెండుపూట్లా హాజరూ! మీపిల్లతో బాగా చనువుచేసుకున్నాడు. అంతకంతకూ భోజనానికి యేం వెళ్ళావాడో. ఎప్పుడూ యిక్కడే బస. ఇహ నేముందీ? మీ అమ్మాయితో యెకసెక్కాలూ, చీట్లాటలూ, ఓ—పాటలూ, పద్యాలూ, కథలూ, కబుర్లూ వొహ టేమిటి? ఎగరగొట్టేశాడు. వీడి వ్యవహారంచూస్తే యేం బాగులేదు—

వీణ్ణిల్లుచేరనివ్వడం మంచిదికాదని శతపోరాను. కాని నామాటేం వినిపించుకున్నాడా? వాడటువంటి మనిషి కాడు. బాల్యంనుంచీ వాళ్ళిద్దరూ వొక్కచోటే కలిసి మెలిసి వుండడంచాత చనువుగావుంటారు. అని నా మాట వొట్టిపోల్లుకింద కొట్టేశాడు.

రా (ధర్మారావు నుద్దేశించి):—అయ్యో! ఎంత అమాయకుడివి బాబూ! ఇప్పటిలోక మెల్లావుందో నువ్వెరగవు; ఆ వెధవసంగతి నీకు తెలిసిందికాదు—

ధ:—బాగుంది!—వాడిసంగతి నాకు తెలీకపోవడమేమిటి? పూర్తిగా తెలుసు. వాడు పడుచువాడూ, చూడ్డానికి చాలా అందంగావుంటాడూ, సరసంగా మాటాడుతాడూ, యింగ్లీషుకూడా బాగా చదువుకున్నాడూ, మంచి భావనాశక్తి కలవాడూ, కథలూ అవీ చక్కగా రాస్తాడూ—

రా:—వెధవకథలు—ముష్టివెధవ కథలూ, ముష్టి వెధవ రాతలూనూ! వాడు కథలురాస్తే యెవరిక్కావాలి? రాయకపోతే యెవరిక్కావాలి? ఆ సంగతి కాదు నే అంటున్నది—

ధ (కోంటెగా):—మరే సంగతీ?

రా (కొంచెంతీవ్రంగా):—వాడొట్టి పోకిరీవెధవ—ఆడంగిపీనుగ—చిన్నప్పట్నించీ వాడిమోస్తరొక్కలాగేవుంది. ఆడవాళ్ళతో సిగ్గుమాలిన తిరుగుళ్లు తిరగడం వొక్కటే వాడికిచాతౌను. వాడే మాపిల్లని పాడుచేశాడు—బంగార్లాంటి మాపిల్ల మనసులో దురూహాలు ప్రవేశపెట్టాడు—

ధ:—దురూహాలో మంచివూహాలో నాకు తెలీవు—కాని, (చిరునవ్వుతో) మీపిల్లను బాగా మంత్రించి వలలో వేసుకున్నాడు. ఆమె శరీరాన్నీ, మనస్సునీ, ఆత్మనీకూడా పూర్తిగా లాగేశాడు—

రా:—అయితే ఆసంగతి నీకు తెలుసూ? ఎప్పుడు తెలిసిందీ?

ధ:—ఎప్పుడేమిటి? మొదణ్ణించీ తెలుసు.

రా:—ఆఁ! మొదణ్ణించీ తెలుసూ? తెలిస్తే ఆ వెధవనెందుకు చేరనిచ్చావూ? వాడితో స్నేహం యెందుకుచేశావూ? వాడితో స్నేహం శత్రుత్వంకంటే కూడా చెడ్డది. ప్రమాదకరమైంది—

ధ:—ఏంచెయ్యనూ? విధిలేక చెయ్యవలసివచ్చింది. లేకుంటే వాడితో నాకేం సమ్మంధం? ఈడా, జోడా, సహవాసమా, మీ పిల్లగురించే కాకపోతే వాడితో స్నేహానికి నాకేంపనీ?

రా:—అదేమిటీ? నీమాటలు నాకేం అర్థంకావడం లేదు. మాపిల్లగురించి నీకు వాడితో స్నేహమేమిటీ!

ధ:—అంటే, వారిద్దరూ తరుచుకలుసుకుందికి తగిన అవకాశం కలిగించడంకోసం.

రా:—నీసంగతి చాలా విపరీతంగావుంది! నీ భార్యను కలుసుకుందికి వాడికి నువ్వు అవకాశం కలిగించడం... వాడికేం అధికారముందీ?

ధ:—నాకేం అధికారముందీ!

న:—ఏమిటదీ? నీ కేం మతుండే మాటాడుతున్నావా? నీ కధికారం లేకపోవడమేమిటీ? నీభార్య—నీ యాజమాన్యంలో వుండవలసిందీ!

ధ:—ఆఁ! యాజమాన్యం! అన్నిటిపైనా యాజమాన్యం వహిస్తాం. వహించగలం. కాని, మానవహృదయాలపైని కూడా—!

సీ:—అన్నయ్యా! అయితే వొకవేళ అది యౌవనమదంచాత మత్తులోపడి పరాయివాడిమీద కన్నువేసిందే అనుకో! దాన్నెలాగో ఆ దృష్టినుంచి మళ్ళించడానికి ప్రయత్నిస్తావా? లేక గుండెమీద కుంపటిలాగు వాణ్ణికూడా యింటిమీద తెచ్చిపెట్టుకుని దానికి మరింత ప్రోత్సాహం కలిగిస్తావా?

ధ:—అయ్యోతల్లీ! నేనామాత్రం ఆలోచనాపాలోచనా లేకుండా ప్రవర్తించాననే కాబోలు నీ వుద్దేశం? ఆమెమనసు మళ్ళించడానికి, ఆమెను స్వాధీనం చేసుకుందికి యెన్నివిధాల యెంత ప్రయత్నించానో నీకేం తెలుసు? ఆమె యిక్కడికి వచ్చింది మొదలు ప్రతిరాత్రీ కూడా ఆగదిలో వొంటరిగాకూచుని యెప్పటికైనా ఆమె నాచెంతకు వస్తుందేమోఅని ఎంత ఆశతో, కాంక్షతో నిరీక్షించేవాణ్ణి? చిన్న చప్పుడయ్యేసరికి ఆమె వస్తున్నాదేమోఅన్న ఆనందంతో గుండెలు దడదడా కొట్టుకునేవి, కాని—యెంతకీ ఆమెజాడే వుండేది

కాదు. రాత్రుళ్ళన్నీ అలాగే ఆమెనే ధ్యానించుకుంటూ హృదయాన్నిదహించే వుద్రేకంతో, నిరాశతో, యేమిటో తెలీని, చెప్పలేని, భరింపలేనిబాధతో గడిపేవాణ్ణి. ఇహను తెల్లవారిందిమొదలు తిరిగి సాయంత్రమయ్యేవరకూ కూడా ఆమెనువొదల్లేక, ఆమెనుంచి, ఆమె ముఖంనుంచి నాకళ్ళను తిప్పుకోలేక నా పనులన్నీ వొదులుకుని ఆమెచెంతనే కూచునేవాణ్ణి. అల్లా యెంతసేపుకూచున్నా వొక్కసారన్నా నావేపు ముఖమేనా తిప్పేదికాదు. ఏదో దీర్ఘాలోచనలో పడ్డట్టు, మనసు మనసులోలేనట్టు, రాయిలాగు, మోడులాగు దిగాలుపడి కూచునేది. ఒక్కమాట, వొక్కనవ్వు, వొక్క చల్లనిచూపు, వొక్క సంజ్ఞకూడా ఆమెకు నామీద ప్రేమని నన్నెక్కడ భ్రమింపజేస్తాయో అని భయపడుతున్నట్టూ తోపించేది. ఇల్లా యెంతకాలమని? ఒక్కొక్కసారి ఆపుకోలేనంత దుఃఖంకలిగి యేడుపుకూడా వచ్చేది. ఆ వుత్తరక్షణంలోనే ఆమెపైని పట్టరానంత కోపం వచ్చేది. ఒక్కసారి ఆమెనంతా కాళ్లాచేతాకుమ్మెయ్యాలని బుద్ధిపుట్టేది. కాని కొంచెమాలోచిస్తే అంతకోపానికి ఆమె నాకుచేసిన అన్యాయమేమీలేదని నాకే తోచేది. నన్నూ, నా వెర్రితనాన్నీ చూసి తిరిగి నాకే సిగ్గువేసేది తరకు విసువెత్తేది. ఆ నారాయణమూర్తి వొచ్చేసరికి ప్రపంచంలోవున్న ఆనందమంతా వొక్కసారి ఆమెకు లభించినట్టూ పొంగిపోయేది. అతని ముఖం చూస్తూ వొళ్ళు మరిచిపోయేది. అతనితో మాటాడుతూ మాటాడుతూ ప్రపంచమంతా మరిచిపోయేది. అప్పటి ఆమె వుత్సాహం, ఆనందం చూడ్డానికి నాకే సరదావేసేది. ఇహను అతణ్ని రానివ్వక నేను చేసేదేముందీ? ఆమె నాకోసం చెయ్యబడనప్పుడు ఆమెమనసంతా, హృదయమంతా అతనిమీదే వున్నప్పుడు అతణ్ని ఆటంకపర్చి లాభమేముందీ! ఆమెనంటే పురోహితుని చేతుల్లోంచి పుచ్చుకున్నాను గాని ఆమెపైని నాకేం హక్కుందీ? వొకవేళ మీరు భావించినట్టూ బలవంతాన ఆమెను స్వాధీనంచేసుకుందికి ప్రయత్నించినా ఆమెశరీరాన్ని నా ఆధీనంలో వుంచుకోగలను. కాని ఆమె మనసునీ, ఆత్మనీ, ప్రేమనీకూడా అరికట్టడం నా స్వాధీనంలోవుందా? అది మానవుల స్వాధీనంలోవుందా? అందుకు ప్రయత్నించడం వట్టి నీచమూ, నిష్ఫలమూ అని నా వుద్దేశం—

న :—మనస్సూ, ఆత్మానూ? మొదణ్ణించీ యిలాంటి వెర్రివేదాంతం పెట్టుకునే దానివొళ్ళు దానికి తెలీకుండాచేశావు. మనస్సు—అది కోతిలాంటిది. ఓ స్థిరంగా వుంటుందా? విచ్చలవిడిగా వొదిలిస్తే అచ్చువిడిచిన అబోతులాగ, చుక్కానులేని వోడలాగ దానిష్టమొచ్చినట్టూ గిరగిరా తిరుగుతుంది. దానికి కూడా కొంచెం అడ్డూ ఆపూ వుండాలి. లేకపోతే వుండేటట్టు చెయ్యాలి—

ధ (వీధిద్వారమువంక చూస్తూ):—అదిగో! వారంతా వొస్తున్నారు. (అందరూ సావిడికేసి చూస్తూవుంటారు.)

[అప్పుడు శ్రీనివాసరావూ, అతనివెనక కుమార్తె సుందరీ, ఆమెవెనక గోపాలం—సుందరి మేనమామా మెల్లగా వాకిట ప్రవేశిస్తారు.

శ్రీనివాసరావు సుమారు నలభై యేళ్ళవాడు. తెల్లని ఖద్దరుపంచా, లాల్చీ, పైమీద జామారు తువ్వాలా ధరించి వుంటాడు. చిన్న క్రాపూ సన్నని మీసమూ వుంటాయి. సదా చిరునవ్వుతో నిండిన అతని పెదవులూ, నీళ్ళకంటె నిర్మలములైన విశాల నేత్రాలూ అతడు బహుశాంతిప్రియుడని చాటుతూ వుంటాయి. అతని ముఖములోనూ, ప్రతిమాటలోనూ యెంతో విమర్శనాదృష్టి గోచరిస్తూ వుంటుంది.

సుందరి—ఆమెకు పదహారేళ్లు దాటివుంటాయి. బొద్దు శరీరం. సామాన్యమైన పొడుగు. కుండ్రంగా నున్నగావున్న ఆ వెన్నెల చంపలూ, ఆ బుజాలవంపులూ, కండలూ ఆమె ఆరోగ్యాన్ని తెలియజేస్తూ వుంటాయి. విరబోసుకున్న ఆమె పెద్దజుట్టు నొక్కులు నొక్కులుగా సముద్రపు అలలచే కొడగబడిన నల్లని యిసకవలె పిరుదులమీదకు ప్రేలాడుతూవుంటుంది. లేడిపిల్ల కళ్లకంటె

చంచలమైన నల్లని పాపలుగల పెద్దకళ్లూ, తీర్చినట్లూ ముక్కూ, తీర్చైన గులాబీ పెదవులూ, వాటిమధ్య తళతళలాడే పలువరసా, ఆ మున్నటికి వొంటిమెరుపూ, పొడుగాటి సన్నని వేళ్లూ, వాటిచివర మెరిసేగోళ్లూ అన్నీ యెంతోముద్దుగా, ఆకర్షణీయంగా వుంటాయి. ఆమెధరించిన లేతగులాబీ చీరా, మబ్బునన్నె పొట్టిచేతులరవికా యెంతో నాజూకుగా కనబడుతూవుంటాయి. నిజానికి యేదుస్తులు వేసుకున్నా అందంగాకనబడే సహజమైన లావణ్యం, అవయవసౌష్టవం ఆమెలోనే వున్నవని చెప్పవచ్చును. కంఠస్వరం వీణమోగుతున్నట్లూ వుంటుంది. ఆమె వైఖరినిబట్టి ఆమె తప్పుపనిచేసినా నిర్భయంగానూ, బాహాటంగానూ చేసే రకములోనిదని మనం గ్రహించవచ్చును.

గోపాలం సన్నంగా, పొడుగ్గా, తెల్లగా వుంటాడు. ముఖంకోలన. అతణ్ణి చూడగానే గడుసువాడనీ, వ్యవహారస్తుడనీ సమయస్ఫూర్తి గలవాడనీ స్ఫురించుచుండును.

వారు సమీపించగానే ధర్మారావు లేచి 'రండి, దయచేయండి' అని శ్రీనివాసరావుకూ, గోపాలానికీ కుర్చీలు చూపిస్తాడు. శ్రీనివాసరావు నెమ్మదిగా బెంచీపైన కూచుంటాడు. అతనికి కుడిచేతివైపున గోపాలం, అతనిపక్కని ధర్మారావూ కూచుంటారు. శ్రీనివాసరావుకి యెడమవైపున బెంచీచివర నానుకుని తల్లికిదగ్గరగా తలవంచుకుని సుందరి నిలుచుంటుంది.]

రా (సుందరినుద్దేశించి తీవ్రంగా):— తల్లీ! వచ్చావమ్మా! కని పెంచినందుకు వుద్ధరిస్తున్నావు—అమ్మా! ఇవేబుద్ధులు కులానికీ కన్నవాళ్ళకీ కీర్తితెచ్చేవి—సాటివాళ్లో తలవంపులు...

సుందరి (నెమ్మదిగా తలయెత్తకుండానే):—అంత తలవంపులికి నేనేం తప్పుపనిచేశానూ?

రా :—అయ్యో! ఇంతకన్న యేం చెయ్యాలి! ఇంకా యిప్పుడుచేసింది చాలిందికాదూ? పైగా యేం జేశానని అడుగుతున్నావు! నీకేం యిల్లాంటి దుర్బుద్ధిపుట్టిందీ? చిన్నదానివా చితకదానివా? జ్ఞానంవచ్చి భర్తతో కాపరం చేస్తున్నదానివి ఆ పరాయివెధవతో...(నోరు నొక్కుకుని) సిగ్గుసిగ్గు...

సుం :—ఎవరు పరాయివాడూ?

రా (త్రుళ్ళుపడినట్టు):—ఆఁ! ఎవరా? ఆ వెధవ పరాయివాడుకాక మరెవడూ? నీకేమౌతాడూ? సోదరుడా, బంధువా, ఆప్తుడా? ఆ పోకిరీవెధవతో నీకేం సంబంధంవుందని పరిగెత్తావూ! నాపరువు తియ్యడానికీ—నాప్రతిష్ఠ పాడుచెయ్యడానికీ—నా గౌరవం మంటగలపడానికీ—

సుం:—అమ్మా! నువ్వేమనుకున్నా సరేగాని అతను పరాయివాడని నా మనస్సెన్నటికీ వొప్పుకోదు—అతనే పరాయివాడైతే నాకీలోకంలో ఆప్తులేలేరు.

రా :—ఆప్తుల్లేరూ?...భర్త—?

సుం :—ఎవరు భర్తా?

రా (హఠాత్తుగా దెబ్బతిన్నదానివలె):—ఆఁ, ఆఁ...నువ్వేనా ఆమాటలంటున్నదీ? లేక యేదన్నా గ్రహంపట్టి నీచేత అలా పేలిస్తూందా? పండువంటి సంసారం, నిక్షేపంలాంటి భర్తా ప్రాప్తంలేదు కావోలు! ఎందుకిలాంటి దుర్బుద్ధి పుడుతూందీ? ఎవరు బోధిస్తున్నారూ?

గోపాలం :—అక్కయ్యా! నువ్వూరికే దాన్నలా బెంబేలెత్తించీడం యేం బాగులేదు. చిన్నపిల్లా—పాపం! తెలీక వొకవేళ తప్పుపనిచేసిందే అనుకో! దాన్ని సరిపుచ్చుకుని అమ్మా! అదితప్పు, అల్లాకూడదు. అని నెమ్మదిగాచెబితే అదే వినుకుంటుంది. అంతేగాని గుమ్మంలో కాలుపెట్టింది లగాయితూ ధుమ్రాబుసూమని కూకలేయడం మొదలెడితే దానికేం తోస్తుందీ?

సుం:—మామయ్యా! నీధోరణిచూస్తే నువ్వుకూడా నేనేదో తప్పుపనిచేశానని భావిస్తున్నట్టుగా వుంది—కాని నేను చేసింది తప్పని నాకు బోధపడలేదు.

(కొదువ.)

—ఆకుండి సత్యనారాయణ.

# సంపాదకీయ సమాలోచన

## ఆంధ్ర ఇన్సూరెన్సుకంపెనీ వార్షికనివేదిక

1933-వ సంవత్సరపు ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీవారి నివేదిక విమర్శనార్థము మా కార్యాలయమునకు పంపబడినది. ఈ కంపెనీకి ఇది అష్టమ వత్సరము. ఆంధ్రఇన్సూరెన్సుకంపెనీ చరిత్రలో నివేదితవత్సరము రెండు విషయములచే అతి ముఖ్యమైనదగుచున్నది. ఒకటి: గత ఏడువత్సరములలో ఏ ఒక్క సంవత్సరమునగాని జరుగనంతటి వ్యాపారము ఈ వత్సరమున జరుగుట. రెండు: కంపెనీకి స్వగృహము సమకూడుట. నివేదితవత్సరమున రూ. 26,26,250 లకు 2914 ప్రొపోజల్సు చేయబడినవి. అందు 1790 ప్రొపోజల్సు రూ. 19,42,150 లవి పాలసీలుగా నమోదుకాబడినవి. మిగిలిన ప్రొపోజల్సులో 117 ఈ వత్సరము పాలసీలైనవి. మిగిలినవానిలో కొన్ని నిరాకరింపబడినవి, కొన్ని వాయిదా వేయబడినవి, కొన్ని పాలసీలగు ముఖస్థమునకు వచ్చియున్నవి. ఆర్థిక మాంద్యము ప్రబలియున్న ఈ దినములలో కంపెనీవారిట్టి విశేషవ్యాపారమును కూర్పగలుగుట నిజముగా ప్రశంసనీయమైనది. ఈ క్రింది అంకెలు గత నాలుగు వత్సరములలో కంపెనీవారి వ్యాపారాభివృద్ధిని తెలుపును.

| వత్సరము. | | జారీచేయబడిన పోలసీల సంఖ్య. | | పాలసీల మొత్తము. |
|---|---|---|---|---|
| 1930 | ... | 892 | ... | 13,73,000 |
| 1931 | ... | 1018 | ... | 14,33,000 |
| 1932 | ... | 1286 | ... | 14,80,000 |
| 1933 | ... | 1790 | ... | 19,42,000 |

కంపెనీయొక్క రాబడి, జీవితనిధులు మున్నగువానిని తెలుపు క్రింది అంకెలుగూడ గమనింపదగినవి.

| సంవత్సరము. | | ప్రీమియము రాబడి. | | వడ్డీ. | | జీవిత నిధులు. | | నూటికి ఖర్చు. |
|---|---|---|---|---|---|---|---|---|
| 1930 | ... | 1,93,000 | ... | 10,500 | ... | 2,15,100 | ... | 39 |
| 1931 | ... | 2,11,400 | ... | 16,200 | ... | 3,27,000 | ... | 30.14 |
| 1932 | ... | 2,50,200 | ... | 24,200 | ... | 5,11,400 | ... | 30.12 |
| 1933 | ... | 2,98,200 | ... | 30,372 | ... | 7,16,878 | ... | 35 |

దీనివలన కంపెనీవ్యాపారము నిలుకడయైన క్రమాభివృద్ధి నందుచుండుట తెలియవచ్చును. 1932-వ సంవత్సరమునకంటె 1933-వ సంవత్సరమున ఖర్చుకొంచెము అధికమైనది. అయితే ఈవ్యయము అకారణముగ నైనదికాదు. దేశమున ఆర్థికమాంద్యము ప్రబలియున్నది, అగుటచే భీమాచేయువారి సంఖ్య నెలజీతముగల ఉద్యోగస్థులకు నియమితమైనది. కాగా భీమావ్యాపారము సమకూర్చుటలో పోటీహెచ్చి వ్యయాధిక్యమునకు కారణమైనది. ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీవారు నివేదితవత్సరమున చక్కని భవనమును సంపాదించిరి. స్వగృహసంపాదన కంపెనీవారి ప్రతిష్ఠను హెచ్చించుటయేగాక దాని స్థిరత్వమునుగూర్చి ప్రజాలోకమున నమ్మకమునుపెంచినది. క్లెయిములను పరిష్కరించుటలో కంపెనీవారు అత్యంత శ్రద్ధవహించి వ్యవహరించుచున్నటుల నివేదిక తెలుపుచున్నది. ఈ కంపెనీ ప్రజలమన్ననను బడయగల్గుట కిదియొక ముఖ్య హేతువు. కొలది వత్సరములలో ఇంతటి గొప్ప అభివృద్ధి నందిన ఈసంస్థ ఇంకను హెచ్చు ప్రజావినియోగమునకు అక్కఱకు రాగలదని నమ్ముచున్నాము.

# ఇన్స్యూరెన్సు విషయములు

## జీవిత భీమా: కొన్ని ఆలోచనలు

## డాక్టరు పరీక్ష

భీమాతత్వాన్ని గురించి విచారించినప్పుడు, యీ వ్యాపారం కొన్ని లోకానుభవాన్ని పట్టి ఏర్పడిన ధర్మ సూత్రాలమీద యాధారపడి యున్నదని స్పష్టం అయింది. గనుక యీ వ్యవహారం నడపుటకు, ఆ సూత్రాలు బాగా తెలిసి తమ బాధ్యతల నెఱింగి మెలగగలవారే నిర్వాహకులుగా వుండాలి. ఈ వ్యాపారం నిర్వహణం, కంపెనీ ముఖ్యస్థానంలో యుద్యోగులే కాకుండా, వ్యాపారాన్ని సంపాదించే ప్రతినిధులు కాకుండా, యీ కంపెనీలు యభ్యుదయమునకు బాధ్యులైన మూడోవ తరగతివారు యింకొకరున్నారు. వారెవరంటే డాక్టర్లు - వారు చేసేపని ఏమంటే, కంపెనీ యందు చేరదలచినవారి యారోగ్యమును పరీక్షించి, వారి అర్హతానర్హతలను నిర్ణయించి, కంపెనీకి సలహానొసంగుట.

ఈ వ్యాపార తత్వాన్ని మొదటి ఒకటి రెండు వ్యాసాలలో విమర్శించినాము. వానిని బట్టి దీర్ఘకాలము యారోగ్యవంతులై సజీవులైయుండు వారి మీదనే కంపెనీయొక్క భవిష్యత్తంతయు యాధారపడి యుండునని పాఠకులు తెలిసికొనియే యుందురు. అట్టివారు బహుమంది కంపెనీయందు చేరిననె తప్ప, ఎప్పుడైనను ఒక పాలిశీదారుడు చనిపోతే, దురదృష్టవంతులకు కుటుంబీకులకు భీమా మొత్తంద్వారా (Claim amount) సహాయం జరుగదు. కాని ప్రపంచంలో మోసం హెచ్చు. 'కొద్ది మొత్తం హెచ్చు మొత్తాన్ని సంపాదించవచ్చు' అనేటప్పటికి కంపెనీలను మోసం చేయడానికి దుర్మార్గులు ప్రయత్నం చేస్తారు. ఈ అపాయాన్ని తప్పించుకోవడానికే కంపెనీలు డాక్టరు పరీక్షను ప్రవేశ పెట్టారు.

పైన వ్రాసినదానివలన డాక్టరుపరీక్ష 'కంపెనీ ప్రాణం' అని చెప్పవచ్చు. అట్టిపనిని చేసేవాండ్లు డాక్టర్లు. కంపెనీకి ఎక్కడెక్కడ ప్రతినిధులుంటారో, అక్కడల్లా, కంపెనీవారే డాక్టర్లను ఏర్పాటుచేస్తారు. కంపెనీఏజంటు కంపెనీయందు చేరదలచుకొన్న దరఖాస్తుదారున్ని తీసికొని వెళ్ళుతాడు. డాక్టరు వాని శరీరమును జాగ్రత్తగా పరీక్షించి, పరీక్షాఫలితములను, కంపెనీవారిచే తయారుచేయబడిన ఫారంలో వ్రాసి కంపెనీకి నేరుగా పంపిస్తాడు. అతనుచేసిన కష్టానికి తగిన ప్రతిఫలం కంపెనీవారె అతనికి ముట్టచెబుతారు.

డాక్టరు తయారుచేసే ఫారంలో రెండు భాగాలుంటాయి. ఒకటి దరఖాస్తుదారుని యడుగవలసిన ప్రశ్నలు. ఈ ప్రశ్నలలో అతని కుటుంబ యారోగ్యానికి సంభవించిన ప్రశ్నలు చాలావుంటాయి. ఈ

ప్రశ్నల జవాబువలన, యీతని తలిదండ్రులు దీర్ఘజీవులా? కాదా? యనియు వంశానుగతమైన కుష్టు మొదలైన రోగములు కలవారా? కారా? యనియు, దరఖాస్తుని నిత్యజీవనము ఆకస్మిక మరణమునకు తావిచ్చునా మొదలగు విశేషాంశములను తెలిసికొనటానికి వీలుగా వుంటాయి. వీటికన్నిటికి, సక్రమమైన తనకు తెలిసినంతవరకు నిజమైన జవాబు లివ్వాలి. లేక పోయినయడల, అనగా కంపెనీని మోసంపుచ్చే దురభిప్రాయంతో అబద్ధపు జవాబులిచ్చినట్లయితే, కంపెనీ పాలిసీసొమ్మను యిచ్చేటప్పుడు అభ్యంతరం పెట్టవచ్చు. అలాంటి సమయాలలో తప్పించుకోడానికి కంపెనీవారికి చట్టసంబంధమైన సహాయంకూడా వుంది.

డాక్టరు తయారుచేసే ఫారం రెండవభాగంలో, శరీరపరీక్షావివరాలుంటాయి. వీటివలన ప్రస్తుతం ఆరోగ్యస్థితి లావున్నదో, కంపెనీవారు దానిమీద భాధ్యత వహించవచ్చునో లేదో తెలిసికొనుట కవకాశముండేటట్లుగా ప్రశ్నలు, వివరాలువుంటాయి. ఇవన్ని పూర్తిఅయిన తరువాత, డాక్టరు తన యభిప్రాయాన్ని వ్రాస్తాడు.

డాక్టరు పరీక్షయొక్క ప్రాముఖ్యాన్ని తెలిసికొన్నాం. కంపెనీయొక్క ప్రతినిధి, డాక్టరు దరఖాస్తుదారుడు ముగ్గురుకలిసి కంపెనీని మోసంచేయగూడదా? అన్నప్రశ్న రావచ్చును. అట్లను చేయుటకవకాశాలున్నాయి! అలాచేసే, 5,10 శిక్షపొంది జైలుకువెళ్ళిన వాండ్లుకూడా వున్నారు.

(సశేషము).

—జమిలి నమ్మాళ్వారు.

# ప్రవాసి

కష్టమే జీవితంబుగా కలిగిన ప్రవాసీ! నడచునపుడు నీ అడుగులలో పిడుగులు పడుచున్నవి; నీ కొరతపడిన చూపులో మేఘముల కలకల మెండుకొనుచున్నది.

పువ్వులదండలు గ్రుచ్చుచున్న నీ చేతుల ప్రయత్నముగా తమంతతామే పోవుచున్నవి; కాని నీ భావములు, నీ వెంతప్రయత్నించినను, కన్నీటి కతలు తప్ప మరేమియు చెప్పకున్నవి.

పూర్వపు కష్టములు నీగృహమందు ఘోషించుచున్న వాక్కులు, నీవు చీకటిలో పూవులమ్మునపుడు వినబడును.

నీ మొగముపై బడిన ముడుతలు విధి కఠిన హస్తములు ఏబది హేమంతముల వరకు కోసిన కష్టపురంపపు కోతలవలె నున్నవి.

నీచిత్త మెట్లున్నను, కడుపునకై నీ వెంత కష్టించుచున్నను, నీచూపులు మాత్రము, మాతృహీనయైన నీ ఏకపుత్రిక పోవుచున్న ప్రాణముల వెంటనున్నవి.

నీ దీర్ఘ నిశ్వాసములలో భాగ్యశాలుల కఠినవాక్యములు కొట్టుకొనిపోయి, దేవుని కరుణాశ్రవణములలో రాళ్ళవలె పడుచున్నవి.

నీ వల్లుచున్న పువ్వులదండలో అపూర్వ ప్రేమతో నీవెంట దయావీక్షలంపిన దుఃఖజీవి చూపులల్లుకొను చున్నవి.

నీ హృదయమును కాల్చుచున్న దుఃఖము లోకమునే మాడ్చి వేయునని నీ గద్గద కంఠము సూచించుచున్నది.

వజ్ఝల కాళిదాసు.




## శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవుసరములేదు. మీగ్రామము పచారిషాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0-4-0 ధరకేదొరకును.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను బోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిబొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సంll ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కు పిల్సు), హిమసారతైలము (బేదింగ్ అండ్ హెయిరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

కలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్ స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు

భారతభైషజ్యనిలయము, వేపేరి, మదరాసు, అని వ్రాయవలెను.

## గంధర్వకల్ప

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు తియ్యని లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పుపొందినది.

పౌను రు. 3—0—0.

గంధర్వఫార్మసీ, రాజమండ్రి.

## స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను బోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమురోజులమందు. రు 4-0-0.

### బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.

6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసి.

320, తంబుశెట్టి వీథి, మదరాసు.

# జయవిజయ యిన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్

(పూర్వపు జయభారత్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్.)

ప్రకటన.


పరస్పర లాభపద్ధతిలో తీసుకొనబడిన భీమాపట్టాలు, మిక్కిలి లాభకరమైన షరతులతో క్రొత్తగా ప్రవేశపెట్టబడిన శాస్త్రీయ ప్రణాళికలోనికి మార్చుకొదగిన ఏర్పాట్లు చేయబడినవి.

ఈ అవకాశము నుపయోగించుకొన నుత్సాహపడు ప్రస్తుత పట్టాదారులు ప్రధాన కార్యాలయమునుండి వాని వివరములను తెలుసుకొనవచ్చును.

ఈ క్రొత్త ప్రణాళికను అమలులోనికి తీసుకొనివచ్చుటకు నెల 1 కి రు 35 ల నుండి రు 450 ల వరకు జీతముపై పనిచేయుగల ఏజెంట్లు కావలయును. వివరములకు వెంటనే వ్రాయుడు.

**4-105 ఆర్మీనియన్ వీధి, మదరాసు.**

# Tri-Colour Process Blocks




M
C
Appaswamy Chetty & Co.
PROCESS ENGRAVERS
64 Savarimuthu St Mannady MADRAS

# కామప్రియ

గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన

**తాత కృష్ణమూర్తి, బి.ఏ; యల్.టి.**

ఇది సులభశైలిని వ్యవహారిక భాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు (ఎం.ఏ; పి. హెచ్.డి.) గారి పీఠిక కలదు. క్రౌన్ సైజు, వెల **12** అణాలు.

ఈ మనోహరగ్రంథము భాషాసతి కొకమండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి.

హాస్యరసగర్భితము. —వినోదిని.

కథలు మిక్కిలి ముచ్చట లూరుచున్నవి. —భారతి.

కథలలోన హద్దుమీరని స్వేచ్ఛయొక్కఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:

తాత కృష్ణమూర్తి, భద్రాచలం.

# సువర్ణసుందరరసము

## సర్వప్రమేహములకు సంజీవివంటిది

ఎటువంటి ప్రమేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరములేదు. అనేకులు వాడి మెచ్చియున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవముగల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రలు: రు. 5-0-0.

# ఆర్షరసాయనశాల, ముక్త్యాల

## [illegible]త్రికభస్మము.

—: అమృతమువంటిది :—

బహుమూత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూత్రమునందుండు చక్కెరను మాయము చేయును. ప్రశస్తమైన రసాయనము. వెల: తులము 1 కి: రు. 5-0-0.

కన్సల్టింగు ఫిజీషియన్ :—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రిగారు, ఎ.ఎం.ఎ.సి.



## నిద్రాహీనత

మనుజునకు నిద్రాహీనత దేహమనో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజునకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధము, అజీర్తి, తలనొప్పి, ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలు పడి బహునిస్సత్తువగ నుండును.

జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను పెంపొందించుట కేర్పడి మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనమువల్లను దౌర్బల్యహేతువగు సమస్తవిధజాడ్యములును అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును. స్త్రీ పురుషులెల్లరు సేవింపతగిన ఉత్తమ బలవర్ధకౌషధము.

## జీవామృతము

**(ప్రాణారోగ్యప్రదాయిని)**

పెద్దసీసా రు. 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.

ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును, లేక

ఆయుర్వేదాశ్రమము.

151, గోవిందప్పనాయకవీథి, తపాలుపెట్టె 287,

మదరాసు.

## ది సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమునకంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను. ఎందువలన? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము కొందలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుంట వలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకయే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.




## శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవసరములేదు. మీ గ్రామము పచారిషాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0-4-0 ధరకేదొరకును.

## గంధర్వకల్ప

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు తియ్యని లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది.

పౌను రు. 3—0—0.

గంధర్వఫార్మసీ, రాజమండ్రి.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను బోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిపొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కొరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం॥ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కు-పిల్సు), హిమసారతైలము (బేదింగ్ అండ్ హెయిరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్ స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు

భారతభైషజ్యనిలయము, వేపేరి, మదరాసు, అని వ్రాయవలెను.

## స్వర్ణమాలిని

ఇత్యాది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను బోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమురోజులమందు. రు 4-0-0.

### బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.

6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసి

320, తంబుశెట్టి వీథి, మదరాసు.